Published from Visakhapatnam
PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com


మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.
వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

విశాఖపట్నం Visakhapatnam
సంపుటి : 01 | సంచిక : 150 | శుక్రవారం | మే 8, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 01 | Issue No : 150 | Friday | 8 MAY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# ఉపరితల ద్రోణి..

## రెండు తెలుగు రాష్ట్రాలకు 3 రోజుల పాటు వర్ష సూచన

- కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వెల్లడించిన వాతావరణ శాఖ
- ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనాన్ని కలిగించే వార్త చెప్పింది. కర్ణాటక నుండి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ఈ వాతావరణ మార్పుల వల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, వాతావరణం చల్లబడే అవకాశం ఉంది. తెలంగాణ విషయానికి వస్తే... జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు.

2 – పేజీలో..




## బీహార్ మంత్రివర్గ విస్తరణ

- నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్‌తో సహా 32 మంది మంత్రులు ప్రమాణస్వీకారం

పాట్నా : బీహార్ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కొత్తగా జరిగిన మంత్రివర్గంలోకి ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ చోటు దక్కించుకున్నారు. నిశాంత్‌తోపాటు 32 మంది నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం పాట్నాలో గాంధీ మైదానంలో జరిగింది.

- మిగతా 2లో..

# రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ..

# వారానికో శంకుస్థాపన




## వేగంగా పనిచేయాలి..అంతే వేగంగా అభివృద్ధి చూపించాలి

- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదు
- పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యం
- వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చు
- జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి
- కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా..ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం
- 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

అభివృద్ధి సహా వివిధ రంగాల్లో బెంచ్ మార్క్ సెట్ చేసేలా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడుకునేవారో... ఇప్పుడేం మాట్లాడుకుంటున్నారో ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.

2 లో..


## తేలని తమిళనాడు



- గవర్నర్‌ను మరోసారి కలిసిన విజయ్

చెన్నై: తమిళనాడులో తమిళ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్ మరోసారి లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ను కలిశారు. టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.


2 లో



## నేపాల్‌లో స్వల్ప భూకంపం

ఖాట్మాండు : నేపాల్ లో భూకంపం సంభవించింది. సెంట్రల్ నేపాల్ లోని ధాడింగ్ జిల్లాలో గురువారం ఉదయం భూమి స్వల్పంగా కంపించిందని ప్రభుత్వం సంస్థ తెలిపింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు పేర్కొంది.

2 లో




## గవర్నర్లు బీజేపీ ఏజెంట్లు..

- విజయ్‌ను వెంటనే సీఎంగా ప్రమాణస్వీకారం చేయించాలి: కపిల్ సిబాల్
- మెజార్టీ లేదంటూ విజయ్‌కు ప్రమాణస్వీకారం చేసేందుకు అవకాశం ఇవ్వని గవర్నర్
- మెజర్టీని నిరూపించు కోవాల్సింది రాజ్‌భవన్‌లో కాదన్న సిబాల్
- రాజ్యాంగ విలువలను వినేవారు ఎవరూ లేరని విమర్శ

న్యూఢిల్లీ : తమిళనాడు రాజకీయ సంక్షోభంపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ తనదైన శైలిలో ట్వీట్ చేశారు. గవర్నర్ల వ్యవస్థను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గవర్నర్లు బీజేపీ ఏజెంట్లుగా మారుతున్నారని, ఆ పార్టీ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని వారు తుంగలో తొక్కుతున్నారని కపిల్ సిబాల్ ఘాటుగా విమర్శించారు. తమిళనాడు ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. మెజారిటీ ఉందో లేదో తేల్చాల్సింది రాజ్‌భవన్ లో కాదని, అసెంబ్లీ వేదికగా ఆయన తన బలాన్ని నిరూపించుకునే అవకాశం

వివరాలు 2లో..

ఇక విద్యా శాఖ మొత్తానికీ

# ఒకే డ్యాష్‌బోర్డు

## మంత్రి నారా లోకేష్.కీలక ప్రకటన

- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం
- హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వివరాలు డ్యాష్‌బోర్డులో అందుబాటు
- త్వరలో ప్రజలకు సైతం ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని స్పష్టీకరణ
- ఉత్తమ విధానాలకు కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామన్న సీఎం చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించబోతున్నట్లు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అమరావతి సచివాలయంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..




"విద్యాశాఖకు సంబంధించి ఒక సమగ్రమైన కేపీఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్) డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యార్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి

2 – పేజీలో..

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు

# తెలిపిన కలెక్టర్లు

## బిజినెస్ రిఫార్మర్ అవార్డు సాధించిన ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్‌తో గౌరవం

- మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు ఇలాంటి అవార్డులు రావాలి : సీఎం చంద్రబాబు
- ఈ అవార్డును టీమ్ ఏపీకి అంకితం : ముఖ్యమంత్రి




ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ – 2025 అవార్డు సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ అభినందనలు తెలిపింది. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్

- మిగతా 2లో..




## పంజాబ్‌లో ఇడి సోదాలు

చండీగఢ్ : భూ కుంభకోణం కేసులో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం పంజాబ్, చండీగఢ్ లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ ఎ) కింద సన్ టెక్ సిటీ ప్రాజెక్ట్, అజయ్ సెహగల్, ఎబిఎస్ టౌన్ షిప్స్ , ఆల్టస్ బిల్డర్స్, ధీర్ కన్

- మిగతా 2లో..

ఒకే ప్లాట్ ఫాంపైకిరెవెన్యూ,

# రిజిస్ట్రేషన్ సర్వీసులు

- వేగంగా డిజిటలైజేషన్ పక్రియ పూర్తి
- సిటిజెన్ ఫ్రెండ్లీగా రిజిస్ట్రేషన్ శాఖ
- కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయిం చామన్నారు. డిజిటలైజేషన్ పక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు.

- మిగతా 2లో..



# కీలక పరిణామం..

## విజయ్ కి మద్దతిచ్చే అంశాన్ని మిత్రపక్షాలకే వదిలేసిన స్టాలిన్

- మ్యాజిక్ ఫిగర్ కు 5 స్థానాల దూరంలో నిలిచిన విజయ్
- విజయ్ కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమైన వీసీకే, కమ్యూనిస్టు పార్టీలు
- స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చని మిత్ర పక్షాలకు చెప్పిన స్టాలిన్



చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న ప్రతిష్టంభన ఇప్పుడు అత్యంత కీలక దశకు చేరుకుంది. మ్యాజిక్ ఫిగర్ 118కి కేవలం 5 స్థానాల దూరంలో నిలిచిన విజయ్ టీవీకే పార్టీ, అధికారం కోసం చేస్తున్న ప్రయత్నాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి.

- మిగతా 2లో..

## సంపాదకీయం

# ధాన్యం కొనుగోళ్లలో దబాయింపులు !

ఏటా దేశంలో ధాన్యం కొనుగోళ్లు అన్నది ఓ పజిల్‌గా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నామని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం కొనండి అని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా కొనుగోళ్లు పెద్ద ఎత్తున ఎక్కడా కానరావడం లేదు. దీనికితోడు అకాల వర్షం రైతుల నెత్తిన పిడుగు పడేసింది. ఇటీవలి అకాల వర్షం నిండా ముంచింది. అన్నదాత రెక్కలకష్టాన్ని నీళ్లపాల్జేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుప్రాంతాల్లో పడిన వర్షం దాటికి, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో తీవ్రమైన గాలులతో అకాల వర్షం కురవడంతో మంథని మార్కెట్ యార్డుతోపాటు ఆయా మండలాల్లోని వ్యవసాయ ధాన్యమంతా మట్టిలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పదిహేను రోజుల కిందటే కోతలు కోసి, ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు పడుతున్న తరుణంలో కోలుకోలేని దెబ్బతీసింది. కొనుగోళ్లు వేగంగా చేస్తే తమ ధాన్యం తడిసేది కాదని కుప్పల చుట్టూ వర్షం నీటిని చూపిస్తూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని మంత్‌రులు, అధికారులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అసలు ధాన్యమే కొనడం లేదని తెలంగాణలో బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మక్కల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతులు కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందన్నారు. ఎపిలో కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని మంత్రి అచ్చన్నాయుడు చెబుతున్నారు. మరి లోపం ఎక్కడో తెలియడం లేదు. కేంద్రం కూడా దేశంలో ఏయే పంటలు పండుతున్నాయో, వాటిని ప్రజలకు చేర్చడమెలా అన్నది ఆలోచన చేయడం లేదు. పంటలు బాగానే పండుతున్నాయి. గోదాముల్లో పుల్లుగా ఉంటున్నాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావడం లేదు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాల్లో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగ దారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది దళారులు మాత్రమే. పంజాబ్, హర్యానాల్లో గోధుమలు బాగా పండిస్తారు. గోధుమల ధర తగ్గితే సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్రలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న.

గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరి స్తుంటారు. దేశంలో ప్రతి పంట పరిస్థితి ఇలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, మక్క రైతులు నాన కష్టాలు పడుతున్నారు. దీనికంతటికి కొనుగోలు విధానాలు, మద్దతు ధరల విధానాలు సక్రమంగా లేకపోవడమే అని గుర్తించాలి. దీనిని సంస్కరిస్తే తప్ప రైతులకు, వినోగదారులకు మనశ్శాంతి ఉండదు.

### ఇక విద్యా శాఖ

# మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

# తేలని తమిళనాడు

కాంగ్రెస్ మద్దతు లేఖ, 20 మంది మద్దతు మంత్రుల జాబితాను గవర్నర్ కు అందించారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్నామని లేఖను కూడా అందించారు. సంఖ్యా బలం నిరూపించుకున్న తరువాతే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో గవర్నర్ నుండి పలు ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. 40నిమిషాల సమావేశం అనంతరం విజయ్ లోక్ భవనము నుండి వెళ్లిపోయారు. అనంతరం గవర్నర్ కార్యాలయం నుండి టీవీకేకు ఫోన్ కాల్ వచ్చిన్నట్లు మీడియాలో సమాచారం. విజయ్ సమర్పించిన సంఖ్యా బలం పట్ల గవర్నర్ అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. 118 మంది మెజారిటీ సభ్యుల జాబితాను సమర్పించాలని గవర్నర్ కార్యాలయం టీవీకేకు స్పష్టం చేసిందని మీడియాలో పేర్కొన్నారు.

# నేపాల్‌లో స్వల్ప భూకంపం

దేశ రాజధాని ఖాట్మాండుకు 90 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉందని, దీంతో ఖాట్మాండులో సైతం ప్రకంపనలు వచ్చినట్లు వెల్లడించింది. ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



### రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ...

# వారానికో శంకుస్థాపన

రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా మోటివేట్ చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో రెండు రోజులపాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సు గురువారం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులు-అధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఔ-ఐ-ఔజ.. ఇదో సైకిల్**

"అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి. ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే. డబ్బులు లేవనడం కాదు... సంపద సృష్టికి పని చేయాలి... చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం. పీ4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ అంటే నమ్మకాన్ని కల్పించాం. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. కాలేజీ రోజుల్లో ఎన్ ఫీల్డ్ డ్రైవ్ చేయడాన్ని గొప్పగా ఫీలయ్యేవాళ్లం. అలాంటి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను ఏపీకి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలను చల్లబరిచే ఏసీలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం."అని సీఎం వివరించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేసే కలెక్టర్లే నోడల్ ఆఫీసర్లు**

"గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉంది. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. లాస్ట్ మైల్ లో ఉండే ఉద్యోగిని కూడా మోటివేట్ చేస్తే అద్భుతంగా పని చేయగలరు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించాం. మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తాం... తొలిసారి ట్రూ డౌన్ చేయగలిగాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాం... ఆన్ లైన్ లో పన్నులు కట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చాం. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పాం. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్, ఆక్వా కల్చర్ దిశగా అడుగులు వేస్తున్నాం. అన్ని రంగాల్లో... అన్ని వ్యవస్థల్లో ఏపీ పనితీరు బెంచ్ మార్క్ గా మారాలి. జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం... ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి. రిజల్ట్ ఓరియేంటేషనుతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్.. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఈజ్ నాట్ స్లోగన్... గవర్నెన్స్ డిసైడ్స్ ద స్పీడ్ ఆఫ్ గ్రోత్. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్.. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందుతాయి."అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

### ఒకే ప్లాట్ ఫాంపైకిరెవెన్యూ,

# రిజిస్ట్రేషన్ సర్వీసులు

బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనాపరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని... ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.



నిర్దేశించుకున్న లక్ష్యాలను రీ-ఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్సరెన్స్ ఉపకరిస్తోందని సీఎస్ సాయిప్రసాద్ అన్నారు. సుపరిపాలనతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ప్రభుత్వ విధానమని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు- సర్వీస్ డెలివరీ అనేది అత్యంత కీలకమైన అంశమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నిర్దేశిరచిన 10 సూత్రాల ఆధారంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయగలమని తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తేనే అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించగలమన్నారు. విద్య, వైద్యం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా ప్రజలకు అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ నిర్ణయాలు తీసుకోవటంలో ఎలాంటి సంకోచం ఉండకూడదని సీఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

# బీహార్ మంత్రివర్గ విస్తరణ

ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా, రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జెడియు అధ్యక్షులు నితీష్‌కుమార్‌తోపాటు పలువురు ఎన్‌డిఎ నేతలు పాల్గొన్నారు.కాగా, కొత్తగా ఏర్పడిన మంత్రివర్గంలో ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో సహా బిజెపికి 15 మంత్రి పదవులు, ఇక మిత్రపక్ష పార్టీ జెడియుకి 13 (ఇద్దరు డిప్యూటీ సిఎంలు : బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) : ఇద్దరు, హిందుస్తానీ ఆవామ్ మోర్చా (సెక్యులర్) : ఒకరు, రాష్ట్రీయ లోక్ మోర్చా నుండి ఒకరు మంత్రులుగా గురువారం ప్రమాణం చేశారు. మంత్రివర్గంలో ఓబిసి, ఇబిసి, హిందువులు, దళితులు, మహిళలు ఇలా వివిధ సామాజిక వర్గాలకు చెందినవారికి కేబినెట్‌లో స్థానం కల్పించారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులతో 35 మందితో కూడిన మంత్రివర్గం ఉంది. 243 అసెంబ్లీ స్థానాలున్న అసెంబ్లీకి గరిష్టంగా 36 మంది మంత్రలు ఉండవచ్చు.




తాజాగా ఏర్పడిన కొత్త కేబినెట్‌లోకి మాజీ సిఎం నితీష్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ (జెడియు, శ్వేతా గుప్తా (జెడియు) మిథిలేష్ తివారి (బిజెపి), శైలేష్ కుమార్ (జెడియు)లతో పాటు పలువురు కొత్త కేబినెట్‌లో మంత్రలుగా ప్రమాణస్వీకారం చేశారు.

# కీలక పరిణామం..



డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఉన్న వీసీకే, వామపక్ష పార్టీల నేతలు ఈరోజు స్టాలిన్‌ను కలిశారు. టీవీకే పార్టీ తమ మద్దతు కోరుతున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై వారు చర్చించారు. ఈ సందర్భంగా స్టాలిన్ తన మిత్రపక్షాలకు 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చారు. విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చని ఆయన సూచించారు. ఇప్పటికే 5 సీట్లున్న కాంగ్రెస్ మద్దతు తెలపగా, ఇప్పుడు రెండేసి సీట్లున్న వీసీకే, సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా సానుకూలంగా స్పందిస్తే విజయ్ పీఠం ఎక్కడం ఖాయం. వీసీకే, వామపక్షాలు కూడా మద్దతిస్తే... టీవీకే అధికార పీఠాన్ని అధిష్ఠించేందుకు ఆ పార్టీల సీట్లు సరిపోతాయి.మరోవైపు, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ - విజయ్ మధ్య జరుగుతున్న చర్చలు ఉత్కంఠను రేపుతున్నాయి. ఈరోజు ఉదయం జరిగిన భేటీలో గవర్నర్ పలు కీలక ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. మెజారిటీ లేకుండా ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారు? ఏ ఏ పార్టీలు మద్దతు ఇస్తాయో స్పష్టమైన ఆధారాలు ఏవి? అని ఆయన ప్రశ్నించారు. దీనికి విజయ్ బదులిస్తూ, తాను అసెంబ్లీలో 'ఫ్లోర్ టెస్ట్'కు సిద్ధమని, సభలోనే తన బలాన్ని నిరూపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. అయితే, ప్రమాణ స్వీకారానికి ముందే మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ సూచించడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. గవర్నర్ వైఖరిని వీసీకే అధినేత తిరుమావళవన్ తీవ్రంగా తప్పుబట్టారు. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్‌ను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించకుండా అడ్డుకోవడం అంగీకారయోగ్యం కాదని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీ వేదికగానే బలాబలాలు తేలాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉపరితల ద్రోణి..


ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు తమ కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు.



# పంజాబ్‌లో ఇడి సోదాలు

ట్రక్షన్స్ సహా అనుబంధ సంస్థలతో సంబంధం ఉన్న మొహాలీ, చండీగఢ్ లోని సుమారు 12కి పైగా ప్రదేశాల్లో సోదాలు జరుగుతున్నాయని అన్నారు. గ్రేటర్ మొహాలీ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (జిఎంఎడిఎ) కి నగదు చెల్లించడంలో విఫలమైన బిల్డర్లకు సహాయం చేసిన, వారికి రాజకీయంగా రక్షణ కల్పించిన నితిన్ గోహాల్ కోసం గాలిస్తున్నామని అన్నారు. జిఎం ఎడిఎ నుండి భూ వినియోగ మార్పు (సిఎల్ యు) లైసెన్స్ లు పొందడంలో మోసానికి పాల్పడ్డారని, ప్రజలను మోసం చేశారని నిందితులపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

# గవర్నర్లు బీజేపీ ఏజెంట్లు..



ఇవ్వాలని సిబాల్ స్పష్టం చేశారు. గతంలో సర్కారియా కమిషన్ ఇచ్చిన సిఫార్సులను, సుప్రీంకోర్టు స్థిరపరిచిన చట్టాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎన్నికల తర్వాత మెజారిటీ కోసం కుదుర్చుకునే పొత్తుల కంటే, ఎన్నికల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన వారికే ప్రభుత్వం ఏర్పాటు చేసే మొదటి అవకాశం ఇవ్వాలని రాజ్యాంగ నిబంధనలు చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ విలువలను వినేవారు ఎవరూ లేరంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్లు

సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబుకు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామ స్థాయి అధికారి వరకు పని చేయడం వల్లే ఈ అవార్డు దక్కింది.బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం మనందరి సమిష్టి కృషి. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారు... ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారు అనే దానికి ఈ అవార్డు ఉదాహరణ. గతంలో ఇలాంటి అవార్డులు తీసుకోవడానికి ఇష్టపడేవాడిని కాదు... కానీ ఇప్పుడు ఇలాంటి అవార్డులు మరిన్ని రావాలని కోరుకుంటున్నాను. ఎన్ని అవార్డులు వస్తే... మన రాష్ట్రానికి అంత గుర్తింపు దక్కుతుంది... మరిన్ని పెట్టుబడులు వస్తాయి. అందుకే మరిన్ని అవార్డులను మనం సాధించాలని కోరుకుంటున్నాను. ఈ అవార్డును టీమ్ ఏపీకి అంకితం చేస్తున్నాను."అని ముఖ్యమంత్రి చెప్పారు.



# ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా
శుక్రవారం, మే 08, 2026



# కృష్ణానదిపై బ్యారేజీల నిర్మాణంతోనే రైతు సంక్షేమం

**ప్రతి ఏటా నీటి అతివృష్టి, అనావృష్టి. ఏ ఒక్కటి వచ్చినా నష్టపోతున్న దిగువప్రాంత రైతాంగం**
**వందల టిఎంసీలు నీరు సముద్రం పాలు**
**ఫైనాన్స్ డిపార్ట్మెంటు వద్ద బ్యారేజీల ఫైల్**
**రైతు నాయకులు స్థానిక పాలకుల చేత ఫైలును ముందుకు నడిపించాలి**
**మొక్కజొన్న కొనుగోళ్లో కదలని డబుల్ ఇంజన్ ప్రభుత్వం**
**రాష్ట్ర రైతు విభాగం రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు**

అవనిగడ్డ / చల్లపల్లి ప్రజాభూమి ప్రతినిధి
కృష్ణానది దిగువ ప్రాంతాల్లోని పంట పొలాలకు ఏర్పడే నీటి సమస్యను బ్యారేజీల నిర్మాణంతోనే అధిగమించగలమని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సమావేశాలు చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఎపి రైతు సంఘం అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రత్యేక అధితిగా పాల్గొన్న సింహాద్రి రమేష్బాబు రైతు సమస్యలు, వాటి పరిష్కారాలపై మాట్లాడారు. తాము మొదటి నుంచి రైతు పక్షపాతులమని అనేక సందర్భాల్లో రైతు సమస్యలపై పోరాటాలు కూడా చేసామని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గానీ, అందులోనూ అవనిగడ్డ నియోజకవర్గం గానీ భౌగోళికంగా చిట్టచివరన ఉండటంతో భారీ వర్షాలు పడినా, తుఫానులు వచ్చినా పంటలు మునిగిపోతాయని, అలాగే వర్షాలు పడకపోతే సాగు నీరు లభించక పొలాలు ఎండిపోతాయని అన్నారు. ప్రతి ఏటా రెండు విపత్తుల్లో ఏదో ఒకదానితో రైతులు తీవ్రంగా పంట నష్టపోతున్నారని ఆవేధన వ్యక్తంచేశారు.

నీటి అతివృష్టి, అనా వృష్టి పరిస్థితుల నుంచి రైతులకు శాశ్వతంగా విముక్తి కల్గించేందుకు, కృష్ణానదిలో వృధాగా సముద్రంలో కలిసిపోతున్న వందలాది టీఎంసీల నీటిని ఒడిసి పట్టేందుకు జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. కృష్ణానది దిగువన కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం బొబ్బర్లంక వద్ద ఒకటి, చోడవరం వద్ద మరొకటి మొత్తం రెండు చెక్ డ్యాములు ఏర్పాటు ఆవశ్యకతను జగన్మోహనరెడ్డి దృష్టిలో పెట్టామన్నారు.

బొబ్బర్లంక, చోడవ రం ప్రాంతాల వద్ద చెక్ డ్యాములను నిర్మిస్తే ఈ ప్రాంతం సాగునీటి సమస్యను అధిగమించి సశ్యశ్యామలం అవుతుందని వివరించానన్నారు. కోరిందే తడవుగా జగన్మోహన్రెడ్డి వెంటనే అదే రోజు ఇరిగేషన్ డిపార్ట్మెంటు అధికారులను, మంత్రులను పిలిచి చర్చించినప్పుడు కృష్ణానదిపై చెక్ డ్యాములు కడితే కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంటుందని చెక్ డ్యాముల స్థానంలో బ్యారేజిలను 'నిర్మించాలని అధికారులు సూచించినట్లు వివరించారు. బ్యారేజీల నిర్మాణం కోసం మట్టి నమూనాల సేకరించటం, బొబ్బర్లం క వద్ద బ్యారేజీ నిర్మాణానికి 2200 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారన్నారు. ప్రస్తుతం ఆ ఫైల్ ఫైనాన్స్ డిపార్ట్మెంటు వద్ద ఉందని పార్టీలతో




సంబంధం లేకుండా రైతుల అవసరంగా భావించి రైతునాయకులు పూనుకుని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఫైనాన్స్ డిపార్ట్మెంటు వద్ద పెండింగ్లో ఉన్న ఫైల్ను ముందుకు నడిపించి బ్యారేజీల నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. బ్యారేజీల నిర్మాణం జరిగితే బొబ్బర్లంక వద్ద 5.57 టిఎంసిల నీటిని, చోడవరం వద్ద 3.5 టిఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే డెల్టా, దిగువ ప్రాంతాల్లోని పంట పొలాలకు నీటి కొరత ఉండదని వివరించారు. పోలవరం నుంచి నీళ్ళు రాకపో యినా... మరెక్కడి నుంచి నీరు రాకపోయినా ఇక్కడ బ్యారేజీల్లో నిల్వ ఉన్న నీరే సమృద్ధిగా సరిపోతుందని వివరించారు.ఇక ప్రతి ఏటా అన్నదాతలు సాటు నీటి కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన దుస్థితి ఉండబోదన్నారు. పార్టీలతో సంబంధం లేకుం డా రైతుల అవసరంగా భావంచి ఫైనాన్స్ డిపార్ట్మెంటు వద్ద ఉన్న ప్రాజెక్టుల ఫైళ్ళను బయటకు తీయించి ప్రాజెక్టుల నిర్మాణాలకు కృషి చేయాలనీ కోరారు.

**డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రైతుకు ఏమిలాభం?**

పక్కనున్న తెలంగాణాలో డబుల్ ఇంజన్ గవర్నమెంటు కాకపోయినా మొక్కజొన్నను ప్రభుత్వం మద్దతు ధరకు కొంటోందని కానీ అంధ్రప్రదేశ్లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం మద్దతు ధరకు ఎందుకు కొనలేకపోతోందని ప్రశ్నించారు. దీనిపై మాట్లాడే నాయకులే లేకపోవటం బాధాకరమన్నారు. 12.40లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారని, ప్రతి ఎకరాలకు సగటున 35 క్వింటాళ్ళు దిగుబడి వచ్చిందన్నారు. మద్దతు ధరకు కొనుగోలు ధరకు మద్య న్న వ్యత్యాసాన్ని చెల్లించాలని కేంద్రాని 40 రోజుల వ్యవధిలో రెండు సార్లు అదే లెటర్ రాసారన్నారు. లెటర్లు రాయటం వల్ల కంటి తుడుపు చర్యలేగానీ ఎవరికి మేలు జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పుడు కోనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా అవి దళారులకు ఉపయోగపడతాయే తప్ప రైతులకు ఏరకంగానూ ఉపయోగపడవని అన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం

**అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**





అవనిగడ్డ / మోపిదేవి ప్రజాభూమి ప్రతినిధి
గ్రామాల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో ఎంపీ, ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులు రూ.50 లక్షలు, రాజ్యసభ సభ్యులు పరిమళ్ నత్వాని ఎంపీ లాడ్స్ ద్వారా కేటాయించిన రూ.50 లక్షలు మొత్తం రూ.కోటి నిధులతో అద్దంకి నాంచారమ్మ ఆలయం వద్ద నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలా ఫలకం ఆవిష్కరించారు. పల్లె పండుగ 1.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తమ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన 780 మీటర్ల మూడు సీసీ రోడ్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తమ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులు రూ.97 లక్షలతో మోపిదేవి - వెంకటాపురం మధ్య నూతనంగా నిర్మించిన 2.37 కిలోమీటర్ల తారు రోడ్డును మోపిదేవిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ రూ.కోటితో నిర్మిస్తున్న ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను గ్రామ పెద్దలు స్వీయ పర్యవేక్షణ, భాగస్వామ్యంతో స్వంత ఇంటి నిర్మాణంలా భావించి చేయించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాలకు పునరుజ్జీవం కలిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి నిధులతో చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.36.65 కోట్లతో 46 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 15 కిలోమీటర్ల తారు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పవన్ కళ్యాణ్ సాధించిన సాస్కి నిధులతో నియోజకవర్గంలో రూ.14.57 కోట్లతో 22 కిలోమీటర్లు తారు రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.5.04 కోట్లతో నియోజకవర్గంలో 14 నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరో 15 అసంపూర్తి గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను రూ.1.37 కోట్లతో పూర్తి చేస్తున్నట్లు వివరిం చారు.

రానున్న కాలంలో మరిన్ని రోడ్లు మంజూ రు సాధించి, నియోజకవర్గంలో అన్ని రోడ్లు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సీనియర్ నాయకులు బాల కోటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్, ఎంపీడీఓ జంగం స్వర్ణభారతి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు అరజా ఆశాదేవి, కొమ్ము పవన్, పీఏసీఎస్ చైర్మన్లు అరజా రాధిక, కోసూరు నాగమల్లేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బా రావు, మాజీ సర్పంచులు అరజా సంధ్యారాణి, పొలిమెట్ల ఏసుబాబు, దిడ్ల జానకీ రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు కేతరాజు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు గొర్రెపాటి నాగేశ్వరరావు, అవనిగడ్డ లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, సకలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గవిరి శివరామకృష్ణ, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ అరజా బసవయ్య, అద్దంకి నాంచారమ్మ దేవాలయం అధ్యక్షులు గండు సాంబశివరావు, నాయకులు తోట కృష్ణాంజనేయులు, కొల్లి కిషోర్, కొల్లి మురళీ, రావి వసంత రావు, కోసూరు శివాజీ, అరజా కిరణ్ కాంత్, యడ్ల శ్రీనివాస రావు, యడ్లపల్లి లక్ష్మణ రావు, బొందలపాటి కోటేశ్వరరావు, చందన రంగారా వు, గోళ్ళ శ్రీనివాసరావు, బాదర్ల లోలాక్షుడు, తుర్లపాటి రామ్మోహనరావు, సోమిశెట్టి ప్రసాద్, గండు సత్యనారాయణ, చోడగం రాధాకృష్ణ (నాని), కూరేటి జగన్, కోసూరు రామాంజనేయులు, నెరుసు అంకమ్మ, నంద్యాల రాంబాబు, అనుమకొండ రాజు, అడపా చూటే, అరజా జ్ఞాన సుందరరావు (చంటి), మేడిశెట్టి పవన్, లంకా రాజేష్, మెరకనపల్లి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## యువత, మహిళల స్వయం ఉపాధికి బ్యాంకులు తోడ్పాటునందించాలి

**ఎంపీ వల్లభనేని బాలశౌరి**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని యువత మరియు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా బ్యాంకులు చొరవ చూపాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆకాంక్షించారు. గురువారం (ఈరోజు) యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ కె. జోగారావు ఎంపీ బాలశౌరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎంపీ పలు కీలక సూచనలు చేశారుసులభతర రుణాలు చిన్న వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి, స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలనుకునే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభంగా రుణాలు అందేలా చూడాలి.

ప్రత్యేక అవుట్రీచ్ కార్యక్రమాలు బ్యాంకింగ్ పథకాలపై అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక అవుట్రీచ్ ప్రోగ్రామ్లు నిర్వహించాలని కోరారు.మహిళా సాధికారత మహిళా సంఘాలు మరియు స్వయం సహాయక బృందాలకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

ముఖ్యంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు బ్యాంకింగ్ రంగాన్ని మరింత చేరువ చేయాలని ఈ సందర్భంగా రీజినల్ హెడ్ కి ఎంపీ బాలశౌరి విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వ అవినీతిపై రాజీలేని పోరాటం మాజీ మంత్రి పేర్ని నాని

**మంత్రి కొల్లు రవీంద్రపై తీవ్ర విమర్శలు**
**అధికారులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తే జైలు శిక్ష తప్పదు**
**పేదల ఇళ్ల ఇసుక తరలింపుపై ఆధారాలతో బయటపెడతామని హెచ్చరిక**




ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
మచిలీపట్నంలోని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ మంత్రి పేర్ని వెంకటరమయ్య (నాని) కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మంత్రి కొల్లు రవీంద్ర తీరును, అధికారుల వ్యవహారశైలిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.అక్రమంగా ఐరన్ తరలింపు మచిలీపట్నం మార్కెట్ యార్డ్ నుండి నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు ఐరన్ తరలిస్తున్నారని, దీనిని ప్రశ్నించిన అధికారులను మంత్రి స్వయంగా బెదిరించడం సిగ్గుచేటని ఆరోపించారు.హౌసింగ్ అధికా రుల తీరు ఉన్నతాధికారుల ఆదేశాల పేరుతో హౌసింగ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని.. అసలు ఆ ఆదేశాల కాపీలను ప్రజలకు చూపించే దమ్ముందా? అని ప్రశ్నించారు.

మట్టి మాఫియాపై మౌనం ముడా పరిధిలో టీడీపీ నాయకులు అక్రమంగా మట్టి తరలిస్తుంటే ఎమ్మార్వో నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.ఇసుక మళ్లింపు గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణాల కోసం నిల్వ చేసిన ఇసుకను ప్రభుత్వం మారిన తర్వాత ఎవరి ప్రయోజనాల కోసం తరలించారో త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతామని హెచ్చరించారు.అధికారులకు హెచ్చరిక మచిలీపట్నం మున్సిపల్ అధికారులు కొంతమంది టీడీపీ కార్యకర్తల్లా మారి సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు.

కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసే అధికారులు భవిష్యత్తులో జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై వైఎస్ఆర్సిపి తరపున రాజీలేని పోరాటం చేస్తామని పేర్ని నాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్ లో వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
బడి పిలుస్తోంది ప్రవేశ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు గురువారం మచిలీపట్నం పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల డ్రైవర్స్ కాలనీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో నేరుగా సమావేశమై ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అత్యాధునిక వసతులు, సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ప్రతి బాలబాలికను బడిలో చేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. డి.ఇ.ఓ సమక్షంలోనే ఐదుగురు విద్యార్థులు నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 ఎం.వి.ఎస్.డి. ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి-2 గురు ప్రసాద్, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు, క్లస్టర్ వనరుల వ్యక్తులు (సి.ఆర్.పి) తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పార్కును జిల్లా విద్యాశాఖ అధికారి యువి సుబ్బారావు గురువారం సంద ర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి (ఎస్.ఎస్.సి) - 2026 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం ప్రభు త్వం నిర్వహిస్తున్న ప్రత్యేక రిమిడియల్ (అదనపు బోధన) తరగతులను ఆయన స్వయంగా పరిశీలించారు.విద్యా ర్థుల బోధనా విధానం, వారు ఎదుర్కొంటున్న సందేహాలను అడిగి తెలుసుకున్న ఆయన, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. అనుత్తీర్ణులైన విద్యార్థులు నిరాశ చెందకుండా, ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని రాబోయే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు.ఈ పర్యటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీరుస్తున్న కొల్లు ఫౌండేషన్ కోనేరు సెంటర్లో చల్లని మజ్జిగ పంపిణీ




మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
వేసవి ఎండలు మండుతున్న వేళ, సామాన్య ప్రజల దాహార్తిని తీరుస్తూ కొల్లు ఫౌండేషన్ తన ఉదారతను చాటుకుంటోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో, ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కీలక ప్రాంత మైన కోనేరు సెంటర్లో ప్రతిరోజూ నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముందువరుసలో కొల్లు ఫౌండేషన్ సేవలు సామాజిక సేవే పరమావధిగా పనిచేస్తున్న కొల్లు ఫౌండేషన్, వేసవి తాపం నుండి బాటసారులు, వాహనదారులు మరియు కార్మికులకు ఉపశమనం కలిగించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతిరోజూ వందలాది మందికి చల్లని మజ్జిగను అందజేస్తూ, వారి దాహాన్ని తీరుస్తోంది. ఫౌండేషన్ అందిస్తున్న ఈ సేవ పట్ల స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది.ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏ కష్టమొచ్చినా స్పందిస్తూ, నిరంతరం ప్రజల చెంత ఉంటూ సేవలందిస్తున్న కొల్లు ఫౌండేషన్ తీరును పలువురు కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

## బందరులో సివిల్ సప్లైస్ అధికారుల మెరుపు దాడులు

**అక్రమ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం**
**ముగ్గురిపై కేసు నమోదు..**
**హోటళ్లు, రెస్టారెంట్లలో ముమ్మర తనిఖీలు**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం పట్టణంలో అక్రమ గ్యాస్ వినియోగంపై సివిల్ సప్లైస్ అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో అధికారులు ఆకస్మికంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ బండలను వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.11 సిలిండర్లు స్వాధీనంనిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను వాడుతున్న హోటళ్లపై విరుచుకు పడిన అధికారులు, మొత్తం 11 అక్రమ గ్యాస్ బండలను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టారు.కొనసాగుతున్న తనిఖీలువేసవి నేపథ్యంలో అక్రమ నిల్వలు, గ్యాస్ దుర్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించి గృహ వినియోగ సిలిండర్లను వ్యాపారాలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని అన్ని ప్రధాన హోటళ్లు, తినుబండారాల కేంద్రాల్లో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో సివిల్ సప్లైస్ విభాగం సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీ వల్లభనేని బాలశౌరిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పంచాయతీ అధికారిణి



మచిలీపట్టణం/ప్రజాభూమి ప్రతినిధి
కృష్ణా జిల్లా నూతన పంచాయతీ అధికారిణి (డీపీవో ) గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం. ధనలక్ష్మి గురువారం మచిలీపట్టణంలోని ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలోని పంచాయతీల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారు చర్చించారు.ప్రధానాంశాలుజిల్లాలోని గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ సూచించారు.ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.అధికారిణి ధనలక్ష్మి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని, నిబద్ధతతో పని చేస్తానని ఎంపీకి వివరించారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దెందులూరులో 'చింతమనేని ప్రీమియర్ లీగ్' క్రికెట్ పోటీలు

### CPL పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 'చింతమనేని ప్రీమియర్ లీగ్' రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి దెందులూరు హైస్కూల్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఏ జట్టైనా పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు భారీ నగదు బహుమతులు, ఆకర్షణీయ ట్రోఫీలు అందజేయనున్నట్లు వెల్లడించారు. మొదటి బహుమతిగా రూ.1,11,111, రెండో బహుమతిగా రూ.55,555 అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, హ్యాట్రిక్ సాధించిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. టోర్నమెంట్ వివరాల కోసం 6300598229, 9885509845 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, కొనకళ్ళ శివమణి, తానంకి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయం 2.0తో సారా నియంత్రణలో ఫలితాలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఏ. మస్తానయ్య మాట్లాడుతూ "నవోదయం 2.0" కార్యక్ర మం ద్వారా సారా నివారణలో మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. సారా మానివేసిన 30 మందికి "ఉన్నతి", "శ్రీనిధి" పథకాల ద్వారా వడ్డీ రహిత రుణాలు అందించి ఉపాధి కల్పిం చినట్లు చెప్పారు. చట్టవిరుద్ధంగా సారా తయారీ, విక్రయాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. అక్టోబర్ 2024 నుంచి ఇప్పటి వరకు 401 కేసులు నమోదు చేసి 444 మందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 29 వాహనాలు స్వాధీనం చేసు కుని, 1891 లీటర్ల నాటు సారాతో పాటు 59,510 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. సారా తయారీలో వినియోగించే హానికర రసాయనాల వల్ల కిడ్నీలు, లివర్, గుండె, మెదడు వంటి అవయవాలకు తీవ్ర నష్టం కలుగుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సారా నివారణలో మీడియా సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు.

## రవీంద్రనాథ్ ఠాగూర్ సేవలు విద్యార్థులకు ఆదర్శం

### -వేసవి విజ్ఞాన శిబిరంలో ఘన నివాళి



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 10వ రోజు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా విశ్వకవి, భారతరత్న రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లవల్లి రాంబాబు మాట్లాడుతూ ఠాగూర్ గారి గీతాంజలి రచనకు నోబెల్ బహుమతి రావడం, జనగణమన జాతీయ గీతాన్ని రచించడం, శాంతినికేతన్ స్థాపన వంటి విశిష్ట సేవలను విద్యార్థులకు వివరించారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, మానవతా విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పుస్తకాలు, వార్తాపత్రికలు చదివి వాటి సారాంశాలను వివరించా రు. వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి, సృజనాత్మకత పెరుగుతున్నాయని గ్రం థాలయ అధికారి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరికి ఘన నివాళి



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో అమరజీవి అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నేపథ్యంలో అదనపు ఎస్పీ జి ముని రాజా అల్లూరి సీతారామరాజు యొక్క చిత్రపటానికి పూలమాలవాసి ఘనముగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏ ఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడని మన్యంలో జరుగుతున్న బ్రిటిష్ వారి యొక్క అరాచకాలకు ఎదురొడ్డి విరోచతమైన పోరాటాలను కొనసాగించారని, అతి చిన్న వయసులో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వారిని చిత్రహింసలకు గురిచేసి హతమార్చినట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు మన్యంలో ఉన్నటువంటి గిరిజనులకు హక్కులకు పోడి వ్యవసాయ భూములు యొక్క హక్కుల కొరకు పోరాటానికి సహాయ సహకారాలు అందించి బ్రిటిష్ సామ్రాజ్య వలసవాదులకు ఎదుర్కొడ్డి తన ప్రాణ త్యాగం చేసినట్లు పేర్కొన్నారు. 27 సంవత్సరాలు వయసులోనే అల్లూరి సీతారామరాజు ప్రాణత్యాగం చేసిన వారి చేసినటు వంటి సేవలకు గాని ఎప్పటికీ కూడా ప్రజలు గుర్తించుకోవడం అనేది వారు నిస్వార్థ సేవకు గుర్తింపుని అదనపు ఎస్పీ ఏఆర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పోలీస్ ప్రధా న కార్యాలయం ఏవో షేక్ మస్తాన్, ఆర్యులు పవన్, కుమార్ సతీష్ కుమార్, బి సెక్షన్ సూపర్డెం ట్ పి నాగేశ్వరరావు, ఆర్ఎస్ఐ భాస్కర రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు ఖరీదైన వైద్యసేవలు అందుబాటులోకి తేవడమే లక్ష్యం

### ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



ఖరీదైన వైద్యసేవలను పేదలకు సైతం పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావా లన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మె ల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ప్రజారోగ్య రక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచే స్తోందని, ప్రజలు ప్రభుత్వ మంచి కార్యక్రమా లకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పలువురు ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆలోచనలతో ప్రారంభమైన ఈ శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం నిర్వహణను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మె ల్యే బడేటి చంటి పలువురు రోగులకు మందు లు అందజేసి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పూర్తి రక్షణ, వైద్య సహాయం అందించాలనే సంకల్పంతో ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను కలిసిన సందర్భంగా కూడా ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అంశాన్ని ప్రస్తావించానని చెప్పారు. వివిధ ఆసుపత్రుల సహకారం, రెడ్‌క్రాస్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ సేవలను మరింత విస్తృతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. నిష్ణాతులైన వైద్య నిపుణులు ఈ శిబిరాల్లో విలువైన వైద్యసేవలు అందిస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ చల్లా వెంకట సత్య వరప్రసాదరావు, ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం, సీనియర్ నాయకులు బెల్లపుకొండ కిషోర్, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, డివిజన్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధం నేపథ్యంలో భర్త హత్య.. ఐదుగురు అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



గన్నవరం మండలం కొండపావులూరు గ్రామంలోని జగనన్న ఇండ్ల సముదాయం వద్ద ఎన్‌డీఆర్ఎఫ్ గేటు సమీపంలో జరిగిన వడ్లమాను గ్రామానికి చెందిన రెడ్డి సులోమన్ రాజు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలతో నూజివీడు డీఎస్పీ కెవీవీఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్సై కె. శుభ శేఖర్, చాత్రాయి ఎస్సై డి. రామకృష్ణ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి గురువారం నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తులో మృతుడి భార్య రెడ్డి దుర్గామణి (వడ్లమాను)కు గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామానికి చెందిన పలగాని వెంకన్నబాబుతో అక్రమ సంబంధం ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన తర్వాత కుటుంబ కలహాలు పెరగడంతో సులోమన్ రాజును హత్య చేయాలని కుట్ర పన్నారు. వెంకన్నబాబు ద్వారా బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన కలతోటి సాయి శ్రీనివాస్, కలతోటి మణికంఠ, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం భీమరాజుగుట్టకు చెందిన మద్దాలి జస్వంత్ రాయ్‌లతో కలిసి రూ.12 లక్షలకు హత్య చేయించినట్లు పోలీసులు తెలిపారు. కేసులో ఐదుగురిని అరెస్టు చేసి బలెనో కారు, సెల్‌ఫోన్లు, రూ.75 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## జాతీయ స్థాయి క్వాంటం టెక్నాలజీస్ వర్క్‌షాప్ ప్రారంభం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

విజయవాడ సమీపంలోని డాక్టర్ ఆర్‌వీఆర్ ఎన్ఆర్ఐ డీమ్డ్ యూనివర్సిటీలో క్వాంటం టెక్నాలజీస్ అంశంపై ఐదు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. మే 5 నుంచి 9 వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌లో న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఐఆర్--ఎన్‌పీఎల్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ జి. భగవాన్నారాయణ, నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ జి. దుర్గబాబు హైబ్రిడ్ విధానంలో క్వాంటం టెక్నాలజీస్‌పై అవగాహన కల్పించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో చాన్సలర్ డాక్టర్ రావి వెంకటరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ఆర్.ఎస్. సాంబశివరావు, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ జి. సాంబశివరావు, డాక్టర్ సి. నాగభాస్కర్, రిజిస్ట్రార్ డాక్టర్ బీ. రాఘవరావు, సీఈవో ఎమ్. తేజసాయి పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



స్థానిక శనివారాపుపేట-1 స్వర్ణవార్డు సచివాలయంలో గురువారం "వన్ మంత్, వన్ విలేజ్, 4 విజిట్స్" కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నుండి జిల్లా జాయింటు కలెక్టరు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం "వన్ మంత్, వన్ విలేజ్, 4 విజిట్స్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రధానంగా భూవివాదాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, భూ రికార్డులు సవరణ, తదితర ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలను గ్రామంలోనే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామ ప్రజలు, రైతులు కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా, సమస్యలు శాశ్వత పరిష్కారం చూపడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేయడం, పెండింగు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికార్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందిస్తారని అన్నారు."వన్ మంత్, వన్ విలేజ్, 4విజిట్స్" కార్యక్రమంలో ఈ రోజు మొదటి కార్యక్రమాన్ని శనివారాపుపేటలో ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు అధికారి జి.వెంకట నాయుడు, తహాశీల్దారు కె.గాయత్రీదేవి, వివిధ శాఖలు అధికారులు, స్వర్ణవార్డు ఉద్యోగులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులు.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



దేశ స్వాతంత్య సంగ్రామంలో సాయుధ పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు నేటి యువతకు ఆదర్శనీయుడని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ బ్రిటిష్ వారి నిరంకుశ పాలనకు మన్యం అటవీ ప్రాంతంలో బ్రిటిష్ ప్రభుత్వంపై గిరిజనులు తిరుగుబాటుకు అల్లూరి నాయకత్వం వహించారని, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దేశ ప్రజల్లో స్వాతంత్య కాంక్షను రగిలించాలన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం ప్రత్యేకమైనదన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన అటువంటి త్యాగధనుల స్ఫూర్తి తో నేటి యువత దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి పట్టాభి రామయ్య,.కలెక్టరేట్ సిబ్బంది పోతురాజు, చలపతి, శేషగిరిరావు, రవికుమార్ , క్రీడల అభివృద్ధి అధికారి అజీజ్, ప్రభృతులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాల ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు



హనుమత్ భక్తి, సేవా నిరతి సమాజానికి ఆదర్శమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. రాబోయే హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం తన కుటుంబ సమేతంగా అప్పన్నవీడులోని ప్రసిద్ధ శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరిపై ఆ హనుమంతుని ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఆలయంలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకల ఏర్పాట్లను ఎమ్మెల్యే చింతమనేని ఈ సందర్భంగా లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వైశాఖ బహుళ దశమి నాడు జరుపుకునే హనుమాన్ జయంతి అత్యంత పవిత్రమైనదని, ధైర్యానికి, విజయానికి మారుపేరైన ఆంజనేయ స్వామిని కొలిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం అని తెలిపారు. జరగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత, ఆలయ కమిటీ చైర్మన్ వేమూరి శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జ్ గుత్త అనిల్, వడ్డీ వాసవి దేవి, గరికిపాటి చంటిబాబు సహా పలువురు కూటమి నాయకులు, ఆలయ అధికారులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అకాల వర్షాల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

### -జాయింట్ కలెక్టర్ డా" ఎం. జె. అభిషేక్ గౌడ్.

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



రైతులు తమ దగ్గరలోని రైతు సేవా కేంద్రాలలో టార్పాలిన్లు తీసుకుని అకాలవర్షాలకు ధాన్యం తడిచిపోకుండా చూసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడ రైతులకు విజ్ఞప్తి చేశారు. పెదవేగి మండలంలోని కొప్పాక గ్రామంలో గురువారం ధాన్యం రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. రైతులు వారుకోరుకున్న మిల్లు కె ధాన్యం పంపుకోవచ్చని, ధాన్యం మిల్లుకు చేరిన 24 నుండి 48 గంటలలలోగా ధాన్యం సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుం దన్నారు. ధాన్యం రవాణాలో రైతులకు ఎటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నా రు. జేసీ వెంట పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, తహసీల్దార్ బ్రహ్మారాంభ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షలో 71వ ర్యాంకు సాధించి సత్తా చాటిన మోడరన్ విద్యార్థి.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

ప్రతిష్టాత్మక నవోదయ పరీక్షా ఫలితాల్లో మోడరన్ విద్యాసంస్థల 8 వ తరగతి విద్యార్థి చిట్టూరి శివ సుభాష్ ప్రసాద్ 71 వ ర్యాంక్ సాధించినట్లు కరస్పాండంట్ డాక్టర్ లయిన్ జి. వి. రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక నవోదయ పోటీ పరీక్షల్లో సుభాష్ ప్రసాద్ అత్యుత్తమ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. తమ విద్యార్థులకు అకాడమిక్ సిలబస్ తో పాటు వివిధ పోటీ పరీక్షలకు స్కూల్ స్థాయి నుండే అత్యుత్తమ శిక్షణ అందజేస్తున్నట్లు అకాడమిక్ డైరెక్టర్లు ఎ.రమాదేవి, ఆర్. ఉమాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ ప్రసాద్ ని అధినేత జి.వి.రావు, అకాడమిక్ డైరెక్టర్లు రమాదేవి, ఉమాదేవి, మోడరన్ స్టాఫ్ అభినందించారు.

## సూరవరంలో ప్రజా వినతి




ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో గురువారం "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి రెవెన్యూ సంబంధిత మొత్తం ఆరు ఫిర్యాదులు స్వీకరించగా, అందులో ఒక ఫిర్యాదును అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో పి.ఎన్.వి. ప్రసాద్, ఎంపీడీవో అబ్దుల్ సలాం, జి రాజు, ఎస్ రామకృష్ణబాబు, ఎండి యూనస్, ఉమా శంకర్, ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మత్తు రహిత గ్రామమే మండల ఫౌండేషన్ లక్ష్యం




ప్రజాభూమి ప్రతినిధి- ఆగిరిపల్లి

మత్తు రహిత గ్రామాల నిర్మాణమే మండవ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పి-4 కోఆర్డినేటర్ బెల్లం సుబ్బారావు తెలిపారు. గురువారం ఆగిరిపల్లి గ్రామాన్ని మత్తు రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన పేర్కొన్నారు. పి-4 కార్యక్రమంలో భాగంగా మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ సలాం మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సహకారంతోనే మత్తు రహిత వాతావరణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సి హెచ్ వి సూర్యనారాయణ రాజు, ముల్లంగి రాము, నరేంద్ర రెడ్డి, జి ఎం ఎస్ కె పుష్పలత,ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంత్రి కందుల దుర్గేష్ చొరవతో నిడదవోలు గడ్డపై ఆధ్యాత్మిక పరిమళం

- తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ నిధులతో భజన మందిరాల నిర్మాణం
- నిడదవోలును ఆధ్యాత్మిక నగరిగా మార్చే దిశగా మంత్రి దుర్గేష్ అడుగులు
- గోదావరి పుష్కరాల నాటికి పుణ్యక్షేత్రాల సర్వాంగ సుందరీకరణే లక్ష్యం: మంత్రి దుర్గేష్

**ప్రజాభూమి ప్రతినిధి – నిడదవోలు**



ధర్మ పరిరక్షణే ధ్యేయంగా నిడదవోలు నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. భగవంతుని సేవలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఎస్సీ/ఎస్టీ/బీసీ కాలనీల్లో భజన మందిరాల నిర్మాణానికి అనుమతులు లభించాయి. అందులో భాగంగా పెరవలి మండలం నడుపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న శ్రీ దుర్గా మాత దేవాలయానికి 5 సెంట్ల స్థలం, రూ. 10 లక్షలు, పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న శ్రీ వినాయక స్వామి ఆలయానికి 10 సెంట్ల స్థలం, రూ. 20 లక్షలు, ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో బీసీ కాలనీలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవాలయానికి 11 సెంట్ల స్థలం, రూ. 20 లక్షల నిధులు కేటాయిస్తూ దేవాదాయశాఖ పరిపాలన అనుమతులు జారీ చేయబడ్డాయని మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి పుణ్యక్షేత్రాలన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ పుణ్య కార్యానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నిర్ణీత కాల వ్యవధిలోగా, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం అత్యున్నత నాణ్యతతో ఈ నిర్మాణాలను పూర్తి చేసి భక్తులకు అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. భగవంతుని సేవలో భాగంగా సామాన్య భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచడమే లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవతో నిడదవోలు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లనుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పదో తరగతి ప్రతిభావంతులకు ఘన సన్మానం

యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పురస్కారాలు



**ప్రజాభూమి – ప్రత్తిపాడు**

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు తన సొంత నిధులతో, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలల్లో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత చదువుల దిశగా ప్రేరేపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. సొంత నిధులతో విద్యార్థులను సత్కరించిన కోడి శ్రీనివాసరావును ప్రత్యేకంగా అభినందించారు. ఉత్సాహంగా సాగిన సత్కార పర్వం: మండలంలోని 9 హైస్కూళ్ల నుంచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, సన్మాన పత్రాలను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీ వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు సూరిబాబు, మండల విద్యాశాఖ అధికారి (వీజూా) వి. రాజబాబు, యూటీఎఫ్ మండల టీం సభ్యులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాసిరకంగా అన్నవరం వంతెన నిర్మాణ పనులు

- ముందస్తు వర్షాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలతో వంతెన నిర్మాణం చేపట్టాలి
- 45 గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి
- బలమైన వంతెన నిర్మించాలని, లేదంటే మిత్రపక్ష పార్టీలతో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం



**ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.**

మండలంలోని అన్నవరం వంతెన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండి మేని లీలాకృష్ణ నాగేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న వంతెన నిర్మాణాన్ని అధికార యంత్రాంగం అత్యంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. "ప్రజల ప్రాణాలకు సంబంధం ఉన్న వంతెనను పటిష్టంగా నిర్మించాల్సిన చోట డ్రైనేజీలా కుడివైపు ఒక దిమ్మ, ఎడమవైపు మరో దిమ్మ కట్టి మధ్యలో ఇసుక పోస్తూ పనులు చేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది"





అని విమర్శించారు. ముందస్తు వర్షాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలతో బలమైన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్నవరం వాగులోకి మొత్తం 14 వాగుల నుంచి వరద నీరు చేరుతుందని, భారీ వర్షాల సమయంలో వరద ఉధృతి ప్రమాదకరంగా మారుతుందని తెలిపారు. కొండల నుంచి భారీ ముద్దులు, చెట్ల దిబ్బలు ఒక్కసారిగా వంతెనను ఢీకొట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత నిర్మాణం ఆ ఒత్తిడిని తట్టుకోలేక కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వంతెన దెబ్బతింటే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని, అన్నవరం అవతల ఉన్న 45 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆ ప్రాంతానికి ఇదొక్కటే ప్రధాన మార్గమని, ప్రత్యామ్నాయ రహదారి కూడా లేకపోవడంతో ప్రజల జీవనం పూర్తిగా స్తంభించే పరిస్థితి తలెత్తుతుందని అన్నారు. ప్రజల భద్రతను పక్కనపెట్టి కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే విధంగా పనులు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ, ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు మేల్కొని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా బలమైన వంతెన నిర్మించాలని, లేదంటే మిత్రపక్ష పార్టీలతో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు.

## రేల ఉత్సవాలు జయప్రదం చేయండి సిపిఎం గిరిజన సంఘం

**ప్రజాభూమి ప్రతినిధి – కూనవరం**



మండలంలోని ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలని గురువారం మండలం ప్రజాసంఘాల సమావేశం స్థానిక శ్రీమార్త శ్రీరామ్మూర్తి భవనములో మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా టేకులబోరు లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూనెం రామారావు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గిరిజన సంఘ నాయకులు బాబు బొర్రయ్య మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కాపాడడానికి కృషి చేస్తానని అన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాయని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాజెక్టులను గనులను పీసా చట్ట ప్రకారం గ్రామ సభలో అనుమతి లేనిదే చేయకూడదు ఎటువంటి గ్రామసభలు లేకుండా పెట్టుబడిదారులకు ప్రభుత్వం వత్తాసు పలకడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. గిరిజన చట్టాలు హక్కులు కాపాడదానికి సిపిఎం గిరిజన సంఘం పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమరం పెంటయ్య, పాయం సీతారామయ్య,తెల్లం తమ్మయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు,పాయం సత్యనారాయణ, నాగమణి, అమ్మాజీ, జయసుధ, రమేష్, రాములు, నారాయణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి రేలా ఉత్సవాలను జయప్రదం చేయండి

**ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.**



ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షులు కారం సుందరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ మే 24 25 26 తేదీన రంపచోడవరం కేంద్రంలో భారీ ఎత్తున జరగబోయే ఆదివాసి రేలా ఉత్సవాలు అత్యధిక ఆదివాసి ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఉత్సవాల్లో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలు నేటి సమాజానికి కనబడే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి అని అన్నారు. మే 24న మొదటి రోజు భారీ ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తూ సభ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ సభకి ఆదివాసి ప్రజానీకం అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా మన సంస్కృతిని కాపాడుకుందాం, మన హక్కుల కోసం పోరాడుదాం అని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్, ఆదివాసీ నాయకులు సున్నం రాజులు, కారం లక్ష్మి, గొర్రె రాజు, కారం సత్తిబాబు, పండా వెంకటేష్, ముసురు రాజశ్వరి, కారం కనకమహాలక్ష్మి, పొడియం శ్రీరామమూర్తి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## పోసిన ఆరునెలలకే సిసి రోడ్డు మొత్తం గుంతలు



**ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.**

మండలంలోని రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకము కింద 9.50 లక్షల వ్యయంతో, 214 మీటర్ల పొడవుగల నిర్మించిన సి సి రోడ్డు ఆరునెలలకే రోడ్డు మొత్తం గుంతలు పడ్డాయని, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోటంవల్లె ఈ రోడ్డుకు ఈ పరిస్తితి వచ్చిందని, వైయస్సార్సీపి నాయకులు మేడం నరేష్, మోడెం రాజేష్ విమర్శించారు. గురువారం ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ సిసి రోడ్డు పోసిన ఆరు నెలలకే సిసి రోడ్డు మొత్తం గుంతలు గుంతలు గా దర్శనమిస్తుందంటే ఎంత నాణ్యత ప్రమాణాలు పాటించారో అర్థమవుతుందని అన్నారు. 20 ఎం ఎం చిప్స్ తో పోయాల్సిన రోడ్డును, సిక్స్ ఎం ఎం బేబీ చిప్స్ తో రోడ్డు పోసారని అందుకే ఈ రోడ్డు మొత్తం గుంతలుగా తయారైందనీ వాపోయారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యమైన ఇసుకను ఉపయోగించకుండా, సరిగ్గా కాంపాక్షన్ చేయకపోవడం వల్ల, తదితర నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల ఈ సిసి రోడ్డు కు ఈ దుస్థితి వచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పై సంబంధిత అధికారులు స్పందించి, నాణ్యతను తనిఖీ చేయించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## సజావుగా సర్వసభ్య సమావేశం

**ప్రజాభూమి ప్రతినిధి – కూనవరం**




మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి యం. పి. పి. పాయం రంగమ్మ అధ్యక్షత వహించడం జరిగింది ఈ సమావేశం లో యంపిటిసిలు, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులు, మండల స్థయి అధికారులు, పాల్గొన్నారు. ఈసమావేశంలో తీర్మానాలు.. బోదునూరు నుండి మెట్ట రామవరం వరకు బీటీ రోడ్డు నిర్మాణం. కూనవరం మండలంలో ఆర్ అండ్ ఆర్ రేడారుకు సంబంధం లేకుండా సర్వే చేయవలసిందిగా కోరుతూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఎక్విషన్ వారికి ప్రతిపాదించుట గురించి 3.రంపచోడవరం బస్ డిపో ఏ ర్పాటు చేయుట గురించి, మండలంలో అందరు వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు కొత్త ఫించనులు మంజురు చేయుట గురించి, గత రెండు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న యంపీటీసీ ల గౌరవ వేతనం ఇప్పించుట గురించి సభ్యులు తీర్మానించడం జరిగింది..

## సీడీపీఓ సుజాత మృతిపై ఎమ్మెల్యే శిరీషాదేవి దిగ్భ్రాంతి

**ప్రజాభూమి – రాజవొమ్మంగి**

రాజవొమ్మంగి మహిళా శిశు సంక్షేమ శాఖ (×జణూ)లో సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న సుజాత మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిణి ఇలా ఆత్మహత్యకు పాల్పడటం జీర్ణించుకోలేని విషయమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసలేం జరిగింది?ఐసీడీఎస్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సీడీపీఓ సుజాత మంగళవారం గడ్డిమందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన సిబ్బంది వెంటనే ఆమెను రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందారు. అనుమానాలపై విచారణకు ఆదేశం:సుజాత మృతికి సంబంధించిన సమాచారం ఆలస్యంగా వెలుగులోకి రావడంపై ఎమ్మెల్యే పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వ అధికారిణి ఆత్మహత్య చేసుకోవడానికి దారితీసిన పరిస్థితులపై లోతైన విచారణ జరపాలని అధికారులను కోరారు. విచారణ చర్యలను వేగవంతం చేసి వాస్తవాలను బయటకు తీసుకురావాలన్నారు. ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వానపల్లిలో పుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

బాధితులకు ధైర్యం చెప్పి, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించిన ఎమ్మెల్యే

**ప్రజాభూమి ప్రతినిధి – కొత్తపేట**



వానపల్లి శివారు రామ్మోహన్ పేటలో బుధవారం మధ్యాహ్నం ఒక వివాహ వేడుకలో విందు సందర్భంగా పుడ్ పాయిజన్‌కు గురైన 35 మందికి పైగా బాధితులను గురువారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడి వారికి భరోసా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహ వేడుకలో విందు కారణంగా పుడ్ పాయిజన్ జరిగినట్లు తెలుస్తుందన్నారు. బాధితులకు సరైన చికిత్స అందేలా వైద్యులు తగిన చర్యలు తీసుకున్నారన్నారు. వానపల్లి పీహెచ్సీలో మొదట బాధితులను చేర్చినా, అక్కడ నుంచి కొత్తపేట సీహెచ్సీకి తరలించడం జరిగిందన్నారు. ఇక్కడ డాక్టర్లు అందరూ ప్రత్యేక పర్యవేక్షణలో వారందరికీ వైద్యం అందిస్తున్నారన్నారు. వారందరి రక్తనమూనాలు సేకరించి పరీక్షలకు పంపడం జరిగిందన్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు అందరూ బాధితుల్లో ఉన్నారన్నారు. ఉదయం, రాత్రి ఒకే రకమైన భోజనం తిన్నవారికి ఎక్కువగా ఇబ్బంది కనపడుతుందన్నారు. వైద్యులు, సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షి స్తున్నారని, ఎటువంటి ప్రాణ భయం లేదని వారు తెలిపారన్నారు. పుడ్ పాయి జన్ నుంచి తేరుకోవాల్సి ఉందని తెలిపార న్నారు. ఎవరికైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలిం చేలా ఏర్పాట్లు చేశారన్నారు. గ్రామంలో ఉన్న పెద్దలు అందరూ దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నా రని తెలిపారు. పరీక్షలు వచ్చిన తర్వాత బాధితులకు దానికి తగిన చికిత్స కూడా అందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే బాధితులు అందరూ కోలుకుంటారని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## మన్యం వీరుడు అల్లూరి త్యాగం చిరస్మరణీయం

- ఘనంగా సీతారామరాజు 102వ వర్ధంతి
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్

**ప్రజాభూమి – రంపచోడవరం**



భారతదేశ స్వాతంత్ర్య సిద్ధికై బ్రిటిష్ పాలకు లపై రాజీలేని పోరాటం చేసి ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయు డిపై ఉందని పోలవరం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) పి. అంబేద్కర్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నా రు. బ్రిటిష్ వారి గుండెల్లో నిదురించిన వీరు డు: అనంతరం డీఆర్ఓ అంబేద్కర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత గిరిజనులను ఏకం చేసి, బ్రిటిష్ వారి ఆయుధాగారాలపై విరుచుకుపడి వారిని గడగడలాడించిన చరిత్ర అల్లూరిదని కొనియాడారు. దేశం కోసం పోరాడుతూ బ్రిటిష్ వారి తుపాకి గుండ్లకు అసువులు బాసిన ఆయన వీరత్వం భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల త్యాగాల వల్ల వచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడమే మనం వారికిచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో (జనరల్) డి.ఎన్.వి. రమణ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ మోహన్ రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకట్రావు, డిడిఓ వెంకటనారాయణ, రాజారెడ్డి, డి. ప్రభాకర్ రావు, ఐటీడీఏ ఏవో ఎర్రం శెట్టి రాజు, పిఎంయు అధికారి మోహన్, ఐటీడీఏ మేనేజర్ బి. రాజు, నరసింహారావు, నాగభూషణం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో భారీ గోల్‌మాల్

పేరవరంలో రైతుల కన్నెర్ర.. సచివాలయం వద్ద ధర్నా

**ప్రజాభూమి – ప్రత్తిపాడు**

అన్నదాత అకౌంట్లోకి వెళ్లాల్సిన మద్దతు ధర నిధులు దారి మళ్లాయా? సాగు చేయని పంటను కూడా పండించినట్లు చూపి కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని కొందరు స్వాహా చేశారా? అంటే ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామంలో వెలుగు చూసిన అక్రమాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. వ్యవసాయ శాఖలో జరిగిన ఈ భారీ అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం రైతులు గ్రామ సచివాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అసలేం జరిగింది? బాధిత రైతుల కథనం ప్రకారం.. పేరవరం గ్రామంలో ధాన్యం సేకరణ ప్రక్రియలో అంతు చిక్కని అక్రమాలు చోటుచేసుకున్నాయి. రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించినప్పటికీ, ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా విక్రయించినట్లు తప్పుడు ఎంట్రీలు చేశారు. రైతులకు తెలియకుండానే వారి పేర్లు, ఆధార్ వివరాలు, ఈ–క్రాప్ డేటాను దుర్వినియోగం చేసి ఈ నకిలీ లావాదేవీలకు పాల్పడ్డారు. గోస్ట్ ట్రాన్సాక్షన్ల పర్వం:మరికొన్ని చోట్ల రైతులు ఇతర పంటలు సాగు చేసినప్పటికీ, రికార్డుల్లో మాత్రం వరి పండించినట్లు తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారు. అసలు పండించని ధాన్యాన్ని పండించినట్లు చూపి, వాటికి కనీస మద్దతు ధర (మీూా) కింద నిధులను డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఒక్క పేరవరం గ్రామంలోనే సుమారు 79 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **శాఖాపరమైన కుమ్మక్కు :** ఈ వ్యవహారంలో మిల్లర్లు, మధ్యవర్తులు మరియు వ్యవసాయ శాఖకు చెందిన కొందరు సిబ్బంది కుమ్మక్కై నిధులను పక్కదారి పట్టించి నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఈ నెట్‌వర్క్ విస్తరించి ఉండవచ్చని, ధాన్యం కొనుగోలు నిధులు అసలు రైతుల ఖాతాలకు వెళ్లాయా లేక మధ్యవర్తుల జేబు ల్లోకి చేరాయా అన్న కోణంలో లోతైన విచా రణ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



**విచారణకు డిమాండ్:** ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి అధికారులతో విచారణ జరిపించాలని, రైతుల వివరాలను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పేదలకు వరం సీఎం సహాయనిధి

### -36 మందికి రూ.12. 11 లక్షల చెక్కుల పంపిణీ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం మండలాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12. 11 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రి ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. అవసర సమయంలో ఈ సహాయం అందడం వల్ల పలువురు కుటుంబాలు తిరిగి సాధారణ జీవితంలోకి వస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే హిందూపురం నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎక్కువ సహాయం అందుతోందని, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతినెలా సీఎం సహాయనిధి ద్వారా ప్రజలకు చేయూతనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, రూరల్ మండల కన్వీనర్ రాము, లేపాక్షి, చిలమత్తూరు మండల కన్వీనర్లు అభిలాష్, శ్రీనివాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

### -బూత్ స్థాయి సమావేశంలో వైకాపా నేత గుడ్డంపల్లి వేణురెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు వైకాపా శ్రేణులు సిద్ధంగా ఆ పార్టీ నేత గుడ్డపల్లి వేణురెడ్డి సూచించారు. గురువారం పార్టీ కార్యాలయంలో హిందూపురం రూరల్ మండల బూత్ స్థాయి నాయకుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పల్లెలో ప్రతి బూత్ లో బూత్ ఇన్చార్జులు సైనికుల్లా పని చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రాబోవు పంచాయతీ ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంతేబిదనూరు రాము, జోన్ 5 బూత్ కమిటీల అధ్యక్షులు సురేష్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు బాలాజీ మనోహర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, అంగన్వాడి అధ్యక్షురాలు సిద్ధగంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రెండవ అదనపు జిల్లా జడ్జిగా వి. వెంకటేశ్వర్లు రావు, సీనియర్ సివిల్ జడ్జిగా ఎన్. హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ నెల్లూరు ఫోక్సో కోర్టుకు బదిలీ కాగా ఆమె స్థానంలో విజయవాడలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి. వెంకటేశ్వరరావును అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతిపై హిందూపురంకు నియమించడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు నాయక్ అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతిపై కడప జిల్లా ప్రొద్దుటూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా ఒంగోలులో పనిచేస్తున్న ఎస్. హేమలతను హిందూపురం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేయడంతో ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా న్యాయస్థానాల ఉద్యోగులు తమతమ న్యాయమూర్తులను కలిసి పరిచయం చేసుకున్నారు. దీనికి తోడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## 12న హనుమాన్ శోభాయాత్ర

### -ప్రముఖులను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రతి ఏటా తరహాలోని ఈ ఏడాది కూడా హిందూపురంలో హిందూ సురక్ష సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూ సురక్షా సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 12వ తేదీన హనుమాన్ శోభాయాత్రను హిందూపురం పట్టణంలో చేపట్టినట్టు తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, డాక్టర్ సురేంద్ర, బాలాజీ తోపాటు హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్ ను కలిసి ఆహ్వానించారు. దీనికి తోడు హనుమాన్ శోభాయాత్రలో అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చారుకీర్తి, వైటీపీ శ్రీనివాస్, రమేష్ రెడ్డి, టీకే బాబు, టిడిపి నాయకులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ఒక్క దాడితో బయటపడ్డ గ్యాస్ దందా...!!

- ఉమ్మడి అనంతలో ఇంకా ఎన్ని కేంద్రాలో
- గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గ్యాస్ రీఫిల్లింగ్ మాఫియా

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ లో జరిగిన ఒక్క దాడితో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ వ్యవహారం బయటపడటం ఇప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీ సంఖ్యలో డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లు స్వాధీనం కావడం చూస్తే... ఇది కేవలం ఒకే కేంద్రానికి పరిమితమైన వ్యవహారం కాదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హిందూపురం పట్టణంలోని రహమత్ పురం సర్కిల్లో జరిగిన ఒక్క దాడితో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ వ్యవహారం వెలుగులోకి రావడం ఇప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒకే ప్రాంతంలో అధికారులు దాడి చేయగానే 25 కమర్షియల్, 13 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం కావడం చూస్తే ఇంకా పట్టణంలో, జిల్లాలో ఎన్ని చోట్ల ఇలాంటి దందాలు సాగుతున్నాయో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హోటళ్లు, టీ స్టాళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, చిన్న చిన్న వ్యాపార కేంద్రాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ అక్రమ రీఫిల్లింగ్ దందా విస్తరించి ఉండే అవకాశాలు ఉన్నాయని సమాచారం. కమర్షియల్ సిలిండర్ల ధరలు భారీగా ఉండటంతో కొందరు అక్రమ మార్గాలను ఆశ్రయిస్తూ డొమెస్టిక్ సిలిండర్ల గ్యాస్ ను కమర్షియల్ వినియోగానికి మళ్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక డొమెస్టిక్ సిలిండర్ ధర, కమర్షియల్ సిలిండర్ ధర మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఆధారంగా చేసుకుని అక్రమార్కులు భారీగా దందాపై సంపాదిస్తున్నారని సమాచారం. సబ్సిడీ గ్యాస్ ను వాణిజ్య అవసరాలకు మళ్లించడం ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగించడమే కాకుండా వినియోగదారుల భద్రతను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో రోజుకు డజన్ల సంఖ్యలో సిలిండర్లు రీఫిల్లింగ్ చేస్తున్నట్లయితే నెలకు లక్షల్లో అక్రమ లావాదేవీలు జరిగే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**ఈ దందాకు కారణమేంటి..** గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది గ్యాస్ వినియోగం పూర్తిస్థాయిలో పెరగలేదు. కొన్ని కుటుంబాలు గ్యాస్ ను పరిమితం గానే ఉపయోగిస్తుండటంతో సిలిండర్లు నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో గతంలో 45 రోజులకు ఒక సారి బుకింగ్ చేసుకునే పరిస్థితి ఉండేది. బుకింగ్ చేసిన రెండు రోజుల్లో సిలిండర్ అందించేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారాయి. ఇప్పుడు 25 రోజులకే కొత్త బుకింగ్ అవకాశం ఉండటంతో పాటు బుకింగ్ చేసిన ఐదు రోజుల లోపే సిలిండర్ సరఫరా అవుతోంది. ఈ మార్పును కొందరు అక్రమ వ్యాపారులు అవకాశంగా మార్చుకున్నారని సమాచారం..

**ధరల వ్యత్యాసమే గ్యాస్ మాఫియాకు బలం :** సాధారణంగా గృహ వినియోగదారులకు అందించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర సుమారు రూ. 930 కాగా, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3205 వరకు ఉంది. ఈ భారీ ధరల వ్యత్యాసమే అక్రమార్కులకు కోట్ల రూపాయల దందాకు మార్గం చూపుతోంది. కొంతమంది వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ వినియోగం తక్కువగా ఉన్న కుటుంబాలను గుర్తించి, వారి వద్ద ఉన్న డొమెస్టిక్ సిలిండర్లను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అనంతరం ప్రత్యేక పరికరాల సహా యంతో ఆ గ్యాస్ ను కమర్షియల్ సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేసి హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టీ దుకాణాలకు విక్రయి స్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పట్టణాలు, గ్రామాల్లో విస్తరిస్తున్న నెట్ వర్క్**

హిందూపురంలో ఒక్క దాడితో ఇంత పెద్ద వ్యవహారం బయట పడితే అనంతపురం, ధర్మవరం, కదిరి, తాడిపత్రి, గుంతకల్లు రాయదుర్గం వంటి పట్టణాల్లో పరిస్థితి ఎలా ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా చిన్న షెడ్లు, గోదాములు, పాత భవనాలను కేంద్రాలుగా మార్చుకుని రాత్రివేళల్లో గ్యాస్ ట్రాన్స్ ఫర్ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కమర్షియల్ సిలిండర్ల అధిక ధరల కారణంగా చిన్న వ్యాపారులు తక్కువ ధరకు లభించే అక్రమ గ్యాస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

**ప్రాణాలతో చెలగాటం..** భద్రతా ప్రమాణాలు లేకుండా గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్న స్పార్క్ వచ్చినా భారీ అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చెబుతున్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలు కొనసాగితే వందలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతుంది.

**ప్రత్యేక దర్యాప్తు అవసరం..** హిందూపురంలో ఒక్క దాడితో బయటపడిన ఈ దందా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎంత మేర విస్తరించిందన్న దా నిపై సమగ్ర దర్యాప్తు అవసరమని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ, పోలీసు శాఖ, అయిల్ కంపెనీలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఈ గ్యాస్ మాఫియాపై ఉక్కుపాదం మోపకపోతే భవిష్యత్తులో భారీ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది..

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురము




అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని భారత దేశ స్వాతంత్రం కోసం ఆనాడు బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు అని జిల్లా రెవెన్యూ అధికారి మాలోల తెలిపారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి డిఆర్ఓ మాలోల తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఆర్ఓ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వంఅధికారికంగా నిర్వహించడం ఒక గొప్ప కార్యక్రమం అని, తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోలా పేర్కొన్నారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు దేశం కోసం, గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాటం చేసి తన ప్రాణాన్ని ఒడ్డి త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు అల్లూరి సీతారామ రాజు అని తెలిపారు. సమాజంలో తన కోసమో, తమ కుటుంబం కోసమో పోరాడిన వ్యక్తి కాదు అల్లూరి అని కొనియాడారు. గిరిజనుల్లో చైతన్యం రగిలించి వారి హక్కుల కోసం పోరాటం చేసి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతమైన ధీరోదాత్తుడు మన మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు అని అన్నారు. గిరిజనులకు వారి అభివృద్ధి, సంక్షేమానికి నేడు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చట్టాలతో మేలు చేస్తోందని పేర్కొన్నారు. గిరిజన సంఘం నాయకులు పోలా వీరాంజనేయులు, సాకే చిరంజీవి, వేరు వేరుగా మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్రం కోసం 27 ఏళ్ల చిన్న వయసు ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అని కొనియాడారు. నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. భావితరాలు సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే గిరిజన సంక్షేమానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, డిఐపిఆర్ఓ బాల కొండయ్య, హెచ్ డబ్ల్యు ఓ చంద్రశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం

ప్రజాభూమి,పులివెందుల




కృషి విజ్ఞాన కేంద్రం కడప ఊటుకూరు వారు పులివెందుల పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో వ్యవసాయ ఉద్యాన రైతులకు సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమము గురువారం నిర్వహించారు. డిబిటి బయోటెక్ కిసాన్ హబ్ ద్వారా జీవన ఎరువులు , జీవ శిలీంద్రనాశనుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా సమన్వయకర్త డా వి. శిల్పకళ మాట్లాడుతూ విచక్షణాయుతంగా రసాయనక ఎరువులను వాడడం వల్ల భూసమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతుంది అని తెలిపారు. కేవలం రసాయన ఎరువుల ద్వారా పంటను పండిస్తున్న రైతులు నేల పంట ఉత్పాదకపై హానికరమైన ప్రభావాన్ని చూపుతూ పోషకాల సమతుల్యత లోపించడం జరుగుతున్నది తెలిపారు. ప్రస్తుత సేంద్రియ ప్రకృతి వ్యవసాయంలో వాడే వివిధ సేంద్రియ ఎరువులలో జీవన ఎరువులు వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో భూమి సారవంతం అయ్యేలా చేయొచ్చని తెలియజేశారు. అనంతరం డాక్టర్ సాయి మహేశ్వరి మాట్లాడుతూ శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం వారు జీవన ఎరువులు ఆవశ్యకత ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతుందని తెలిపారు.జీవన ఎరువులు అనేవి పొడి లేదా ద్రవరూపంలో ముఖ్యమైన సూక్ష్మజీవులతో ఉండి, వీటిని విత్తనశుద్ధి ద్వారా లేదా సేంద్రియ ఎరువులతో కలుపుకొని లేదా మొక్కలపై పిచికారి ద్వారా , డ్రిప్ ద్వారా కుడా వాడవచ్చు అని తెలిపారు.వివిధ పంటలలో వాడవలసిన జీవన ఎరువుల గురించి వాటి మోతాదు గురించి, వాడవలసిన విధానం గురించి, జీవన ఎరువుల ఉపయోగం వల్ల ప్రయోజనాలు, వాడే విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఆమె తెలియజేశారు. అనంతరండా.ఎస్. మానస శాస్త్రవేత్త( ఉద్యాన విభాగం) చీనీ, నిమ్మ, అరటి పంటల్లో సమగ్ర పద్ధతిలో పోషక వేసవి నీటి యాజమాన్యం గురించి వివరించారు. చీనీ, నిమ్మల్లో ఎక్కువగా గమనించే పిందె రాలే సమస్యను నివారించే యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులతో సంభాషిస్తూ, వారు ముఖ్యం గా ఎదుర్కొనే బంక కారు తెగులు, వేరు కుళ్ళు , ఎండు తెగులు నియంత్రణకై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అరటిలో వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల తో పాటు గెలల యాజమాన్యం తెలియజేశారు. డా. మహేష్ బాబు (శాస్త్రవేత్త) మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల కారణంగా సమతుల్య ఎరువుల వినియోగం రైతులు దృష్టి సారించాలని అందులో ముఖ్యమైనది భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని తెలియజేశారు. మట్టి నమూనా సేకరణ పద్ధతుల గురించి నమూనా విశ్లేషణ పత్రంలో పొందుపరిచే అంశాల గురించి క్లుప్తంగా వివరించారు. పచ్చి రొట్టె ఎరువులు పచ్చి ఆకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేస్తున్న పీఎండీఎస్ కిట్ల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గిరీష్, యువ నిపుణులు, పాలెం చంద్ర, రైతులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించిన సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఓబుళపతి

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలోని అరకటవేముల గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న,ఒక నెల, ఒకగ్రామం, నాలుగు పర్యటనలు కార్యక్రమం అరకటవేముల సచివాలయం లో ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి, సి, ఓబుళ పతి ఆధ్వర్యంలో రైతు సమస్యలు పరిష్కరించాలని డిప్యుటీ తాసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి, ఐ, పెద్దయ్య కార్యక్రమంలోపాల్గోని మాట్లాడుతూ పుట్లూరు మండలంలో అనేక గ్రామాలలో ఎస్ సి, కార్పొరేషన్ ద్వారా భూములు ఉన్న రైతు ల నుంచి భూమి కొనుగోలు చేసి సాగు భూమి లేని దళిత నిరుపేదలకు సాగు భూమి 1990 సం.లో ఇవ్వడం జరిగినది. అందులో భాగంగా అరకటవేముల గ్రామంలో కూడ సర్వే నెంబర్, 285,286,293/ 14,మంది దళితులకు ప్రభుత్వం ఇవ్వండి జరిగింది, రిసర్వే చేసి తరువాత 293/ సర్వే నెంబర్ 5,24 విస్తీర్ణం భూమి 14,మంది రైతులకు ఉమ్మడిగా అందరి పేర్లతో వస్తున్నది. కావున ఈ 5,24,ఎకరాల భూమి ఎవది వారికి అంలైన్లో ఎక్కించాలని సిపిఐపార్టీ రైతుల తరపున కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో ఓబుళపతి, వెంకటనారాయణ, రామాంజనేయులు ,నారాయణ,పెద్దిరాజు,తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాలు ట్రాక్టర్లు తనిఖీ : సీఐ తిమ్మయ్య

ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు



శ్రీకాళహస్తి పిచాటురు నడిమార్గమధ్యం శివనాథపురం గ్రామం నందు తొట్టంబేడు మండలం సిఐ తిమ్మయ్య ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు ఓనర్లను డ్రైవర్లను హెచ్చరించడం జరిగింది. మద్యం సేవించి గానే లైసెన్స్ లేకుండా గాని బండి పేపర్లు సరైన రికార్డ్స్ లేకుండా వాహనాలు నడిపితే చలనాలు తప్పనిసరి అని హెచ్చరించడం జరిగినది.

## పెండింగ్ సమస్యల తక్షణ పరిష్కారానికే ప్రభుత్వం ప్రాధాన్యం

ప్రజా భూమి ప్రతినిధి:అమరావతి

: రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తోందని అడిషనల్ సీసీఎల్ఏ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు.గురువారం జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామంలో నిర్వహించిన "ఒక నెల -- ఒక గ్రామం నాలుగు పర్యటనలు" కార్యక్రమానికి వెంకట మురళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సంబంధిత భూవివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని ఆయన వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను గుర్తించి, తక్షణమే పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, జి. కొండూరు మండల ఇన్చార్జి తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్, ఆర్ఐ మహేందర్ సింగ్, ఏవో సూరిబాబు, పీఆర్ ఏఈ సాంబశివరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.గ్రామస్థులు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేయడంతో కార్యక్రమం సజావుగా సాగింది.

# సిద్దవటంలో చేనేత కార్మికుల సంబరాలు

## -200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై హర్షాతిరేకాలు




ప్రజాభూమి, సిద్దవటం: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పట్ల క్షేత్రస్థాయిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న సిద్దవటం మండలంలోని చేనేత కార్మికులు గురువారం మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్.కే.ఆర్ నగర్ చేనేత క్లస్టర్ భవనంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు తాము పొందిన 'జీరో' విద్యుత్ బిల్లులను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కరెంటు బిల్లుల చెల్లింపు తమకు భారంగా ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందించడం వల్ల తమ ఆర్థిక కష్టాలు కొంత వరకు తగ్గుముఖం పడతాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. అసలు తాము కోరకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ఒక గొప్ప వరమని వారు కొనియాడారు. ఇదే తరుణంలో తమ వృత్తి ఎదుర్కొంటున్న మరికొన్ని సవాళ్లను కూడా వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'నేతన్న నేస్తం' పథకం కింద ఇచ్చే వార్షిక ఆర్థిక సాయాన్ని రూ. 25,000లకు పెంచి తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మార్కెట్లో నూలు, రంగులు వంటి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల చేనేత వృత్తి నిర్వహణ భారంగా మారిందని, ఈ పెంచిన ఆర్థిక సాయం అందితేనే చేనేత కుటుంబాలు నిలదొక్కుకోగలవని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ఆగస్టు 7న నిర్వహించబోయే 'జాతీయ చేనేత దినోత్సవం' నాటికి ఈ పెంచిన నిధులను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలని వారు కోరారు. ప్రభుత్వం తమకు అండగా నిలిస్తే, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా తాము ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, చేనేత విభాగం కార్యదర్శి శ్రీరాందాసు వెంకట్, సొసైటీ అధ్యక్షులు గంజి సుబ్బరాయుడు, జింకా శ్రీనివాసులు, మునగపాటి సుబ్బరాయుడు, వార్డు మెంబర్ సామల చెంగయ్య, పుత్తా రవి, మల్లూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు కూటమి ప్రభుత్వంతో పాటు విద్యుత్ మరియు చేనేత జౌళి శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తత అవసరం

### - ఫైర్ సేఫ్టీ వీక్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం
### - మాక్‌డ్రిల్ నిర్వహణ
### - అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె
ఫైర్ సేఫ్టీ వీక్‌లో భాగంగా వేంపల్లి ఫైర్ స్టేషన్ సిబ్బంది గురువారం స్థానిక పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గృహాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాల వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తే భారీ అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామిరెడ్డి తెలిపారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో అగ్నిమాపక పరికరాల వినియోగ విధానం, మంటలను అదుపులోకి తీసుకొచ్చే పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మహమ్మద్ సాలార్, చిన్ను, భీమాంజనేయులు, ఆసిఫ్‌తో పాటు కాలనీ ప్రజలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిర సేవలు

### 159 మందికి కంటి ఆపరేషన్లు
### శంకర్ నేత్రాలయ ఇన్చార్జి భాను ప్రకాష్




ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ని వెంకటప్ప మెమోరియల్ పాఠశాలలో ఖమ్మం తిరుపాల్ రెడ్డి, ధర్మపత్ని రామ లక్ష్మణ జ్ఞాపకార్థం వారి కుమారుడు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి చికిత్స శిబిరం నేటితో ముగిసిందని శంకర్ నేత్రాలయ ఇంచార్జ్ భాను ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ఈ ఉచిత కంటి పరీక్షలలో మొత్తం 159 మందికి కంటి ఆపరేషన్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇచ్చిన మందులను సక్రమంగా వాడాలని ఆపరేషన్ చేయించుకున్న వారికి కంటిలో మందులు వేసి వారికి ఆయన తెలిపారు. కళ్లకు గాలి తగలకుండా అద్దాలు బాగా వాడాలని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# మన కడప స్వచ్ఛ కడప

### మన పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత
### ఎమ్మెల్యే మాధవరెడ్డి, కమిషనర్ రాకేష్ చంద్ర



ప్రజా భూమి, కడప సిటీ :
మన కడప స్వచ్ఛ కడప అనే సంకల్పంతో కడపనగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర పరి శుభ్రతను మరింత బలోపేతం చేయుటకు వినూతన కార్యక్ర మంగా మెగా మాస్ గ్యాంగ్ వ ర్క్ నిర్వహించబడింది.ఈ కా ర్యక్రమం లో ప్రభుత్వ విప్,కడప శాసనసభ్యులురెడ్డప్పాగారి మాధవి రెడ్డి ఆధ్వర్యంలో కడ ప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్ర నేతృత్వంలో 42వ డివిజన్ రవీంద్ర నగర్ సచివాలయం పరిధిలో విస్తృ తంగా చేపట్టబడింది.ఈ కార్య క్రమములో 100 మంది పారి శుద్ధ్య కార్మికులను ఒకేచోట స మీకరించి,ఒక వార్డు పరిధిలో ని ప్రధాన రహదారులు, కాల నీలు,అంతర్గత వీధులు, డ్రై నేజీలు,ఖాళీ ప్రదేశాలు ప్రాంతాలలో సమగ్ర శుభ్రత కార్య క్రమాలు నిర్వహించబడినవి. ప్రత్యేకంగాచెత్తపేరుకుపోయిన ప్రదేశాలు,డ్రైనేజీ వ్యవస్థ లు,బహిరంగంగా చెత్త వేయ బడుతున్న ప్రాంతాలను గుర్తిం చి,యంత్రాలు, మానవ వనరు లను వినియోగించి వేగవంతగా శుభ్రపరిచే చర్యలు చేపట్టా రు.ఈ కార్యక్రమం ద్వారా త క్కువ సమయంలో గరిష్ట స్థా యిలో పరిశుభ్రత సాధించడం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్ణయించ రు.ఘన వ్యర్థాలనిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట యొక్క ప్రాము ఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించబడింది.ఈ సందర్భంగా గృహాలకు గ్రీన్, బ్లూ కలర్ డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. తడి చెత్తను గ్రీన్ బిన్‌లో,పొడి చెత్తను బ్లూ బిన్‌లో వేయవల సిందిగా సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాధవి రెడ్డి మాట్లాడుతూ నగర పరిశుభ్ర తలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని,ప్రతి పౌరుడు తన పరిసరాలను శుభ్ర శీగా ఉంచుకోవడం ద్వారా మాత్రమే స్వచ్ఛ కడప లక్ష్యం సాధ్యమవుతుందని,ఈ దిశగా నగరంలోని అన్ని వార్డుల లో ఈ మెగా మాస్‌గ్యాంగ్ వర్క్ కార్యక్రమాలనుదశలవారీ గా నిర్వహించి, నగరవ్యాప్తం గా పరిశుభ్రతను మరింత మెరుగుపరచడానికి చర్యలు చేపడతామని వారు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, నగరపాలకసంస్థఅధికారులు, సిబ్బంది,పారిశుద్ధ్య కార్మికులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ వృషభాచలేశ్వర స్వామివారిని దర్శించుకున్న రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్

### - రాజగోపురం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం



ప్రజాభూమి, వేంపల్లె
దేవాదాయ ధర్మాదాయ శాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ వేంపల్లిలోని ఎద్దులకొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందినట్లు ఆలయ ఈఓ శుభాష్, చైర్మన్ పీవీ రమణ లు తెలిపారు. అనంతరం ఆలయ చరిత్రను ముఖ్య అర్చకులు హరిప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎద్దులకొండ వద్ద ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని, పరిసర ప్రాంతాల్లో చెట్లు పెంచాలని సూచించారు. స్వామివారి అలంకరణ కోసం తులసి మొక్కలు పెంచాలని రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలోని స్వామివారి ఉత్సవమూర్తులను వెంటనే ఎద్దులకొండపై ఉన్న మూలవిరాట్టు సన్నిధికి తరలించి నిత్య పూజలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఎద్దులకొండపై రాజగోపురం, ప్రాకార నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ శంకర బాలాజీ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి గండిక్షేత్రంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు

### - మే 13 వరకు వైభవంగా ఉత్సవాలు



ప్రజాభూమి, చక్రాయపేట
రాయలసీమ జిల్లాలలో ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణ మహా కుంభాభిషేక మహోత్సవాలు మే 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మన్ కల్లూరి వెంకట



స్వామి తెలిపారు. సుమారు రూ.28.05 కోట్ల వ్యయంతో సర్వాంగసుందరంగా పునఃనిర్మించిన గండి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాముల నేతృత్వంలో మే 8న అంకురార్పణతో మహా కుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 9న రామసహస్ర లక్ష తులసి అర్చన,10న సీతాసహస్రనామ లక్ష కుంకుమార్చన,11న స్వామివారికి ఆంజనేయ సహస్రనామ నాగవల్లి దళార్చన, 12న హనుమత్ జయంతి సందర్భంగా మూలమూర్తికి సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. మే 13న మహాపూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామివారి సర్వదర్శనం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. త్రేతాయుగ చరిత్ర కలిగిన గండి క్షేత్ర ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది. ఆలయ చైర్మన్ కల్లూరి వెంకటస్వామి,ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

# నిర్లక్ష్యం వహించకుండా జనగణన పూర్తిచేయాలి

ప్రజాభూమి,పులివెందుల
ఎన్యుమరేటర్లు నిర్లక్ష్యం వహించకుండా జనగణన ను పూర్తి చెయ్యాలి అని ఆర్డిఓ చిన్నయ్య అన్నారు. గురువారం జనగణన 2027 ప్రక్రియలో భాగంగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న జనగనన సర్వే ని ఆర్డిఓ చిన్నయ్య మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ లతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో, ఖచ్చితత్వంతో ఎటువంటి పొర పాట్లు లేకుండా నమోదు చేయాలని ఆదేశించా రు.అంతే గాకుండా సర్వేలో నిర్లక్ష్యం వహించకుం డా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనిచేయాలని, ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శిం చి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రజలకు సర్వే ప్రాముఖ్యతను వివరించి వారి సహకారంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగప డుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం లో సంబంధిత ఎన్యుమరేటర్లు బయమత్ బాబు, సల్మా బేగం రాజగోపాల్, రోహిణి, మల్లేశ్వర్ రెడ్డి, అయేషా పాల్గొన్నారు.



## ఐవీఆర్ సర్వేపై పీలేరు రెవెన్యూ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం




ప్రజాభూమి :పీలేరు
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచిస్తూ పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులతో పీలేరు పంచాయతీ ఆఫీసులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం డిపిఓ రాధమ్మ మరియు డిడిఓ లక్ష్మీపతి ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ఐవీఆర్ సర్వే ఎంతో కీలకమని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా సేవలను మరింత మెరుగుపర్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అలాగే పన్నుల వసూళ్లపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ నెల 31వ తేదీ లోపు పన్నులు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం డిస్కౌంట్ అందజేస్తోందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గడువులోపు పన్నులు చెల్లించాలని అధికారులు కోరారు. పన్నుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎండీవోలు, డిప్యూటీ ఎండీవోలు, పీడీవోలు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సమయానికి పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఉపాధి హామీ కూలీలకు తక్కువ వేతనం..

### న్యాయం చేయాలని కూలీల డిమాండ్!



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని టక్కోలి గ్రామం ఎర్ర చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు తమకు వస్తున్న తక్కువ వేతనంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక నేల గట్టిగా ఉండటంతో కష్టపడి పనిచేసినా, రోజుకు కేవలం ?150 మాత్రమే పడుతోందని వారు వాపోతున్నారు. ఇతర పనులకు వెళ్తే ఇంతకంటే మెరుగైన కూలీ లభిస్తుందని, అధికారులు స్పందించి కొలతల ప్రకారం తమకు న్యాయమైన వేతనం అందేలా చూడాలని కోరారు. ఈ విషయంపై ఏపీవో నరసింహులు స్పందిస్తూ.. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తేనే పూర్తిస్థాయి కూలీ డబ్బులు జమవుతాయని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రదేశాల్లో నిబంధనల మేరకు పనులు చేయాలని ఆయన సూచించారు.

# ప్రాణ సంకటంగా మారిన విద్యుత్ తీగలు

### సిద్ధవటం రైతుల ఆవేదన



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రం శివారులోని పంట పొలాల్లో విద్యుత్ తీగలు భూమికి అతి సమీపంలో వేలాడుతుండటంతో రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఒక విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయని, దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు మండిపడుతున్నారు.ఈ విషయమై విద్యుత్ ఏఈ జయచంద్ర స్పందిస్తూ.. సమస్యను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించామని, దెబ్బతిన్న స్తంభాన్ని మార్చి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుతో నేతన్నల హర్షం

### టీడీపీతోనే న్యాయం జరుగుతుందన్న పుత్తా బాబు



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ సాయినగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నేత పుత్తా బాబు మాట్లాడుతూ, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షించదగ్గదని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చేనేత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఏటా నేతన్నకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందించే కొత్త పథకాన్ని ప్రభుత్వం రూపొందిస్తోందని వెల్లడించారు. గురువారం గ్రామంలో ఉచిత విద్యుత్ వర్తించిన కార్మికులు కరెంటు బిల్లులు చూపిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## రాజంపేట బలిజపల్లి గంగమ్మ తల్లిని దర్శించుకున్న జనసేన నేత అతికారి కృష్ణ



ప్రజాభూమి, రాజంపేట: స్థానిక బలిజపల్లిలో అత్యంత వైభవంగా జరుగుతున్న గంగమ్మ జాతర మహోత్సవంలో జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు. గుగ్గిళ్ళ చంద్ర మౌళి ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఆయన, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామ దేవత గంగమ్మ తల్లి ఆశీస్సులు రాజంపేట ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరినీ చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి. రమణ, ఒంటిమిట్ట సింగిల్ విండో చైర్మన్ జయకృష్ణ, కేదారనాథ్ బాబు, గుగ్గిళ్ళ చంద్రమౌళి, ఎద్దుల సాగర్ తో పాటు కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి, చిత్తూరు 8

శుక్రవారం 08 మే 2026

## బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం విప్లవ వీరుడికి ఘన నివాళులు

### అల్లూరి త్యాగాలు యువతకు శాశ్వత స్ఫూర్తి జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ప్రాజా భూమి ప్రతినిధి తిరుపతి.



గిరిజన హక్కుల కోసం పోరాడిన అల్లూరి ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబం అధికారులు, సిబ్బంది కలిసి వీరుడి చిత్రపటానికి పూలమాలలు సమర్పణ .మన్యం వీరుడి జ్ఞాపకాలు జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయి ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలి జాయింట్ కలెక్టర్ పిలుపుబి అల్లూరి పోరాటం స్వాతంత్ర్య సమరానికి బలమైన పునాది గిరిజనుల హక్కుల కోసం చేసిన ఉద్యమం నేటికీ ప్రేరణ జిల్లా ప్రజలు గర్వంగా స్మరించిన మన్యం విప్లవ వీరుడు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం స్వాతంత్ర సమరయోధుడు, మన్యం విప్లవ వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డిఆర్ఓ నరసింహులు కలిసి వీరుడి చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నేటి యువతకు శాశ్వత స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఆయన పోరాటం గిరిజన హక్కుల కోసం, ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబమని అన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని గోవిందరావు పిలుపునిచ్చారు. యువత ఆయన స్ఫూర్తితో ముందుకు సాగి సమాజానికి సేవ చేయాలని సూచించారు.అధికారులు, సిబ్బంది కలిసి మన్యం వీరుడి జ్ఞాపకాలను స్మరించారు.అల్లూరి పోరాటం స్వాతంత్ర్య సమరానికి బలమైన పునాది అని, ఆయన త్యాగాలు నేటి తరానికి మార్గదర్శకమని అధికారులు పేర్కొన్నారు.గిరిజనుల హక్కుల కోసం చేసిన ఉద్యమం నేటికీ ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.జిల్లా ప్రజలు ఆయన త్యాగాలను గర్వంగా స్మరించుకుంటూ, కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమం హృదయాలను తాకింది.అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ప్రజలు ఆయనను స్మరించుకున్నారు.మన్యం వీరుడి జ్ఞాపకాలు జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయి.అల్లూరి సీతారామరాజు త్యాగాలు, పోరాటం నేటి యువతకు శాశ్వత స్ఫూర్తిగా మారాయి.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, సెట్విన్ సీఈవో మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏవో రామానుజుల నాయక్, సిపిఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అవిలాల గంగమ్మ జాతరలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సారే సమర్పణ

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, శక్తి స్వరూపిణి శ్రీ అవిలాల గంగమ్మ జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. జాతరలో భాగంగా తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలతో కూడిన సారేను సమర్పించారు.అవిలాల గ్రామానికి చేరుకున్న డాలర్స్ దివాకర్ రెడ్డికి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సారేను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయానికి చేరుకున్నారు.అనంతరం గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అవిలాల కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం.. తిరుపతి జిల్లా పోలీసుల ఘన నివాళి.

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు (పరిపాలన), రవి మనోహరచారి (శాంతిభద్రతలు), శ్రీనివాసరావు (సాయుధ దళం), ఎస్‌బి డీఎస్పీ గీతా కుమారి, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.అల్లూరి సీతారామరాజు దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## శక్తి సాధనకు శ్రీ వారాహి దీక్షే మార్గం - మహా రుద్ర వారాహి స్వామి పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



శ్రీ మహా రుద్ర వారాహి దాసుడు మహా రుద్ర వారాహి స్వామి దీక్ష కోసం భక్తులకు ప్రత్యేక పిలుపునిచ్చారు. శ్రీ వారాహి అమ్మవారి అనుగ్రహంతో జీవితంలోని అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, "శ్రీ వారాహి అమ్మవారు దశమహావిద్యలలో ఒక శక్తివంతమైన దైవం. ఆమె కృప కలిగితే ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తొలగి శాంతి, సౌఖ్యం కలుగుతాయి. వివాహం, సంతాన ప్రాప్తి, ఉద్యోగ పదోన్నతి వంటి కోరికలు సఫలమవుతాయి" అని తెలిపారు.శ్రీ వారాహి నవరాత్రులు జూలై 15, 2026న ప్రారంభమై జూలై 24, 2026 వరకు ఘనంగా నిర్వహించబడనున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అలంకార సేవలు భక్తుల కోసం ఏర్పాటు చేయబడతాయని చెప్పారు.అలాగే 41 రోజుల పాటు నిర్వహించే వారాహి దీక్షను స్వీకరించదలచిన భక్తులు జూన్ 19న శుద్ధ పంచమి తిథి నాడు మాల ధరించి దీక్ష ప్రారంభించాలని సూచించారు. ఈ దీక్షను నియమ నిష్ఠలతో పాటిస్తే వారాహి అమ్మవారి అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తుందని వివరించారు.ఒకే ఒక పరిష్కారం వారాహి దీక్ష అనే నినాదంతో భక్తులు ఈ పవిత్ర సాధనలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. భక్తులందరూ తమ శక్తి మేరకు శ్రీ వారాహి అమ్మవారి నిత్య కైంకర్యాల కోసం విరాళాలు సమర్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాలను శ్రీ ఆది వారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్, వారాహి సేవా సైన్యం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ వారాహి అమ్మవారి కృపను పొందాలని మహా రుద్ర వారాహి స్వామి ఆకాంక్షించారు. ఆదివారాహి అమ్మవారి దీక్ష వివరాల కోసం సంప్రదించండి.వాట్సాప్ 9492247456

## సూర్యప్రభ వాహనంపై తేజోవంతంగా శ్రీ వేదనారాయణ స్వామి

### మే 8న వైభవంగా రథోత్సవం, కల్యాణోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి నాగలాపురం



నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవ ఆలయ నాలుగు మాడ వీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. గోవింద నామస్మరణల మధ్య భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారి అనుగ్రహం పొందారు. సకల లోకాలకు తేజస్సును ప్రసాదించే సూర్యభగవానుని ప్రతీకగా సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమివ్వడం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. సకల జీవరాశులకు ప్రాణాధారమైన సూర్యుని మహిమను ప్రతిబింబించేలా ఈ వాహనసేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మే 8న రథోత్సవం, కల్యాణోత్సవం : బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం 6.25 గంటలకు శ్రీ వేదనారాయణస్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. మహారథంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా సాయంత్రం 4.30 గంటల నుండి 6.30 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించారు.

## 70 రోజుల పోరాటం -- కార్మికుల న్యాయమైన డిమాండ్లపై వెంటనే నిర్ణయం తీసుకోండి!

### స్విమ్స్ కార్మికుల సమస్యలపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు సిఐటియు నేతల వినతి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు గత 70 రోజులుగా తమ న్యాయమైన హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తున్న నేపథ్యంలో నేడు గురువారం ఉదయం న్యూక్లియర్ మెడిసిన్ విభాగంలో నూతన స్కానింగ్ మిషన్ ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మి, డాలర్ దివాకర్ రెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ తదితర అధికారులకు స్విమ్స్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం. మాధవ్, నగర అధ్యక్షురాలు పి. బుజ్జి, యూనియన్ కార్యదర్శి రవి, అధ్యక్షులు వి. సూరి, కోశాధికారి మారిముత్తు, గోపీలు తదితరులు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతూ...కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల పేరుతో కార్మికులను దోపిడీ చేయడం, తక్కువ వేతనాలతో కుటుంబాలను నెట్టుకొచ్చే పరిస్థితి కల్పించడం అమానుషమని సిఐటియు నాయకులు మండిపడ్డారు. కార్మికులు అడుగుతున్నవి విలాసవంతమైన కోర్కెలు కావని, కనీస జీవన భద్రత కోసం చేసే న్యాయమైన డిమాండ్లేనని తెలిపారు. 70 రోజులుగా ఎండలో, వానలో, ఆకలితో కుటుంబాలను వదిలి పోరాడుతున్న కార్మికుల ఆవేదనను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికుల చెమటతో నడుస్తున్న సంస్థల్లో కార్మికులనే రోడ్డున పడేయడం పాలక వర్గాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు. సమస్యలు వివరించేందుకు ఈవో, జేఈవో, పాలక మండలి సభ్యులు, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రతి సారి వినతిపత్రాలు తీసుకుని ఫైళ్ల కింద పెట్టడం తప్ప సమస్య పరిష్కారానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఓర్పును బలహీనతగా భావిస్తే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ స్విమ్స్ కార్మికుల సమస్య నిన్న జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో కూడా చర్చకు వచ్చిందని, కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించి నాలుగు ఐదు రోజులలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యంతోనే చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. చైర్మన్ ఇచ్చిన హామీని కార్మికులు స్వాగతించినప్పటికీ, మాటలు కాదు చేతల్లో పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కారం కాకపోతే లక్ష కరపత్రాలు ముద్రించి స్విమ్స్ -- టీటీడీ యాజమాన్యాల ద్వంద్వ వైఖరి, కార్మికుల పట్ల నిర్లక్ష్యం, మోసపూరిత హామీలను తిరుపతి ప్రజలకు వివరిస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. కార్మిక వర్గ ఐక్యతతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు.

## మహిళల భద్రతే లక్ష్యం.. గ్రామాల్లో శక్తి టీం విస్తృత అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీం పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు.ఇందులో భాగంగా భాగ్యనగరం గ్రామంలో శక్తి టీం పోలీసులు గ్రామ సభ నిర్వహించి మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, చిన్నారులపై దాడులు, కిడ్నాప్‌లు, అదృశ్యాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.అదేవిధంగా మొబైల్ గేమ్స్, సెల్ ఫోన్లు, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, మహిళలు మరియు చిన్నారులపై జరుగుతున్న నేరాల గురించి కేస్ స్టడీస్ ద్వారా అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, గుర్తు తెలియని లింకులు, వీడియో కాల్స్, డ్రగ్స్, మహిళల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లపై ప్రజలకు సమాచారం అందించారు.అదే విధంగా వేసాలమ్మ దేవాలయం పరిసర ప్రాంతంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చిన్నారుల అదృశ్యం, కిడ్నాప్‌లు, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, చైన్ స్నాచింగ్ వంటి అంశాలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## స్విమ్స్‌లో రూ.52 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలు - పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి: డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుమల తిరుపతి దేవస్థానములు మరియు శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంయుక్త ఆధ్వర్యంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో "శ్రీ బాలా జీ ఆరోగ్య వరప్రసాదిని పథకం" కింద అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఖరీదైన వైద్య పరీక్షల కోసం పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఇప్పుడు టీటీడీ నిధులతో స్విమ్స్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం రాయలసీమ ప్రాంత ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారికి కూడా ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు.సుమారు రూ. 52 కోట్ల వ్యయంతో హై ఎనర్జీ అడ్వాన్స్‌డ్ లీనియర్ యాక్సిలరేటర్, పెట్ సిటీ సిస్టమ్, గామా కెమెరా వంటి అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సాంకేతిక పరికరాల ద్వారా గుండె, మెదడు, క్యాన్సర్, థైరాయిడ్ సంబంధిత వ్యాధులను త్వరితగతిన గుర్తించి మెరుగైన చికిత్స అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీటీడీ అధ్యక్షుడు, దేవస్థానం బోర్డు సభ్యులు, తిరుపతి ఎమ్మెల్యే, స్విమ్స్ డైరెక్టర్, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాలు ముందే గుర్తించి నిలుపుదల చేయండి. ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి





నగరంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను ముందే గుర్తించి నిలుపుదల చేయాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పోస్టల్ కాలనీ, నారాయణ పురం, డి. బి. ఆర్ రోడ్డు, చింతలచేను, కైకాల చెరువు తదితర ప్రాంతాల్లో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల తో పాటు, నిర్మాణాలను పరిశీలించారు. నగరంలోని ఫుట్ పాత్ ఆక్రమణలు, అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు పిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది నగరంలో పర్యటిస్తూ అనుమతులు లేని నిర్మాణాలు గుర్తించి ముందే అడ్డుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట ఏసీపీ పార్వతి ప్రియ, స్వర్ణ వార్డు కార్యదర్సులు, తదితరులు ఉన్నారు.

## పిడుగుపాటుతో మృతి చెందిన గొర్రెల కాపరని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రాజా భూమి ప్రతినిధి సత్యవేడు.




నిన్న కురిసిన అకాల వర్షాలకు పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి సిద్ధార్థ గ్రామ శివారులో గొర్రెల మేపడానికి వెళ్లిన సందర్భంలో మధ్యాహ్న పిడుగుపాటుకు మృతి చెందాడని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం 25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తులకు బలయ్యే గొర్రెల కాపరులకు ప్రభుత్వం ఒక ప్యాకేజీ ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు మాంసాహారాన్ని అందిస్తున్న గొర్రెల కాపరులకు తద్వారా వేల కోట్ల రూపాయలు ఆదాయం పొందుతున్న ప్రభుత్వం కాపరుల కుటుంబాల్ని విపత్తుల సందర్భంలో ఆదుకునే విధంగా ఒక ప్రత్యేక పథకాన్ని రూపొందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని జనార్ధన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## తాతయ్యగుంట గంగమ్మ తల్లికి సారె సమర్పించిన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి





తిరుపతి పట్టణంలో వైభవంగా జరుగుతున్న తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర సందర్భంగా శాప్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అనిమిని రవి నాయుడు దంపతులకు దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్, వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రవి నాయుడు దంపతులు అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ తిరుపతి ప్రజలపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అలాగే దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న తీరు అభినందనీయమన్నారు. జాతరకు భారీగా తరలివస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

# గోవింద నామస్మరణల మధ్య ప్రారంభమైన శ్రీనివాసమంగాపురం వసంతోత్సవాలు..!


## -మే 08న కనులపండువగా స్వర్ణ రథోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి :

సాక్షాత్తు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రతిరూపంగా భక్తుల అర్చనలు అందుకుంటున్న శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం వార్షిక వసంతోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గోవింద నామస్మరణలతో, మంగళవాయిద్యాల నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వసంత ఋతువులో ప్రకృతి ప్రసాదించిన పుష్పాలు, ఫలములను స్వామివారికి సమర్పించి కలియుగ వైకుంఠ వాసుడు శ్రీనివాసుని అనుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవాల అంతరార్థమని అర్చకులు తెలిపారు. భక్తుల హృదయాలలో భక్తి, ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపే ఈ ఉత్సవాలు ప్రత్యేకమైనవిగా నిలుస్తాయని పేర్కొన్నారు. వైఖానస మాసంలోని శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ మూడు రోజుల ఉత్సవాలకు తొలి రోజున విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉభయ నాంచారులతో ఆలయం నుండి వసంత మండపానికి వేంచేపు చేయగా, మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.00 గంటల వరకు వైఖానస ఆగమోక్తంగా తేనె, చందనం, పుష్పాలతో నిర్వహించిన అభిషేక సేవ భక్తులను పరవశింపజేసింది. అలంకరించి ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధుల





ఉదయం 8.30 గంటలకు మలయప్పస్వామివారు గోవింద నామాలతో ఆలయ వీధులు మారుమోగాయి. స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా ఉత్సవంలో స్వామివారు భక్తులకు దివ్య దర్శన భాగ్యం కల్పించారు. వసంతోత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిర్వహించే ఆర్జిత సేవలైన నిత్య కల్యాణోత్సవం, అలాగే మే 07న తిరుప్పావడ సేవలను టిటిడి రద్దు చేసింది. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

మే 08న స్వర్ణ రథోత్సవం..: వసంతోత్సవాల్లో అత్యంత వైభవంగా నిర్వహించే స్వర్ణ రథోత్సవం మే 08వ తేదీ శుక్రవారం సాయంత్రం 6.00 గంటలకు జరగనుంది. బంగారు తేజస్సుతో అలంకరించిన స్వర్ణ రథంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య మంగళ దర్శనం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ రమేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పలువురు అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు వల్లే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు-ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడి





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

విద్యాశాఖమంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులతో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వం పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించారని భవిష్యత్తులో విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచించారు . గూడూరు పట్టణంలో డి ఆర్ డబ్ల్యు కళాశాలలో ఇటీవల పెడితేనా పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో గూడూరు నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలలో 550 కు పైగా మార్కుల సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు విద్యార్థినీ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సన్మానించి ట్యాబ్ లను అందజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని మంత్రి నారా లోకేష్ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చేదిద్దడం వల్ల ఇది సాధ్యమైందని గుర్తు చేశారు పాఠశాలల్లో మౌలిక వసతులు మంచి రుచికరంగా మధ్యాహ్నం భోజనం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు ఇంకా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు గుర్తింపు తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్ ,ఎంఈఓ రవీంద్ర ,రవూఫ్,నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు ,వెంకటేశ్వరరాజు ,బిల్లు చెంచురామయ్య, రహీం ,మస్తాన్ నాయుడు ,రాజశేఖర్, భాస్కర్ రెడ్డి ,జలీల్ ,శివకుమార్,కిషోర్ నాయుడు ,మట్టం శ్రావణి ,భారతి ,తదితరులు పాల్గొన్నారు



# సంజీవని' ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష... కుప్పంలో అద్భుత ఫలితాలు ఇస్తున్న డిజిటల్ హెల్త్ -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ 'పిల్లలే సంపద', మరియు 'సంజీవని' కార్యక్రమాలపై అత్యంత కీలకమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు బాగా పడిపోతుండటం, ప్రైవేటు ఆసుపత్రులలో సీ-సెక్షన్లు పెరిగిపోతుండటం, తక్కువ వయసులోనే గర్భం దాల్చడం లాంటివి భవిష్యత్తులో మన జనాభా సమతుల్యతను తీవ్రంగా దెబ్బతీస్తాయని ఆయన విశ్లేషించారు. భవిష్యత్తులో పనిచేసే యువత సంఖ్య తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉండటంతో, దీనికి చెక్ పెట్టేలా "పెద్ద కుటుంబం - సంపద పెంచే కుటుంబం" అనే నినాదంతో 'పిల్లలే సంపద' అనే అద్భుతమైన పథకాన్ని ఆయన వివరించారు. ఆ తర్వాత ఆయన 'సంజీవని' డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యాన్ని చేరువ చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఆభా కార్డుల అనుసంధానంతో పౌరుల ఆరోగ్య రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో సురక్షితంగా భద్రపరుస్తూ, వాట్సాప్ ద్వారా 48 గంటల్లోనే రిపోర్టులు పంపే ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ మొబైల్‌లోనే డాక్టర్ అపాయింట్‌మెంట్లు



బుక్ చేసుకునేలా, వాయిస్ కమాండ్ ద్వారా ఆరోగ్య సందేహాలు అడిగి తెలుసుకునేలా 'సంజీవని యాప్'ను ఎంత సులభంగా డిజైన్ చేశారో కలెక్టర్లకు వివరించారు. టెలీ కన్సల్టేషన్ సేవలతో పల్లెల్లోని ప్రజలు నేరుగా స్పెషలిస్ట్ డాక్టర్లతో మాట్లాడే సదుపాయం కల్పించామని ఆయన తెలిపారు. అనంతరం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ఈ 'సంజీవని' ప్రాజెక్టు తమ జిల్లాలో ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ఎంత గొప్పగా అమలవుతోందో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారు ప్రారంభించిన ఈ 'టాటా డిజిటల్ నర్వ్ సెంటర్' ద్వారా 'బ్రిజిటల్' మోడల్‌ను కుప్పంలో విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పల్లెల్లో ఉండే ప్రజలు నేరుగా స్పెషలిస్ట్ డాక్టర్లతో వీడియో కాల్స్‌లో మాట్లాడేందుకు వీ-పాడ్ సదుపాయాన్ని కల్పించామని, స్థానికంగా ఉండే నర్సులు, హెల్త్ కోఆర్డినేటర్లు రోగులకు ముందుగా కౌన్సిలింగ్ ఇచ్చి టెలీ కన్సల్టేషన్ చేయిస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే గర్భిణీలకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ ద్వారా యోగా సెషన్లు కూడా నిర్వహిస్తున్నామన్నారు.

# జిల్లాలో జరుగుతున్న జనగణన (సెన్సస్) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో, సమర్థవంతంగా నిర్వహించాలి-జిల్లా రెవెన్యూ అధికారి

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

జిల్లాలో జరుగుతున్న జనగణన (సెన్సస్) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ జిల్లా అధికారుల టెలి కాన్ఫరెన్స్ ద్వారా, గురువారం జిల్లా రెవెన్యూ అధికారి జిల్లాలోని అన్ని శాఖాధిపతులు (నూణలు), ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులతో జనగణన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... జనగణన కార్యక్రమం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త బాధ్యతతో నిర్వహిస్తున్న అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగీకారంతో మే నెలను జనగణన నిర్వహణకు ఎంపిక చేసుకున్నందున, ఈ కాలంలో కేటాయించిన సిబ్బంది పూర్తిస్థాయిలో అదే పనిలో నిమగ్నం కావాలని స్పష్టం చేశారు. జనగణన విధులకు నియమించిన సిబ్బందిని సంబంధిత జనగణన అధికారుల అనుమతి లేకుండా ఇతర పనులకు మళ్లించరాదని హెచ్చరించారు. ఎవరికైనా ప్రత్యామ్నాయ బాధ్యతలు అప్పగించాల్సివస్తే జిల్లా స్థాయిలో చర్చించి తగిన అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే సిబ్బందికి విస్తృత స్థాయిలో శిక్షణ ఇచ్చినప్పటికీ, కొంతమంది ఎన్యూమరేటర్లు ప్రాథమిక అంశాలపై సందేహాలు వ్యక్తం చేయడం తీవ్ర నిర్లక్ష్యంగా భావించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం కూడా విధుల్లో నిర్లక్ష్యం, తప్పుడు నమోదు, ఫీల్డ్ స్థాయిలో సమాచారం సరిగా సేకరించకపోవడం వంటి చర్యలు జరిగితే



సంబంధిత ఎన్యూమరేటర్లను తక్షణమే సస్పెండ్ చేస్తామని తెలిపారు. అదేవిధంగా, ఎన్యూమరేటర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన సూపర్వైజర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏఎస్ఓలు తమ బాధ్యతలను నిర్వర్తించకపోతే వారిపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 2,712 మంది హెచ్ఎల్ఎల్వీలు పనిచేయాల్సి ఉండగా, ఎవరైనా విధులకు గైర్హాజరవుతే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. జనగణనలో సేకరించే సమాచారం భవిష్యత్తులో అన్ని శాఖలకు ప్రణాళికల రూపకల్పనలో కీలకమని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కొన్ని మండలాల్లో పనులు ఆశించిన స్థాయిలో ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. శాంతిపురం మండలంలో ఎన్యూమరేటర్లు ఫీల్డ్‌కు వెళ్లకపోవడంపై ప్రత్యేకంగా ఆరా తీసి, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనగణన కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని, వచ్చే వారం రోజుల పాటు పూర్తి స్థాయిలో ఫీల్డ్‌లో పని చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో సూచించారు. జిల్లాలోని అన్ని శాఖలు సమాచార హక్కు చట్టం సంబంధించిన హెచ్ ఓ డీ లు లాగిన్ ను రెండు రోజుల్లోపు మ్యాపింగ్ చేయాలి అధికారులను హెచ్చరించారు.

# గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో "ఫెమ్ ఫ్లేర్--2026" ఘనంగా నిర్వహణ

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు




గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత, మహిళల ప్రతిభాభివృద్ధి లక్ష్యంగా "ఫెమ్ ఫ్లేర్--2026" కార్యక్రమాన్ని కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. మహిళా వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలెక్యూషన్, ఆర్ట్ పెయింటింగ్, డ్రాయింగ్, ఫ్యాన్సీ డ్రస్, సింగింగ్, డాన్సింగ్, స్కిట్ డ్రామా, ఫ్లాష్ మొబ్ తదితర పోటీలు నిర్వహించగా విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శైలజ ఏకాంబరం మహిళల ఆరోగ్యం, విద్య, ఆత్మవిశ్వాసంపై అవగాహన కల్పిస్తూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విశ్వక్సేనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు తమ ప్రతిభను వెలికితీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మేనేజ్మెంట్ సెక్రటరీ వై. వినయ్ కుమార్ మహిళా సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. డైరెక్టర్ బి. దత్తాత్రేయ శర్మ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా అవసరమని అన్నారు. మహిళా వేదిక కన్వీనర్ వి. స్వర్ణ కార్యక్రమ వివరాలు తెలియజేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ కొండారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమలకు బస్సు సర్వీసులు పెంచాలి

## రాత్రి వేళల్లో డిపోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

## ఆర్టీసీ డిపో మేనేజర్ కు సీపీఐ నాయకుల వినతి



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు నుండి తిరుపతి తిరుమల పుణ్య క్షేత్రానికి బస్సు సర్వీసులను పెంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ కరోనాకు ముందు తిరుపతి, తిరుమలకు 15 బస్సు సర్వీసులు గూడూరు డిపో నుండి రాకపోకలు సాగిస్తుండగా ప్రస్తుతం కేవలం రెండు బస్సులకే పరిమితమయ్యాయని తెలిపారు. వేసవి సెలవుల్లో బస్సు సర్వీసులను వెంటనే పెంచాలని కోరారు. అదేవిధంగా రాత్రి వేళల్లో



బస్సులన్నీ గూడూరు బైపాస్ నుండి తిరుపతి, బెంగుళూరు, చెన్నై వైపు వెళుతున్నాయని, ఒక్క బస్సు కూడా గూడూరు పట్టణంలోకి రావడం లేదని, దీంతో ప్రయాణికులు రాత్రి వేళల్లో బైపాస్ లో దిగి గూడూరుకు రావాల్సి వస్తోందని, అదేవిధంగా రాత్రి 9 దాటితే నెల్లూరుకు వెళ్లాలన్నా బైపాస్ కు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రాత్రివేళల్లో బస్సులు గూడూరు బస్టాండు మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన డీఎం లక్ష్మీ మాట్లాడుతూ డిపోకు కొత్తగా రెండు బస్సులు మంజూరయ్యాయని, ఆ బస్సులను తిరుపతి మార్గంలో తిప్పుతామన్నారు. త్వరలోనే గూడూరు - తిరుపతికి పెయిడ్ బస్ సర్వీసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, పట్టణ కన్వీనర్ సునీల్ యాదాల, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొమ్మి నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మీరా, ఏఐఎస్ఎఫ్ నాయకులు రిజ్వాన్, దీవెన్ తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి





టిటిడి తిరుపతిలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో 2026 - 27 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించడమైనది. జూన్ 3వ తేదీ వరకు ఆన్ లైన్ లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్ లైన్ దరఖాస్తు ఆంగ్ల భాషలో మాత్రమే ఉంది. విద్యార్థుల సౌకర్యార్థం యూజర్ మాన్యువల్, ఆయా కళాశాలల ప్రాస్పెక్టస్ ను తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంచారు.

**దరఖాస్తు చేసుకోవడం ఎలా ? :** విద్యార్థులు వెబ్ సైట్ ను ఓపెన్ చేసిన వెంటనే రెండు బాక్స్ లు కనిపిస్తాయి. విద్యార్థులు తమకు కావాల్సిన బాక్స్ లపైన క్లిక్ చేశాక, అందులో దరఖాస్తు చేసే విధానాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి. అనంతరం ఇంటర్మీడియట్ కోర్సుకు ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. క్లిక్ చేయగానే స్క్రీన్ పై ఇంగ్లీషు లేదా తెలుగు అనే బాక్స్ లు కనిపిస్తాయి. వాటిలో తమకు కావాల్సిన బాక్స్ లపై క్లిక్ చేయగానే టిటిడి ఆధ్వర్యంలోని రెండు ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఉన్న వివిధ గ్రూప్ లలోని సీట్లు, వాటిలో ప్రవేశానికి కావాలసిన అర్హతలు, సీట్ల భర్తీ విధానం, మార్గదర్శకాలు తదితర వివరాలు కనిపిస్తాయి. విద్యార్థులు నమోదు చేసిన వివరాల ప్రకారం గడువు ముగిశాక వారి ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఆయా కళాశాలలో సీటును తాత్కాలికంగా ఆన్ లైన్ లో కేటాయించి, విద్యార్థులకు ఎస్ఎంఎస్ పంపుతారు. సీటు పొందిన సదరు విద్యార్థి ధృవీకరణ పత్రాలను వారి సమక్షంలోనే సిస్టమ్ లోకి అప్ లోడ్ చేస్తారు. విద్యార్థి ధృవీకరణ పత్రాలలోని వివరాలు సరిగాలేకున్నా, ఆన్ లైన్‌లో సరిపోల్చకున్నా (టాలీకాకున్న) సీటు రద్దు కావడంతోపాటు సిస్టమ్ నుండి ఆటోమేటిక్ గా సదరు దరఖాస్తు రద్దు అవుతుంది. విద్యార్థులు గడువుకు ముందే సరైన సమాచారాన్ని ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. గడువు ముగిశాక సవరణలకు అవకాశం ఉండదు. అందువల్ల విద్యార్థులు స్టూడెంట్ యూజర్ మాన్యువల్‌ను, కళాశాల ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి పక్కన పెట్టుకుని ఆన్ లైన్ లో చాలా జాగ్రత్తగా దరఖాస్తు చేయాలని టిటిడి కోరుతోంది. విద్యార్థులు దరఖాస్తు నింపు సమయంలో సాంకేతిక సందేహాలు, కోర్సులలోని వివిధ గ్రూప్ లు, వసతి గృహాలు, నిబంధనలు తదితర సందేహాలను హెల్ఫ్ లైన్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. వెబ్ సైట్ ను ఓపెన్ చేయగానే స్క్రీన్ పై హెల్ఫ్ లైన్ నంబర్లు అనే బాక్స్ ఉంటుంది. అక్కడ క్లిక్ చేస్తే సంబంధిత అధ్యాపకుల ఫోన్ నంబర్లు ఉంటాయి. వీటి ద్వారా ఆయా అంశాలలోని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

# "ఒక నెల--ఒక గ్రామం" తొలి పరిశీలనలో 10 వినతులు స్వీకరణ

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట మండలంలోని ఎస్ యూ పురం గ్రామంలో బుధవారం "వన్ మంత్--వన్ విలేజ్" తొలి సందర్శన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 10 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 8 దరఖాస్తులు ఉండగా, అందులో ఇంటి స్థలాలకు సంబంధించినవి 3, భూ సమస్యలకు సంబంధించినవి 3, సర్వే అంశాలకు సంబంధించినవి 2 ఉన్నాయి. అదనంగా ఎంపీడీవో శాఖకు చెందిన పెన్షన్‌ల సమస్యలపై 2 దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు ఈ కార్యక్రమం ద్వారా హామీ ఇచ్చారు. రెవెన్యూ పర్యవేక్షణలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, గ్రామ సిబ్బంది, పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రిగా స్విమ్స్ అభివృద్ధి - టిటిడి ఛైర్మన్ బిఆర్. నాయుడు

### రూ.100 కోట్లతో స్విమ్స్ నందు ఆధునీకరణ మరియు వైద్యయంత్రాలు ప్రారంభం.





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాయలసీమ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యములో భాగంగా రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రిగా వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ను అభివృద్ధి చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి అధ్యక్షులు బిఆర్ నాయుడు వెల్లడించారు. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో రూ.55 కోట్లతో ఏర్పాటుచేసిన పెట్ సిటీ స్కాన్, గామా కెమెరా, హై ఎనర్జీ అడ్వాన్స్ లీనియర్ యాక్సిలరేటర్ ఆధునిక వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్. నాయుడుగారు మీడియాతో మాట్లాడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. క్యాన్సర్ వైద్య చికిత్సల కోసం శ్రీ బాలాజి ఆరోగ్యవరప్రసాదిని పథకం నిధులతో ప్రారంభించిన. పెట్ సిటీ స్కాన్, గామా కెమెరా, హై ఎనర్జీ అడ్వాన్స్ డ్ లీనియర్ యాక్సిలరేటర్ వైద్య పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇందులో దాదాపు రూ.18కోట్ల విలువైన పెట్ సిటీ స్కాన్ పరికరం క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులను త్వరగా గుర్తించడంలో ఉపయోగపడుతుందన్నారు. రూ.5 కోట్ల విలువైన గామా కెమెరా అవయవాల పనితీరును, కణజాల స్థితిని చిత్రాల రూపంలో చూపిస్తుందని, క్యాన్సర్, ఇన్ఫెక్షన్లు, గుండె, మెదడు, థైరాయిడ్, ఎముకలు, మూత్రపిండాల పనితీరును అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా, రూ.29 కోట్ల విలువైన హై ఎనర్జీ అడ్వాన్స్ లీనియర్ యాక్సిలరేటర్ ద్వారా అధిక శక్తి గల ఎక్స్-రేలు లేదా ఎలక్ట్రాన్ కిరణాలను క్యాన్సర్ ట్యూమర్పై ఖచ్చితంగా ప్రసారం చేస్తుందని, దీని వల్ల చుట్టుపక్కల ఆరోగ్యకర కణజాలానికి హాని తక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ యంత్రం మెదడు, రొమ్ము, ప్రోస్టేట్, ఊపిరితిత్తులు వంటి భాగాల్లో క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడుతుందన్నారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రామారావు స్థాపించిన స్విమ్స్ విశ్వవిద్యాలయం అంచలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. 30 ఏళ్లుగా టిటిడి సహకారంతో రూ.450 కోట్లతో ఆసుపత్రిలో మెరుగైన వైద్యసౌకర్యాలు ఏర్పాటుజరిగిందని వివరించారు. ముఖ్యమంత్రివర్యుల ఆదేశాల మేరకు టిటిడి చైర్మన్ బిఆర్. నాయుడు. మార్గదర్శకత్వంలో ఇదివరకెన్నడూ లేనివిధంగా రూ.600 కోట్లతో పలు భవనాలు నిర్మించుకుంటున్నామని వెల్లడిచారు. ఆరు నెలల క్రితం దాతల సహకారంతో ఎంఆర్ ఐ, సిటి స్టిమ్యులేటర్ యంత్రాలు ప్రారంభించామని గుర్తు చేశారు. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో క్యాన్సర్ బ్లాకు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో భవిష్యత్తులో రోబోటిక్ సర్జరీలు, వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా సిమ్యులేటర్స్, వర్చువల్ డిసెక్షన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.105 కోట్ల విరాళాలతో స్విమ్స్ పలు వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వెల్లడించారు. బాలాజి ఆరోగ్యవరప్రసాదిని పథకానికి విరివిగా విరాళాలు అందించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తోడ్పాటునందిస్తున్న దాతలకు, కార్పొరేట్ సామాజిక బాధ్యతగా నిధులు అందిస్తున్న సంస్థలకు స్విమ్స్ కుటుంబం తరపున పాదాభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివరావు, పనబాక లక్ష్మి, జానకి దేవి. భానుప్రకాష్ రెడ్డి, తుడ ఛైర్మన్ మరియు టిటిడి బోర్డు సభ్యులు సి. దివాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే శ్రీ ఆరణి శ్రీనివాసులు, తిరుపతి మున్సిపల్ మాజీ డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికృష్ణ, ఇతర నాయకులు స్విమ్స్ అధికారులు , రేడియేషన్ అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మహిళల భద్రత.. అందరి బాధ్యత

### అవగాహన కార్యక్రమంలో పుత్తూరు డీఎస్పీ రవికుమార్

ప్రాజా భూమి ప్రతినిధి పిచ్చటూరు.

సమాజంలో మహిళలు, బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. పిచ్చాటూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సామాజిక సమస్యలపై గురువారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ముఖ్యంగా చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ (మంచి స్పర్శ, చెడు స్పర్శ) పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే పెద్దలకు చెప్పేలా పిల్లల్లో ధైర్యాన్ని నింపాలన్నారు. మహిళలు సైతం ఆపద సమయంలో పోలీసుల సహాయం తీసుకునేలా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. యువత పెడదోవ పట్టడానికి, నేరాలకు పాల్పడటానికి మత్తు పదార్థాలే ప్రధాన కారణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా గంజాయిని రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని




హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని డీఎస్పీ హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులు కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి పరిమితికి మించి ఉన్న ఆటోల్లో ప్రయాణించవద్దని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటి వల్ల బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని ఆయన స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణపై సమాజంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, స్థానిక పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ఒక నెల-ఒక గ్రామం

### ఎన్ ఆర్ అగ్రహారం ఒకనెల-ఒకగ్రామం కార్యక్రమంలో తహసిల్దార్ శివప్రసాద్

ప్రాజాభూమి ప్రతినిధి సత్యవేడు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం విన్నూతనంగా ఒక నెల-ఒక గ్రామం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తిరుపతి జిల్లా సత్యవేడు తహసిల్దార్ శివప్రసాద్ చెప్పారు. గురువారం మండల పరిధిలోని ఎన్ఆర్ అగ్రహారం గ్రామంలో అధికారుల బృందం ఒక నెల- ఒక గ్రామం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగకుండా ఒక నెల-ఒక గ్రామం కార్యక్రమంలో వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా భూములకు సంబంధించిన మ్యుటేషన్ ,రీసర్వే,హద్దులు,ప్రభుత్వ భూముల ఆక్రమణలు,22ఏ జాబితా,చుక్కల భూములు తదితర సమస్యలపై వినతులు సమర్పించుకోవచ్చునని ఆయన వివరించారు. దీనిపై వెంటనే స్థల పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నెలలో నాలుగు విడతలుగా ప్రతి గురువారం ఎంపిక చేసిన ఒకే గ్రామాన్ని సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. తదనంతరం సర్వే నెంబరు 66 లో ఒకే ఎకరా 44 సెంట్లు దేవాలయ భూములు సంబంధించి సర్వే చేసి హద్దులు చూపాలని పలు గ్రామస్తులు విన్నవించారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ శివప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే బృందం ద్వారా అప్పటికప్పుడే హద్దులు చూపడం జరిగింది. అలాగే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని పలువురు వినతులు సమర్పించారు. చెరువులో చెట్లు తొలగించి పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు,ఆర్ఐ నరేంద్ర రెడ్డి,సర్వేయర్ తంగరాజ్,వీఆర్వో విక్రాంత్, దేవాదాయ శాఖ అధికారి లత తదితరులు పాల్గొన్నారు.



## శానంబట్ల గ్రామంలో “ఒక నెల -- ఒక గ్రామం” కార్యక్రమం: ప్రజల నుండి విశేష స్పందన -తహసీల్దార్

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు పర్యటనలు” కార్యక్రమంలో భాగంగా, చంద్రగిరి మండల తహసీల్దార్ దుద్దేల అమరేశ్వరి రెవెన్యూ మరియు సర్వే అధికారులతో కలిసి గురువారం శానంబట్ల గ్రామంలో మొదటి విడత క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఉదయం 10:00 గంటలకు గ్రామ సచివాలయంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి భూ సమస్యలు మరియు ఇతర పరిపాలనాపరమైన అంశాలపై వినతులు వచ్చాయి. ప్రధానంగా అందిన వినతులు: ఈ పర్యటనలో తహసీల్దార్ అమరేశ్వరి స్వయంగా గ్రామస్థులతో మాట్లాడి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ప్రధానంగా ఈ క్రింది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు .“అందరికీ ఇళ్లు” పథకం కింద కొత్త గృహ స్థలాల కేటాయింపు మరియు ఇప్పటికే ఉన్న లేఅవుట్‌లలో ఖాళీ ప్లాట్ల ధృవీకరణ కోసం వినతులు. ఆక్రమణల తొలగింపు: కాలువ పోరంబోకు (నీటి వనరులు) మరియు ఇతర ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న అక్రమ ఆక్రమణలను తొలగించాలని ఫిర్యాదులు. రెవెన్యూ వివాదాలు: వారసత్వ ధృవీకరణ పత్రాలు మరియు వారసత్వపు ఆస్తుల




వివాదాలకు సంబంధించిన దరఖాస్తులు. భూ రికార్డులు -మ్యుటేషన్లు: భూముల మ్యుటేషన్లు (మార్పిడి) త్వరితగతిన పూర్తి చేయాలని మరియు ఆర్ఓఆర్ రికార్డులలో తప్పుల సవరణ కోసం అభ్యర్థనలు. అసైన్‌మెంట్ భూములు: అర్హులైన భూమి లేని పేదలకు ప్రభుత్వ భూములను కేటాయించాలని (అసైన్‌మెంట్) కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అమరేశ్వరి మాట్లాడుతూ పాలనను ప్రజల వద్దకు చేర్చడమే మా లక్ష్యం. గురువారం అందిన సమస్యలలో సాధారణ కేసులను అక్కడికక్కడే పరిష్కరించాము. స్వీకరించిన ప్రతి అర్జీని ప్రజా పరిష్కార వేదిక పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాము. దీని ద్వారా నిర్ణీత గడువులోగా సమస్యల పరిష్కారాన్ని పర్యవేక్షించవచ్చు. శానంబట్ల గ్రామంలో ఈ నెలలో జరగబోయే నాలుగు పర్యటనలలో ఇది మొదటిది మాత్రమేనని, ఈరోజు అందిన ప్రతి దరఖాస్తును తదుపరి పర్యటనల్లో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



## మామ పై దాడి కేసులో అల్లుడికి జైలు శిక్ష

ప్రజాభూమి,పులివెందుల

మల్లికార్జున రెడ్డి పై అతని అల్లుడు ఈశ్వర్ రెడ్డి కొడవలితో దాడి చేసిన కేసులో ఈశ్వర్ రెడ్డి కి రెండు సంవత్సరాలు జైలు శిక్ష,రెండువేల రూపాయల జరిమానా విధిస్తూ పులివెందుల మేజిస్ట్రేట్ చంద్ర శేఖర్ రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం ఎర్ర వంకపల్లి గ్రామంకు చెందిన ఎర్రగుళ్ల ఈశ్వర్ రెడ్డి పులివెందుల మండలం ఈ కొత్తపల్లి గ్రామం లో నివాసముండేవాడు అయితే తన మామ చంటిమీరెడ్డి మల్లికార్జున రెడ్డి ఇరువురి మధ్య భూమికి సంబందించి తగాదాలు ఉండేవి. ఈ ఘర్షణలో ఎర్రగుళ్ల ఈశ్వర్ రెడ్డి భాదితుడైన చంటిమీరెడ్డి మల్లికార్జున రెడ్డిని కొడవలితో దాడి చేయగా తీవ్ర రక్త గాయాలయ్యాయి. ఈ ఘర్షణకు సంబంధించి అప్పట్లో ఏఎస్ఐ బాల అంకయ్య కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ఈశ్వర్ రెడ్డి పై నేరశ రుజువు కావడంతో పులివెందుల మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ రెడ్డి రెండు సంవత్సరాలు జైలు శిక్ష రెండువేల జరిమానాలను విధించారు. ఈ కేసుకు సంబంధించి ఏపీపీ మధుసూదనాచారి, కోర్టుకానిస్టేబుల్ శ్రీధర్‌లు సకాలంలో సాక్షాలను కోర్టుముందు ఉంచి ముద్దాయికి శిక్ష పడేలా చేశారు.



## శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు శ్రీ కాళహస్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి




శ్రీ కాళహస్తి ప్రెస్ క్లబ్ మరియు యం జి యం హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా రేపు అనగా శుక్రవారం ఉదయం 09:00 గంటలకు శ్రీ కాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రముఖ వైద్యుల సమక్షంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యడం జరుగుతుంది. కావున నియోజకవర్గ ప్రజలు అందురు విచ్చేసి మెగా వైద్య శిబిరం కార్యక్రమం విజయవంతం చెయ్యగలరు.

## ప్రతి గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడవే మన లక్ష్యం: ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. ఈరోజు ఏర్పేడు మండలం పాపా నాయుడు పేట నుంచి మర్రిమంద వరకు 90 లక్షల అంచనా వ్యయంతో, 700 మీటర్ల పొడవున నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పేడు మండల అధ్యక్షులు పేరం నాగరాజునాయుడు భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో ఈ పనులను త్వరితగతిని పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి ధనంజయులు నాయుడు,మడిబాక గ్రామపంచాయతీ రాయపనేని రవి నాయుడు, ప్రతాపనేని మోహన్ నాయుడు, కందాడు మాజీ ఎంపీటీసీ మునెయ్య మరియు టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్లో 10% నాన్ టీచింగ్ స్టాఫ్‌కి కేటాయించాలి : కందాటి విశ్వేశ్వర్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి



నాన్ టీచింగ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున ఇంటర్మీడియట్ కమిషనర్, ఆర్జెడి కడప వారి కి రికార్డ్ అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్స్ ఇచ్చినందుకు నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కందటి విశ్వేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటెండెడ్ టు రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్స్ కూడా త్వరగా పూర్తి చేయాలని, జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్స్ లో 10 శాతం కోట నాన్ టీచింగ్ స్టాఫ్ కేటాయించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించిన గ్రంధాలయ ఛైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి



ప్రాజా భూమి ప్రతినిధి తిరుపతి.

స్థానిక అన్నమయ్య కూడలిలోని గ్రంధాలయం శాఖ తిరుపతిలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి. ఆకస్మికంగా తనిఖీ చేశారు అందులో భాగంగా వేసవి శిక్షణ శిబిరానికి వచ్చిన పిల్లలతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లలను వేసవి శిక్షణ శిబిరంలో ఏమి నేర్చుకున్నారని అవి వారికి ఎలా ఉపయోగపడుతున్నాయని తెలుసుకున్నారు. తరువాత వేసవి శిక్షణ శిబిరాలు జూన్ 6 వరకు నిర్వహించబడతాయని ఈ వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలలో సృజనాత్మక ని వెలికి తీసే విధంగా స్పోకెన్ ఇంగ్లీష్ ఇంగ్లీష్ గ్రామర్ తెలుగు పద్యాలు తెలుగు గ్రామర్ యోగ కంప్యూటర్ పరిజ్ఞానం మెమరీ టెక్నిక్స్ స్పీడ్ మాథ్స్ మొదలగు అనేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జె. శివ ప్రసాద్, డాక్టర్ పి గోపాల్ ఇంగ్లీష్ ట్రైనర్, సోము ఉమాపతి ప్రముఖ గేయ రచయిత పాల్గొన్నారు.

## విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి



ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం శ్రీకాళహస్తి నందు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువా రెడ్డి ఆదేశాల మేరకు జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా జరుపుకోవడమైనది ఈ సందర్భమును పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన వకృత్వము చిత్రలేఖనము పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ బహుమతిగా డిక్షనరీ ద్వితీయ బహుమతిగా మ్యాథ్స్ ఫార్ములాస్ తృతీయ బహుమతిగా



ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకములను బహుకరించడమైనది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎ.హరి క్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు బోధిస్తూ విరాళంగా ప్రోత్సాహక బహుమతులు కూడా అందించిన ఎస్ ఎస్ ఆర్ అకాడమీ మంజునాథ్ కి కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు అదే విధంగా గ్రంథాలయమునుకు ప్రతిరోజు వచ్చే పాఠకులు శ్రీ శివకుమార్ విద్యార్థులకు అవసరమైన డ్రాయింగ్ సామాగ్రి విరాళముగా ఇచ్చినందుకు వారికి అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు కూడా గ్రంథాలయమూలో జరుగు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనే విధంగా పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బోధకులు మంజునాథ్ యుగంధర్ ముని సుబ్బారెడ్డి రేవతి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దళిత జ్యోతి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

### -కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య

ప్రజాభూమి, కడప సిటీ:

గురువారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయ జ్యోతి ఆదేశాల మేరకుస్వర్గీయదామోదరం సంజీవయ్య వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేట ర్ బండి జకరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట కార్యాలయంలో ఆ యన చిత్రపటానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి జకరయ్య విలేకరులతో మాట్లాడు తూ దామోదరం సంజీవయ్య భారతదేశంలోనే తొలి దళిత ముఖ్యమం త్రిగా చరిత్ర సృష్టిం చారని తెలిపారు.అఖిల భార త కాంగ్రెస్ కమిటీ ఏఐసిసి అ ధ్యక్ష పదవిని చేపట్టిన తొలి దళిత నేతగా ఆయన విశిష్ట గుర్తింపు పొందారని కొనియా డారు.1921 ఫిబ్రవరి14న క ర్నూలు జిల్లా కల్లూరు మండ లం పెద్దపాడు గ్రామంలో జ న్మించిన దామోదరం సంజీవ య్య,సాధారణ కుటుంబం నుంచి ఎదిగిదేశరాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించారని తెలిపారు. 1960 జనవరి 11 నుండి1962 మార్చి12 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించిన ఆయన, పరి పాలనలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ అవినీతి నిరోధక శాఖ ఎ.సి.బి.ఏర్పాటుకు శ్రీకా రం చుట్టారని గుర్తు చేశారు. కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మం త్రిగా సేవలందించిన ఆయన కార్మికుల సంక్షేమం కోసం అనే క సంస్కరణలు చేపట్టారని పే ర్కొన్నారు.పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆ యన చేసిన కృషి నేటి తరాల కు ఆదర్శమనిఅన్నారు. 1972 మే7న ఆయన మరణించి నప్పటికీ, సామాజిక న్యాయం కోస శీచేసిన సేవలు ప్రజల హృదయా ల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయని కాంగ్రెస్ నాయకు లు ఆయన చిత్రపటానికి నివ ళులర్పించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న వారు ఎ.ఐ.సి.సి కోఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ ఖాజా మైనుద్దీన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కమల్ భాష, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సమాచార హక్కు అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు,మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫిక్ మొహిద్దిన్ ఖాన్, దాసరి శ్రీనివాసులు, అఖిల్, షేక్ చాన్ బాషా, ప్రభు కుమార్, గౌరీ దేవి, సయ్యద్ షబానా, పాలెం హరిప్రసాద్ పాల్గొన్నారు.



## పోలి సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు..

ప్రజా భూమి ప్రతినిధి:
శ్రీ కాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి రూరల్ మండలం పోలి సచివాలయంలో గురువారం మండల అభివృద్ధి అధికారులు సచివాలయం సిబ్బంది ప్రగతి స్వచ్ఛంద సంస్థ గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా పోలి సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు ముఖ్యంగా విద్యార్థులు చిన్న పిల్లలు మహిళలు రైతులకు ఆధార్ కార్డులు కోసం ప్రభుత్వ పథకాలకు ఇబ్బందులు పడుతు న్నారని తెలిసి అధికారులు ప్రత్యేకంగా వారి కొరకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి ఆధార్ నమోదు ఏర్పాటు చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు ఎండ సైతం లెక్కచేయకుండా చిన్న పిల్లలు చంటి బిడ్డలతో సహా తల్లులు విద్యార్థులు మహిళలు వచ్చి సచివాల యంలో ఆధార్ కేంద్రం వద్ద ఆధార్ కార్డు నమోదు చేసుకున్నారు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రంలో చిరునామా మార్పులు కొత్తగా పెళ్లయిన వారికి ఆధార్ నమోదు కేంద్రాలు వద్ద తమ పేర్లు నమోదు చేసుకుని పేరు మార్పులు చేర్పులు చిరునామా మార్పులు ఇంటి పేర్లు నమోదు చేసుకునేటప్పుడు వారి వివరాలు అందించి ఆధార్ కార్డులు నమోదు చేసుకున్నారు పాఠశాలలో ప్రవేశం కొరకు ఇతర ప్రభుత్వ పథకాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని గ్రామీణ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ గిరిబాబు వీఆర్వో లోకేష్ పంచాయతీ కార్యదర్శి లీలా కుమార్ ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి బషీర్ సంతోష్ సచివాలయ సిబ్బంది అనూష ధనుంజయులు రాజేశ్వరి పోలి పోలి గిరిజన కాలనీ ఈశ్వరయ్య గిరిజన కాలనీ వాంపల్లి గోవిందరావుపల్లి తదితర గ్రామాల నుండి చిన్న పిల్లలు మహిళలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ పేర్లను ఆధార్ కేంద్రం వద్ద నమోదు చేసుకున్నారు



## రెవెన్యూ సమస్యలకు పరిష్కారం ఎప్పుడూ?

### ప్రత్యేక కార్యక్రమాలు కేవలం మొక్కుబడిగానే మిగులుతున్నాయా?



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎదురవుతున్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చాలనే ఉద్దేశంతో పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమే అయినా, ఆ ఆశయాలకు తగ్గట్టుగా అధికారులు పని చేయడం లేదన్న భావన ప్రజల్లో బలపడుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తరచూ పత్రికా ప్రకటనలు విడుదల చేస్తూ మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు తూతూమంత్రంగానే కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రజలు వినతుల రూపంలో సమర్పిస్తున్న రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ముఖ్యంగా సంబంధిత వీఆర్వోలు ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలు పరిష్కారమయ్యాయా లేదా అన్న అంశంపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, కొన్ని సందర్భాల్లో తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఉన్నతాధికారులకు పంపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.దీంతో ఇప్పటికే పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలు మరింత పెరిగిపోతుండగా, ప్రజలు ఇప్పటికీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.కేవలం మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఉపయోగం లేదని, సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా శబరిమల అయ్యప్ప సేవా సమాజం కమిటీ నియామకం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

తిరుపతి జిల్లా శబరిమల అయ్యప్ప సేవా సమాజం నూతన కమిటీ ని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో చంద్రగిరి గ్రామంలో జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి దక్షిణ ఆంధ్ర రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చెప్పా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల వెంకయ్య, సహాయ కార్యదర్శి ఎ .మస్తాన్ రెడ్డి, అప్పన్న కుమార రాజా, వెంకటరమణ, హేమచంద్ర ,కోశాధికారి వై శరణ్ కుమార్ పాల్గొన్నారు. తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులు గా చేగు ముని లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు గా పడి నవీన్, వి. వినోద్,కె.గంగాధరం,ఎస్.మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గా సి.మునిశేఖర్ , సహాయ కార్యదర్శులుగా కట్టమంచి సతీష్ కుమార్, బాదురు రాజకుమార్, టి. పురుషోత్తం, కోశాధికారిగా కె. యువరాజ్ ను ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.నాగయ్యగారిపల్లెలో వృద్ధాశ్రమంలో ఉదయం వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అనేక గ్రామాల నుంచి భక్తులు సమావేశానికి హాజరయ్యారు.

## మహిళా భద్రతపై పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం

### సైబర్ నేరాల నివారణపై కీలక సూచనలు



ప్రజాభూమి ప్రతినిధి పిచా

తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా భద్రత మరియు సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన సమావేశం పిచ్చాటూరు మండలంలో నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సమావేశానికి పుత్తూరు డీఎస్పీ అధ్యక్షత వహించి మహిళల భద్రతకు సంబంధించిన పలు ముఖ్యాంశాలపై వివరించారు. సమాజంలో మహిళలు భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, తమపై ఎటువంటి వేధింపులు లేదా అనుమానాస్పద సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని , అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా పరిచయాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు.వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి గోప్యమైన వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణపై పలు అంశాలపై చర్చించారు.మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

## శృంగారంలో అపశృతి.. విలేకరి నాలుక కొరికిన మహిళ

### కడప: ఒంటిమిట్ట హరిత హోటల్‌లో షాకింగ్ ఘటన!



ప్రజా భూమి ప్రతినిధి కడప

కర్బూజ వ్యాపారం చేసే ఓ పత్రికా విలేకరి రవిబాబు, ఆటో డ్రైవర్ హరికి ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. వీరు ముగ్గురు కలిసి ఒంటిమిట్టలోని హరిత హోటల్‌కు వెళ్లారు. తొలుత సిబ్బంది అడ్డుకు న్నా, విలేకరి తన పరపతిని ఉపయోగించి లోపలికి వెళ్లారు. గదిలోకి వెళ్ళిన తర్వాత ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. ఆపై జరిగిన శృంగార కార్యక్రమం నేపథ్యంలో సదరు మహిళ విలేకరి రవిబాబు నాలుకను బలంగా కొరికివేసింది. ఆ ప్రదేశమంతా రక్తమయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో భయపడ్డ రవిబాబు వెంటనే స్థానిక ౹ాసజకి వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు అతడిని 108లో కడప రిమ్స్ కు తరలించారు. ఈ లోపు ఆటో డ్రైవర్ సదరు మహిళను రైల్వే స్టేషన్ దగ్గర వదిలేశాడు. ప్రస్తుతం ఆ మహిళ కనిపించకుండా పోయింది. ఆమె అఘాయిత్యం నుంచి తప్పించుకోవడానికి కొరికిందా లేక మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఆటో డ్రైవర్‌ను విచారిస్తున్నారు. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న హరిత హోటల్ మేనేజర్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు.

## గుడిమల్లం ఆలయానికి నూతన ఈవో గా బాధ్యతలు చేపట్టిన మునిశేఖర్

ప్రజాభూమి ప్రతినిధి ఏర్పేడు.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలో వెలిసిన శ్రీ ఆనందవల్లి సమేత పరుశు రామేశ్వర స్వామి దేవాలయం నందు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యనిర్వాహణాధికారి మనిశేఖర్. ఈ సందర్భంగా గుడిమల్లం ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు తో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



## కమతం కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని నగిరిగుట్ట కు చెందిన వైకాపా నాయకుడు కమతం కృష్ణయ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన విషయాన్ని వైకాపా నాయకులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి లు గురువారం వారి నివాసానికి చేరుకొని కమతం కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం కృష్ణయ్య మరణానికి గల కారణాలను ఆయన సతీమణి భవానిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణలో తమిళనాడు గవర్నర్ నిష్పాక్షికంగా వ్యవహరించాలి

### - డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి

ప్రజా భూమి, కడప సిటీ :




తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్లేకర్ భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం వ్యవహరించాలని, ఢిల్లీ పెద్దల ఆదేశాల మేరకు కాకుండా రాజ్యాంగబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో టి.వి.కె. పార్టీ 108 స్థానాలు, డిఎంకె- 59, అన్నా డీఎంకే 47, కాంగ్రెస్- 5, పి.ఎం.కె.- 4, ఐ.యు.ఎం.ఎల్- 2, సి.పి.ఐ -2, సి.పి.ఎం.- 2, వి.సి.కె- 2, బీ.జే.పీ.- 1, డి.ఎం.డి.కె.- 1, ఎ.ఎం.ఎం.కె.ఎం.ఎస్.కె.జెడ్. -1 స్థానాలు సాధించిన నేపథ్యంలో, ప్రభుత్వ ఏర్పాటు విషయంలో రాజ్యాంగబద్ధమైన సంప్రదాయాలను పాటించాల్సిన బాధ్యత గవర్నర్పై ఉందని ఆమె తెలిపారు. అత్యధిక స్థానాలు సాధించిన పార్టీ లేదా కూటమికి ప్రభుత్వ ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వడం భారత ప్రజాస్వామ్య సంప్రదాయమని పేర్కొన్నారు. గతంలో కర్ణాటక,మహారాష్ట్ర, గోవా,ఝార్ఖండ్వంటిరాష్ట్రాల్లో ప్రభుత్వఏర్పాటుపైసుప్రీంకోర్టు జోక్యం చేసుకొనిరాజ్యాంగ విలువలను కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలతీర్పునుగౌరవించడంప్రజాస్వామ్యానికి మూల సూత్రమని ఆమె అన్నారు.సర్కారియాకమిషన్ కూడాగవర్నర్పదవిరాజకీయాలకు అతీతంగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా కాకుండారాజ్యాంగపరిరక్షకుడిగా వ్యవహరించాలని స్పష్టం చేసిందని విజయజ్యోతి పేర్కొన్నారు. ప్రజలఅభీష్టం మేరకు స్పష్టమైన మెజారిటీ సాధించిన పక్షాలకు అవకాశం ఇవ్వకుండా ఆలస్యం చేయడం లేదా రాజకీయ ఒత్తిడులకు లోనవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. తమిళనాడులో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, రాజ్యాంగబద్ధమైన విధానంలో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె గవర్నర్ను కోరారు.



## శ్రీ గురుదక్షిణామూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ వాయు లింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గల శ్రీ గురు దక్షిణామూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హారతులు, ధూప దీప నైవేద్యములను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. సదరు కార్యక్రమంలో భక్తులు, పుర ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం పనితీరుతో ప్రజలు విసిగిపోతున్నారు

- 20నెలల్లో రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ
- ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయమే వైకాపా లక్ష్యం
- ప్రజా దర్బార్ లో ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల

అభివృద్ధి సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనితీరుతో ప్రజలు విసిగిపోయారని, 20 నెలల్లో రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదని, రైతులను దగా చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యం అని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం జగన్ క్యాంపు కార్యాలయంలోప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే అని చేతల ప్రభుత్వం కాదని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు . రైతుల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ప్రభుత్వం కల్పించలేదని ఆయన అన్నారు. ఎన్ని కలకు ముందు నిరుద్యోగు లకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడం ఏమిటి అన్నారు. నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి పెండింగ్లో ఉన్న పనులు ఇంతవరకు పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. అంతకు ముందుగా పులివెందులనియోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయననుకలిసి వినతిపత్రాలను అందజేశారు. మరికొంతమంది సమస్యలను ఆయనకు నేరుగా వివరించారు. ఆయన వారి సమస్యలను సావాదానంగా విని వారి సమస్యలను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరికొంతమంది సమస్యలనుఅధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.



# ప్రజాభూమి



# అనంతపురం జిల్లా ప్రజలకు శుభవార్త ప్యాసింజర్ రైలు ప్రారంభం



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

గుంతకల్లు - మార్కాపూర్ రోడ్ మధ్య నూతన పాసింజర్ రైలు ప్రారంభం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృషికి ఫలితం గుంతకల్లు, మార్కాపూర్ రైలు మంజూరు మే 12వ తేదీన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా రైలు ప్రారంభోత్సవం ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన కేంద్ర రైల్వే శాఖ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తూ, కేంద్ర రైల్వే శాఖ గుంతకల్లు మార్కాపూర్ రోడ్ స్టేషన్ల మధ్య నూతన రోజువారీ పాసింజర్ రైలు (నెం. 57407/57408) మంజూ రు చేసింది. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నిరంతర కృషి ఫలితంగా నేడు ఈ రైలు మంజూరైనది. ఈ సందర్భంగా ఆయన కేంద్ర రైల్వే శాఖకు ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ నూతన రైలు సేవలను మే 12న ఈ రైలును గుంతకల్లు రైల్వే స్టేషన్ లో ఈ రైలు సేవలను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ ప్రత్యేక రైలు నంద్యాల మీదుగా ప్రయాణించి రాత్రి 19:30 గంటలకు మార్కాపూర్ రోడ్ చేరుకుంటుంది. మే 13 నుండి మార్కాపూర్ రోడ్ నుండి, మే 14 నుండి గుంతకల్లు నుండి ఈ రైలు రెగ్యులర్ సర్వీసులు ప్రతిరోజూ అందుబాటులోకి రానున్నాయి. రైలు నెం. 57407 (గుంతకల్లు - మార్కాపూర్ రోడ్): ప్రతిరోజూ సాయంత్రం 17:30 గంటలకు గుంతకల్లులో బయలుదేరి, రాత్రి 23:30 గంటలకు మార్కాపూర్ రోడ్ చేరుకుంటుంది.రైలు నెం. 57408 (మార్కాపూర్ రోడ్ - గుంతకల్లు): ప్రతిరోజూ తెల్లవారుజామున 04:30 గంటలకు మార్కాపూర్ రోడ్‌లో బయలుదేరి, ఉదయం 10:30 గంటలకు గుంతకల్లు చేరుకుంటుంది. ఈ రైలు మద్దికెర, పెండేకల్లు జంక్షన్, డోన్, రంగాపురం, బేతంచెర్ల, పాణ్యం, నంద్యాల, గాజులపల్లి, దిగువమెట్ట, గిద్దలూరు, సోమిదేవిపల్లి, జగ్గంభొట్ల కృష్ణాపురం, కంబం, తర్లుపాడు స్టేషన్లలో ఆగుతుంది. మన ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం, ముఖ్యంగా నంద్యాల మార్కాపూర్ వెళ్లే సామాన్య ప్రజల కోసం ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైల్వే అధికారులతో కేంద్ర మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ సర్వీసును సాధించుకోవడం సంతోషంగా ఉంది. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాం" అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైలు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, కేంద్ర రైల్వే మంత్రిఅశ్విని వైష్ణవ్ కి, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రయాణికులందరూ ఈ నూతన రైలు సేవలను వినియోగించుకోవాలని కోరడమైనది.

# మన్యం వీరుడు అల్లూరి ఆశయాలు భావితరాలకు దిక్సూచి

- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదా యకం, దిక్సూచి అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సంద ర్భంగా కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాని కి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహ నీయుడు అల్లూరి సీతారామరాజు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచిం చారు. మన్యం ప్రాంత ప్రజల్లో చైతన్యం నింపి, స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేలా బ్రిటిష్ పాలకులపై ఆయన చేసిన పోరాటం, త్యాగం చిర స్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తిని తరతరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# వెలగని వీధి దీపాలు రాత్రి వేళలో పాములు

## -విషపురుగులు సంచారం... ఆందోళనలో ఎగువ గూలూరు దళితులు

ప్రజాభూమి ప్రతినిధి పుత్తూరు

పుత్తూరు మండలం తడుకు పంచాయతీ ఎగువగూలూరు దళితవాడలో వీధిలైట్లు వెలగడం లేదు.ఈ విషయమై 7-5-2026 వ తేదీన పుత్తూరు రూరల్ ఎంపీడీవో ఆఫీస్ నందు గ్రామస్తులు అర్జీ ఇవ్వడం అయినది. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ,ఎగవగూలూరు దళితవాడలో తొమ్మిది వీధులు గలవు. గత మూడు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. గ్రామంలో విషపురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళలో వృద్ధులు,గర్భవతులు,వికలాంగులు,విద్యార్థులు తిరగాలంటే భయపడుతున్నారు. రాత్రి నందు కంపెనీ నుండి వచ్చే యువతి,యువకులు చాలా ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు., రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తున్నామని చెబుతున్న స్పందన కరువైనది అని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన పుత్తూరు రూరల్ ఈ వో పి ఆర్ డి బి. దేవిక తక్షణమే పరిశీలించి ఎగువగులూరు దళితవాడలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం అయినది.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఏ.రామమూర్తి,వి.నాగార్జున, పి.మునస్వామి, టి.బాబు తదితరులు పాల్గొన్నారు.



# నేను కాదు.. మనం అనే భావనతోనే అభివృద్ధి సాధ్యం : సీఎం నారా చంద్రబాబు నాయుడు







**అమరావతిలో ఘనంగా 7వ కలెక్టర్ల సమావేశం**

**సింగపూర్ తరహా పాలన.. 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక**

**2027 మార్చి నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పూర్తి కావాలి**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

రాష్ట్ర అభివృద్ధి టీమ్ వర్క్‌తోనే సాధ్యమని, అందరిలోనూ నేనుఅనే భావన పోయి మనం అనే ఆలోచనా విధానం రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గురువారం సచివాలయంలోని 5వ బ్లాక్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు, కార్యద ర్శులు మరియు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన 7వ కలెక్టర్ల సమావేశంలో ఆయన సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు.సమావేశంలోని కీలక అంశాలుసింగపూర్ మోడల్ పాలన సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న అత్యుత్తమ పాలనా విధానాలను అధ్యయనం చేసి, రాష్ట్రంలో ఒక జిల్లాను మోడల్ గా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. దీనికోసం 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.మూడు సూత్రాల మంత్రం సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి.. ఈ మూడింటిపైనే ప్రధానంగా దృష్టి సారించాలి. అభివృద్ధి ఉంటేనే సంపద పెరుగుతుందని, సంపద ఉంటేనే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని స్పష్టం చేశారు.

బీచ్ ఫ్రంట్‌ల అభివృద్ధి: మంగినపూడి, సూర్యలంక, విశాఖ, మైపాడు వంటి తీర ప్రాంతాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచాల న్నారు.

రెవెన్యూ ప్రక్షాళన: భూ రికార్డుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మార్చి 2027 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పూర్తి కావాలని కలెక్టర్లను ఆదేశించారు.

టెక్నాలజీ వినియోగం: గతంతో పోలిస్తే ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులో ఉందని, విజన్ యూనిట్లను సమర్థవంతంగా వాడుకుంటూ కలెక్టర్లు మెరుగైన పనితీరు కనబరచాలని సూచించారు.మార్పు నా నుండే మొదలవ్వాలి.. అందుకే 'నేను కాదు మనం అనే విధానాన్ని నాతోనే ప్రారంభిస్తున్నాను. ప్రతి అధికారి ఇదే తరహాలో బాధ్యతగా పనిచేయాలి అని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అన్నారు.

జిల్లా అధికారుల భాగస్వామ్యం:ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుండి డిఆర్ఓ చంద్రశేఖర రావు, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, డ్వామా పిడి శివప్రసాద్, మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు (వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖలు) పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**
- **రోడ్డు భద్రత, శక్తి యాప్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన**
- **సీఐ టి.నరసింహులు**

ప్రజాభూమి, వేంపల్లె

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ టి.నరసింహులు సూచించారు. గురువారం మండలంలోని ముతుకూరు గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి రోడ్డు భద్రత, శక్తి యాప్, జూదం నివారణ, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన తదితర అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ టి.నరసింహులు మాట్లాడుతూ నేటి సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రకటనలు, అనుమానాస్పద లింకులు నమ్మి మోసపోవద్దని ప్రజలను హెచ్చరించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ అత్యవ సర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, మంచి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. జూదం, జూద కార్యకలాపాలు వంటి అలవా ట్లు కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీస్తాయని తెలిపారు. రోడ్డు ప్రమాదా ల ను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హె ల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రా మ ప్రజలు పోలీసు శాఖకు సహకరించి నేర రహిత సమాజ నిర్మాణానికి ముందుకు రావాలని సీఐ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై. తాహీర్ హుస్సేన్, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# భారీ కంపెనీలకు అనుబంధ పరిశ్రమలుగా ఎంఎస్ఎంఈలు..7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం

పారిశ్రామికాభివృద్ధి ఎకో సిస్టంలో ఎంఎస్ఈలు కీలకం

వైద్య ఖర్చులు తగ్గాలి... విద్యుత్ భారం తగ్గాలి...అసంఘటిత కార్మికులకూ నైపుణ్య శిక్షణబెస్ట్ పాలసీలకు మెంటార్లుగా జిల్లా కలెక్టర్లు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:-

రాష్ట్రంలో ఏర్పడే భారీ పరిశ్రమలకు అనుబంధ రంగాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలకు అవకాశం ఉందని... వీటికి ఎంఎస్ఎంఈ రంగంలో ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వస్తున్న సందర్భంలో ఏర్పడే ఎకో సిస్టంలో ఎంఎస్ఎం ఈలు కీలక పాత్ర పోషించేలా చూడాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు రాష్ట్ర సచివాలయంలో జరిగే 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా తొలి రోజైన గురువారం నాడు వివిధ శాఖల పనితీరు మీద.. క్షేత్ర స్థాయిలో అమలు విధానంపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. దీంట్లో భాగంగా విద్య, వైద్యం, పెట్టుబడుల గ్రౌండింగ్ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన సంస్థలకు భూ కేటాయింపులు వంటి విషయాల్లో ఏమైనా ఇబ్బందులుంటే వాటిని వెంటనే పరిష్కరించాలి. 22ఏ పరిధిలో ఉన్న ఏపీఐఐసీ భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించాలి. రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీల ద్వారా నిషేధిత భూములను క్లియర్ చేయాలి. జిల్లాల్లోని వివిధ ఉత్పత్తులు పాన్ ఇండియా, గ్లోబల్ బ్రాండ్స్ కావాలి. అరకు కాఫీ లాంటి బ్రాండింగ్ ఏపీ ఉత్పత్తులకు రావాలి. మనం రోజూ వారీగా వినియోగించే చాలా ఉత్పత్తుల కొనుగోలు ద్వారా విదేశాలకు డబ్బులు చెల్లిస్తున్నాం. ఏపీ ఉత్పత్తులకు క్వాలిటీ, బ్రాండింగ్ వంటివి వస్తే ఆ ఆదాయం మనకే వస్తుంది. పారిశ్రామిక పార్కులు, ఉత్పత్తి యూనిట్ల వద్ద ఎంఎస్ఎంఈ ఎకోసిస్టమ్ అభివృద్ధి కావాలి. భారీ పరిశ్రమలకు అనుబంధ పరిశ్రమలుగా ఎంఎస్ఎంఈలు అభివృద్ధి కావాలి. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏపీకి రావడంతో క్యారియర్ ఏసీ సంస్థ రాష్ట్రానికి వచ్చిం ది. డేటా సెంటర్లకు, క్వాంటం కంప్యూటింగ్ వంటి వ్యవస్థలకు బల్క్ చిల్లర్స్ ను ఏపీకి వచ్చిన ఏసీ సం స్థలే సరఫరా చేస్తాయి. అమరావతిలో క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ ఏర్పాటు అయ్యింది. క్వాం టం కంప్యూటింగ్ సెంటర్ పని చేయటం ప్రారంభిస్తే వాటికి కావాల్సిన పరికరాల ఉత్పత్తి కూడా చేసేలా ఎకోసిస్టమ్ వస్తుంది. ఈ విధంగా అభివృద్ధి చెందే ఎకో సిస్టంలో ఎంఎస్ఎంఈలు కీలకంగా ఉండాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించేలా ప్రణాళికలు"రాష్ట్రంలో 15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నాం. కార్మికులు పని కోసం రోడ్ల మీద వేచి ఉండకుండా... లేబర్ అడ్డాల్లో కూర్చొంటారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇస్తాం. ఇక ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వారిలో ఆరోగ్య అవగాహన కల్పించాలి. ప్రివెంటివ్ హెల్త్ సక్సెస్ అయి తే ప్రజలకు వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. జిల్లాల వారీగా హెల్త్ స్కోర్ లు తయారు చేయాలి. సోలార్ రూఫ్ టాప్, కుసుమ్ స్కీంలను ఇంటిగ్రేట్ చేసి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, పాఠశాలలు, కళాశాలలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి. రానున్న కాలంలో విద్యుత్ నిమిత్తం ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం రానంతగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోలార్ పవర్ ఉత్పత్తి జరగాలి. 22 లక్షల పంపు సెట్లకు పీఎం కుసుమ్ ద్వారా సోలార్ పవర్ పెట్టుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. బెస్ట్ ప్రాక్టీసెస్ కు మెంటార్లుగా జిల్లాల కలెక్టర్లను నియమిస్తాం. స్కూళ్లల్లో స్మార్ట్ కిచెన్ మెంటార్ గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఉంటారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించాలి... అప్పుడు మరింతగా అభివృద్ధి సాధించగలం. రైలు మార్గం ద్వారా ప్రతీ కిలోమీటరుకు రూ. 1.83 వ్యయం అవుతోంది. రహదారి మార్గంలో జరిగే రవాణాపై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోంది. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుంది. పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలి. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారి ప్రాజెక్టులు వస్తున్నాయి. రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు.. రూ. 2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయి. ఎక్స్ ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి. 4 లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగబోతోంది. ఆర్వోబీలు స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తాం." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ప్రమాదం అంచున.. పడవ ప్రయాణం!

**సరైన భద్రతా ప్రమాణాలు లేని నాటు పడవలు ప్రజలకు ఇది నిత్య పోరాటం**






**.మరపడవల్లో ప్రయాణికులు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రేవు దాటాల్సిందే**

ప్రజాభూమి నందిగామ :

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం ముత్యాల మరియు వేదాద్రి గ్రామాల్లో నది ఒడ్డున ఉంటున్న గ్రామ ప్రజలుకు కృష్ణానది రేవు దాటాలంటే పడవలే దిక్కు..ఇప్పటికీ అనేక గ్రామాలకు రహదారులు లేవు. విద్య, వైద్యం, నిత్యావసరాలు.. ఇలా అవసరం ఏదైనా వారు నదుల నో, నదీ పాయలనో, కాలువలనో నిత్యం దాటి వెళ్లి రావాల్సిందే. ఇందుకు నాటు పడవలే దిక్కు. వాటిలో కనీసం లైఫ్ జాకెట్ల వంటి రక్షణ ఏర్పాట్లు కూడా ఉండవు. పైగా పడవ సామర్థ్యానికి రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తుంటారు. మార్గం మధ్యలో ఏదైనా జరగరానిది జరిగితే అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోవా ల్సిందే.అలాంటి సీనే ఇప్పుడు మనం చూడబోతున్నాం.ముత్యాల గ్రామ పడవ యజమాని సేఫ్టీ జాకెట్ ని వీడియో తీస్తుండగా విసిరివేసి దృశ్యాలు చూడొచ్చు.భద్రతా ప్రమాణాలు మేము పాటించాం వీడియో, ఫోటో తీసుకొని ఎవరికైనా పెట్టుకోండి మీ ఇష్టం మేము



ఇలా గే నడుపుతాం. మా పడవలు ఆపేదెవరో చూ స్తాం. భద్రతా ప్రమాణాలు మాకు అవసరం లేదు మీరెవరు చెప్పడానికి మాకు అని అంటున్న పడవ యజమానులు.మర పడవలో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రేవు దాటా ల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.గ్రామల మధ్య నడిపే మరపడవ వద్ద సైతం భద్రాతా ప్రమాణాలు పాటిస్తున్న దాఖలాలు లేవని ప్రయాణికులు చెబుతున్నారు.మూగజీవాన్ని సైతం వందల జీవాన్ని పడవలెక్కించి తరలిస్తున్నారు ఎటువంటి భద్రత ప్రమాణాలు లేకుండా. తక్షణమే గౌరవ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్,నందిగామ ఆర్డీవో ఈ పడవల్ని పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.ఇక్కడ ఏ అధికారి పర్యవేక్షించాలో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. ఇది ఎన్టీఆర్ జిల్లా సంబంధించింది కాదు గుంటూరు జిల్లా సంబంధించిన పడవ... ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన పడవకు అనుమతులు లేవు కాబట్టి గుంటూరు జిల్లాకు సంబంధించిన పడవలకు అనుమతి ఉంది స్థానికంగా మీకు ఎటువంటి హక్కులు లేవు ఎటువంటి అధికారులకు అనుమతులు లేవు పడవ యాజమాన్యాలు గుంటూరు జిల్లాకు సంబంధించిన వారు కాబట్టి ఏదైనా ఉంటే గుంటూరు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేస్తారు మీ ఎన్టీఆర్ జిల్లాకు గాని అధికారులు కానీ పర్యవేక్షణ చేసే అధికారం లేదని పడవల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.


Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

# పోలవరం నిర్వాసితులకు శుభవార్త చెప్పిన కూటమి ప్రభుత్వం

- పరిహారం భారీగా పెంచిన ప్రభుత్వం
- ఇంటి స్థలానికి 2 లక్షలు
- సొంత ఇంటినిర్మాణానికి 3.57 లక్షలు
- ఓ టి ఎస్ కి 6.85 లక్షలు చెల్లింపు
- ఫలించిన తెలుగుదేశం నాయకుల కృషి

**ప్రజాభూమి ప్రతినిధి - కూనవరం**

పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం పెద్ద శుభవార్త ప్రకటించింది. ఇప్పటివరకు పునరావాస కాలనీలో ఇంటి స్థలం కొరకు చెల్లించే లక్ష రూపాయలను రెండు లక్షలు గా, సొంత ఇంటి నిర్మాణానికి కేటాయించిన 2.85 లక్షల ను 3.57 లక్షలు గా, ఓటీఎస్ వన్ టైం సెటిల్మెంట్ కోరుకునే నిర్వాసితులకు ఏకంగా 6.85 లక్షలు చెల్లించేలా చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా మారుతున్న నిర్వాసితుల పరిహారం పెంపుకు సంబంధించిన జీవో కాపీలను తీసుకొని తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు యడవల్లి భాస్కర రావు, ఉపాధ్యక్షుడు చెలకాని ఉమామహేశ్వర రావు పొడియం అప్పారావు,పారి సోమయ్య శ్రేణులు ఎమ్మెల్యే మిర్యాల శిరీషకి తెలియజేసి వారితో ప్రభుత్వ అధికారులతో ప్రభుత్వాన్ని ఒప్పించి ఆర్ అండ్ ఆర్ అధికారి ప్రాజెక్ట్ ఆఫీసర్ శుభం నక్వాల్‌కి, స్పెషల్ కలెక్టర్ అభిషేక్‌కి ఆ తర్వాత మంత్రి నిమ్మల రామానాయుడుకి తద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి నిర్వాసితుల బాధలు వివరించి జీవో ప్రకారం పరిహారం పెంపుకు కృషి చేయడం జరిగింది. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఆ మేరకు ఆదేశాలు ఇవ్వగా మంత్రివర్గం ఆమోదించిన అనంతరం బుధవారం చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ తాజా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఇది నిర్వాసితుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని మండల అధ్యక్షుడు యడవల్లి భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రాజకీయ పార్టీగా నిర్వాసితుల కోసం పని చేయడం అంటే ఐదేళ్లపాటు ఏ పురోగతి లేకుండా నోరు పారేసుకుని పడిపోవడం కాదని, గ్రౌండ్ లెవెల్ లో ఆ పనితనాన్ని చూపించాలని నిర్వాసితులకు నిజమైన ప్రయోజనాన్ని కలిగించాలని హితవు పలికారు. శరవేగంగా జరుగుతున్న ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ వలన అధికారులకు అందరూ సహకరిస్తే త్వరలోనే నిర్వాసితు అందరికీ పరిహారం పూర్తిస్థాయిలో అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మా వినతిని స్వీకరించిన ఐటీడీఏ పీవో పోలవరం ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వానికి మా నిర్వాసితులు తరపున మేము ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు తెలియజేశారు.



## బిజెపి శ్రేణులు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ




**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

కాశ్మీర్ పహల్గామలో జరిగిన పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా ప్రధాని మోదీ సూచన మేరకు ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ దళాల మహిళా అధికారుల నాయకత్వంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మే 7 వ తేదీకి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ద్రాక్షారామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వక్తలు మాట్లాడుతూ ఉగ్రవాదంపై భారత్ రాజీ లేని ధోరణికి సాక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ నిలిచిందని భారతీయ సైనికులకు సంఘీభావంగా ఈ ర్యాలీలో నిర్వహించినట్లు బిజెపి నాయకులు తెలియజేశారు. ఈ ర్యాలీలో మండల బిజెపి అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ బిజెపి సీనియర్ నాయకులు, అనకాపల్లి జిల్లా బిజెపి ఇంచార్జి కర్రి చిట్టిబాబు, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి, ఓ.బి.సి నాయకులు ఇంధన సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పెయ్యల రాంబాబు,మండల కిసాన్ మోర్చ నాయకులు రాయుడు రామకృష్ణ తదితర బిజెపి నాయకులు, ఆర్.ఎస్.ఎస్ నాయకులు బి.వి.బి.ఎల్ నారాయణ, వేలంపాలెం వేద పాఠశాల రవి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లేశ్వరం విఘ్నేశ్వరుడి ఆలయానికి మహర్దశ.. మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతల వెల్లువ

**ప్రజాభూమి ప్రతినిధి - నిడదవోలు**

నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధిపై తనదైన ముద్ర వేస్తున్న రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవతో పెరవలి మండలం మల్లేశ్వరం బీసీ కాలనీలోని శ్రీ వినాయక స్వామి ఆలయ పునర్నిర్మాణానికి 10 సెంట్ల స్థలం మరియు 20 లక్షల రూపాయల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, మల్లేశ్వరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, జనసేన నాయకులు కోటిపల్లి మురళీ కృష్ణ, మేడిచర్ల భాస్కర శివ కుమార్ లు అమరావతిలోని వెలగపూడి సచివాలయానికి వచ్చారు. మంత్రి దుర్గేష్ ని స్వయంగా కలిసి తమ గ్రామంపై ప్రత్యేక మక్కువతో దేవాదాయ శాఖ మంత్రి ఆనం



రామనారాయణ రెడ్డితో చర్చించి నిధులు మంజూరు చేయించినందుకు గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తులు విన్నవించిన వెంటనే మంత్రి దుర్గేష్ స్పందించి ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేయించి తన నిబద్ధతను చాటుకున్నారని నేతలు కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై కొందరు చేస్తున్న అనవసర విమర్శలకు, ఇటువంటి అభివృద్ధి పనులే గట్టి సమాధానమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. జనసేన పార్టీ తరపున మరియు కూటమి పక్షాన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న మంత్రి దుర్గేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ను వారు శాలువాతో సత్కరించారు. మంత్రి ప్రత్యేక దృష్టితో రాబోయే రోజుల్లో మల్లేశ్వరం వినాయక స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుండటంతో గ్రామ ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- రైతులకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు
- కోలంక గ్రామంలో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

**ప్రజాభూమి ప్రతినిధి - కాజులూరు**

కూటమి ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తుందని మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులకు కొత్త పట్టాదారు పాసుబుక్కులను సత్యం, తహసిల్దార్ గెద్దం రవీంద్రనాథ్ ఠాగూర్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చోటుచేసుకున్న అవకతవకలు, రైతుల ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం రీ-సర్వే నిర్వహించి, అనంతరం రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుబుక్కులను రైతులకు



అందజేస్తోంద న్నారు. రైతుల కోసం ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. 24 గంటల్లోగా రైతులకు నగదు చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ కాజులూరు మండలంలో సుమారు 1900 మంది రైతులకు పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమం కోసం గ్రామసభలు నిర్వహించి రైతుల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసి పాసుబుక్కులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురువారం కోలంక గ్రామంలో 110 మంది రైతులకు పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేశామని, ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ గ్రామసభలో డిప్యూటీ తహసిల్దార్ ఎం. శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వర రావు, మండల జనసేన అధ్యక్షుడు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహనాయుడు, కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాల రాజు,కోలంక గ్రామ కమిటీ అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబు రాజు, మాజీ సహకార సంఘ అధ్యక్షుడు దంతులూరి వెంకట నరసింహ రాజు, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామచంద్ర రాజు, దూడల రామగంగారావు, దంతులూరి వంశీ గ్రామ రెవెన్యూ అధికారులు సూర్య నారాయణమూర్తి, ధరణి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## టోల్గేట్ లో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం



**ప్రజాభూమి ప్రతినిధి - పెదపాడు**

పెదపాడు ఎస్ఐ ఆర్. శ్రీను కలపర్రు టోల్ గేట్ వద్ద బైక్ రైడర్ల కు హెల్మెట్ అవగాహన నిర్వహించారు. స్థానికంగానే హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నటు వంటి వారికి జరిమానా విధించకుండా హెల్మెట్ లను కొనుగోలు చేయించారు. హైవేపై హెల్మెట్ లేకుండా ప్రయాణం చాలా ప్రమాదకరం, ప్రాణాలకు హాని కలిగిస్తుందని తెలియజేశారు. అతివేగం, నిర్లక్ష్యం వల్ల మీకు, ఇతరులకు ప్రమాదాలు జరుగుతాయి. ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరండి అని పెదపాడు ఎస్ఐ ఆర్ శ్రీను స్పష్టం చేసినారు.

## వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్" గ్రామ సభలో సమస్యలు వెల్లువ

**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్" గ్రామ సభను గురువారం మండల పరిధిలోని వీర పాపాన కుంట గ్రామంలో అధికారులు గ్రామ సభను నిర్వహించారు. జరిగిన ఈ గ్రామసభను మండల తాసిల్దార్ వై సరస్వతి, ఎంపీడీవో ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామ సభలో నాలుగు దఫాలుగా గ్రామ సభలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కారం చేసేందుకు ఈ గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామసభలో గ్రామస్తులు అనేక సమస్యలు ఏకరు పెట్టారు. ములకనపల్లి నుండి వీరపాపన కుంట గ్రామం వరకు రహదారి వీరపాపనుకుంట గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణము, గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేసి వీధి లైట్లు ఏర్పాటు, అంగన్వాడీ బిల్డింగు నిర్మాణం చేపట్టాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్నా పోడు భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలని, గ్రామంలో మరమ్మతులకు గురైన చేతి పంపులు బాగు చేసి సురక్షిత నీటిని వినియోగంలోకి తేవాలని, వృద్ధాప్య వితంతు పెన్షన్లు మంజూరు కొత్త కార్డులు మంజూరు చేయాలని, గ్రామంలో అంతర్గత వీధి రోడ్లు నిర్మించాలని, పంటసాగుకు సంబంధించి చెరువు నిర్మాణం ఆయకట్టు స్థిరీకరణ జరిగేలా చూడాలని వివిధ రెవెన్యూ సమస్యలను గ్రామములో గ్రామస్తులు గ్రామ సభలో తాసిల్దార్ కు విన్నవించారు. దీనిపై ఆమె మూడు దఫాలుగా జరగనున్న గ్రామ సభల తదుపరి ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించి గిరిజన సమస్యలు గ్రామా సమస్యలు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వివిధ శాఖలలో వచ్చినటువంటి సమస్యలన్నీ



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఇమాన్యువేల్ తాసిల్దార్ వై సరస్వతి ఆమె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవలం మారయ్య, ఎల్ ఐ బాపూజీ, డిఆర్ఓ కోడి రాజేశ్వరి, ఆర్డబ్ల్యూఎస్ జై సాయిరాం, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, రెవిన్యూ శాఖ సిబ్బంది, సిపిఎం జిల్లా నాయకులు సోయం చినబాబు, గ్రామ నాయకులు సోయం భద్రయ్య తదితరులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు "అల్లూరి" త్యాగం నేటి తరానికి ఆదర్శం : అల్లూరి సీతారామరాజు వర్ధంతికి ఘన నివాళులు

**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

విప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించిన మహా విప్లవ వీరుడని కొనియాడారు. స్వాతంత్ర సంగ్రామంలో ఆయన చేసిన త్యాగం, ధైర్యసాహసాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.



గిరిజనుల హక్కుల కోసం, దేశ స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానుభావుడు అల్లూరి అని పేర్కొన్నారు. యువత అల్లూరి సీతారామరాజు జీవితం నుంచి దేశభక్తి, సేవాభావం, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్వార్థరహిత సేవతో ప్రజల కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం ద్వారా భావితరాలకు స్ఫూర్తి లభిస్తుందని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు అల్లూరి సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, ఎస్ కే పి పి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సలాది నాయుడు, క్లస్టర్ ఇంచార్జి కంచుమర్తి బాబురావు, కో క్లస్టర్ ఏలూరు ఏసుదాసు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు దంగేటి గౌరీ శంకర్, నియోజకవర్గ టిఎన్టియుసి ప్రెసిడెంట్ బాల శివరామకృష్ణ, 12వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, సిరిగినీడి దుర్గాప్రసాద్, ఉట్రుమిల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, త్రీ మెన్ కమిటీ డైరెక్టర్ సుంకర చినకాపు, యూనిట్ ఇంచార్జ్ కేత శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు మేక జానకి రామయ్య, 15వ బూత్ ఇంచార్జ్ గొర్రెల శ్రీను, వేగం పేట యూనిట్ ఇంచార్జ్ కొమరన్న శ్రీనివాసరావు, పిల్లి శ్రీను కుడిపూడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరంలో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**ప్రజాభూమి ప్రతినిధి - ఎటపాక**

పోలవరం నిర్వాసితుల సమస్యల ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి హామీ ఇచ్చారు. గన్న వరం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల త్యాగఫలితమే పోలవరం జిల్లా అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఒకే నియోజకవర్గంతో జిల్లా లేదని, పోలవరం జిల్లాకే ఆ ప్రత్యే కత దక్కిందన్నారు. మండలంలో పోలవరం ముంపుకు గురయ్యే భూములకు తగిన నష్టపరి హారం అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సెకండ్ పేజ్-45 కాంటూరు పరిధిలో ఉన్న బాధితులకు కూడా పరిహారం అందజేస్తామని, ముంపు బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. నిర్వాసితులందరికీ న్యాయం చేసిన తర్వాతే పోలవరం ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని తెలిపారు. టీడీపీ అబ్జర్వర్, వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ చెల్లి బోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు గ్రామ, మండల స్థాయిలో ఐక్యంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యులు భగవత్ కుమారి, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ముద్వా శ్రీనివాస్, పాటి చలపతిరావు, టీడీపీ యువ నాయ కులు నలజాల శ్రీకాంత్, పాటి సంపత్, తెలుగు యువత కార్యదర్శి వల్లభనేని చందు, మండల కార్యదర్శి కణితి మధు, మహిళా నాయకురాలు రూపా లక్ష్మి, బీసీ సెల్ సురేష గౌడ్, ఎంపీటీసీ పాయం దేవి, చంద్ర రఘు, బాచినేని మల్లేశ్వర రావు, మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు "అల్లూరి" త్యాగం నేటి తరానికి ఆదర్శం

**అల్లూరి సీతారామరాజు వర్ధంతికి ఘన నివాళులు**



**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

విప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించిన మహా విప్లవ వీరుడని కొనియాడారు. స్వాతంత్ర సంగ్రామంలో ఆయన చేసిన త్యాగం, ధైర్యసాహసాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. గిరిజనుల హక్కుల కోసం, దేశ స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానుభావుడు అల్లూరి అని పేర్కొన్నారు. యువత అల్లూరి సీతారామరాజు జీవితం నుంచి దేశభక్తి, సేవాభావం, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్వార్థరహిత సేవతో ప్రజల కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం ద్వారా భావితరాలకు స్ఫూర్తి లభిస్తుందని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు అల్లూరి సేవల ను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, ఎస్ కే పి పి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సలాది నాయుడు, క్లస్టర్ ఇంచార్జి కంచుమర్తి బాబురావు, కో క్లస్టర్ ఏలూరు ఏసుదాసు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్య క్షులు దంగేటి గౌరీ శంకర్, నియోజకవర్గ టిఎన్టియుసి ప్రెసిడెంట్ బాల శివరామకృష్ణ, 12వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, సిరిగినీడి దుర్గాప్రసాద్, ఉట్రుమిల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, త్రీ మెన్ కమిటీ డైరెక్టర్ సుంకర చినకాపు, యూనిట్ ఇంచార్జ్ కేత శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు మేక జానకి రామయ్య, 15వ బూత్ ఇంచార్జ్ గొర్రెల శ్రీను, వేగం పేట యూనిట్ ఇంచార్జ్ కొమరన్న శ్రీనివాసరావు, పిల్లి శ్రీను కుడిపూడి కనకరాజు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలు ఉప ముఖ్యమంత్రి దృష్టికి

**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం**



పోలవరం ముంపు బాధితుల సమస్యలు, 2025 వరద నష్టపరిహారం, రాబోవు వరదలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, చాంబర్‌లో ఉన్న వ్యక్తిగత అధికారులతో, పి.ఏ.సి,చైర్మన్, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి,నాదెండ్ల మనోహర్, ఓ.ఎస్.డి,ని, కలిసి మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని వివరించామని కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, జనసేన పార్టీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ గురువారం అమరావతిలో వారిని కలిసి మండల సమస్యలు పరిష్కరించాలని కోరామని చెప్పారు. జూన్, జూలై, ఆగస్టు, మాసాల్లో వరదలు విపరీతంగా వచ్చేఅవకాశం ఉందని, నిర్వాసితులను అన్నీ విధాలుగా ఆదుకోవాలని సూచించామన్నారు. ఫ్లడ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరామని చెప్పారు. నిత్యావసర సరుకుల ఏర్పాటుచేసి తాత్కాలికంగా ఆదుకోవాలని, వీలైనంత త్వరగా హౌస్ ట్రక్చర్ వ్యాల్యూ, ఆర్ఆర్, ఏర్పాటు చేయాలని కోరామన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన రోడ్లను పూర్తిచేయాలని, 2025 వరద నష్టపరిహారం ఇవ్వాలని సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అందించామని, సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఛాంబర్ లో ఉన్న అధికారులతో పోలవరం నిర్వాసితుల సమస్యలు మరియు మండలంలోని ప్రధాన సమస్యల పై చర్చించడం జరిగిందని తెలిపారు.

## శ్రీఅష్టభుజలక్ష్మీనారాయణ స్వామి వారి సన్నిధిలో శ్రీవారితిరుక్కళ్యాణం



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లు దివ్యనగరం లో వేంచేసియున్న శ్రీఅష్టభుజలక్ష్మీనారాయణ స్వామి వారి సన్నిధిలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజున స్వామి వారి తిరుక్కళ్యాణం ఆలయ అర్చకులు శ్రీమాన్ కరి పవన్ స్వామి వారి బ్రహ్మోత్వంలో అత్యంత వైభవంగా కనులవిందుగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. .ఆలయ కార్యనిర్వహణాధికారి బిరుదుకోట శంకర్ గారు ట్రస్టు బోర్డు చైర్మన్ రేపాక ప్రవీణ్ భాను, ట్రస్టు బోర్డు సభ్యులు మల్లవోలు సురేష్, కాసాని శశిరేఖ, వరదా శేషు, మైగపుల పద్మజ, గోనేటి నాగ లీల, శేషభట్టారు పవన్ ,ఉత్సవ కైంకర్యపరులు శ్రీమతి బంగారు అమ్మాజీ మరియు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు నున్న కోటి, మాజెటి రాంబాబు, దాసరి నగేష్, రేపాక సుబ్బారావు, మామిడి బాబు ఏర్పాట్లు చేశారు.

## జలధారతో చెరువులకు నూతన జీవం

- ఫీడర్ ఛానళ్ల పునరుద్ధరణతో బహుళ ప్రయోజనాలు
- సాగునీటితో పాటు భూగర్భ జలాల వృద్ధికి దోహదం
- ప్రభుత్వ జల సంరక్షణ కార్యక్రమాలపై సర్వత్రా హర్షం



ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార--జలహారతి కార్యక్రమం కింద ఎన్టీఆర్ జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జి.కొండూరు మండలంలోని చెరువుమాధవరం గ్రామ పరిధిలో ఉన్న గ్రంథివాని చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పూర్తయితే వర్షాకాలంలో వచ్చే నీరు సక్రమంగా చెరువుకు చేరే అవకాశం కలుగుతుంది. దీంతో గ్రంథివాని చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, గ్రామంలోని వ్యవసాయ భూములకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. చెరువు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుంది. అదేవిధంగా రైతులు వరి, మిర్చి, కూరగాయలు తదితర పంటలను సకాలంలో సాగు చేసుకునే అవకాశం పొందడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశముంది.అదేవిధంగా గ్రామ పరిసరాల్లో పచ్చదనం పెరగడం, పశువులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడడం, నీటి కొరత సమస్య తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు గ్రామ ప్రజలకు చేకూరనున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత చెరువుమాధవరం గ్రామం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# పవన్ కళ్యాణ్ కూడా సింగిల్‌గా పోటీ చేసి సీఎం అవ్వాలి

- 2029లో 70సీట్లు ఇస్తేనే కూటమిలో ఉండాలి
- సోషల్ మీడియాలో జోరుగా ట్రోలింగ్





ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

తమిళనాడులో టీవీ కె పార్టీ అధినేత, సినీ హీరో విజయ్ సింగిల్ గా పోటీ చేసి 108 సీట్లు తెచ్చుకుని ఇతర పార్టీలు మద్దతుతో సీఎం అవుతున్న నేపథ్యంలో ఏపీలో కూడా జనసేన అధినేత, పవన్ కళ్యాణ్ కూడా అత్యధిక పాన్ ఫాలోయింగ్ కలిగిన నేపథ్యంలో 2024లో కూడా సింగిల్ గా పోటీ చేసి ఉంటే సీఎం అయ్యేవారని సోషల్ మీడియాలో జోరుగా ట్రోలింగ్ అవుతుంది. ఎప్పుడు చూసినా మరో 15 ఏళ్లపాటు చంద్రబాబు నాయుడు సీఎం గా ఉంటారని ఆయనకు మద్దతు తన పార్టీ ఉంటుందని చెబుతుండడంతో పాటు జనసేన సైనికులు, కాపు సామాజిక వర్గానికి మింగుడు పడని పరిస్థితి నెలకొన్న విషయం తెలిసిందే.విజయ్ సీఎం రేంజ్ సీట్లు గెలవడానికి కారణాలు ఇవే:: టీ వీకే పార్టీ అధినేత విజయ్ సీఎం రేంజ్కి అవసరమైన సీట్లు గెలవడానికి కారణాలు ఇలా ఉన్నాయి. తమిళనాడులో ఓటుకు నోటు ప్రభావం లేదు. కాకపోతే ఎన్నికల హామీలు బలంగా అక్కడ ప్రజల్లోకి చొచ్చుకుని పోయాయి అంటున్నారు. 60 ఏళ్ల లోపు మహిళలకు నెలకు 2500 రూపాయలు హామీ, పెళ్లి కాని మహిళలకు ?1, 50, 000 విలువ గల బంగారం, పట్టు చీర హామీ, ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు, వృద్ధులకు నెలకు 3000 రూపాయలు పింఛన్లు, రైతు భరోసా, 5 ఎకరాల లోపు వారికి పూర్తి రుణమాఫీ, పేద విద్యార్థులకు రు.15000, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, అంగన్వాడీలకు రూ. 18, 000 వేతనం పెంపు, ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తదితర హామీలతో నూట ఎనిమిది సీట్లు వరకు గెలుపొందినట్లు ప్రచారం జరుగుతుంది. లక్షల కోట్ల బడ్జెట్ ఈ హామీలు ఎంతవరకు నెరవేరుతాయి అనేది కూడా చర్చినీ అంశంగా మారింది.

**పవన్ కళ్యాణ్ 2019లో గెలవక పోవడనికి కారణాలు ఇవే:**

జనసేన పార్టీ అధినేత, పవన్ కళ్యాణ్ 2019లో గెలవక పోవడానికి అనేక కారణాలు ఉన్నాయంటున్నారు. ఓటుకు నోటుకు పవన్ కళ్యాణ్ విముఖత చూపడం, అధిక బడ్జెట్ తో కూడిన అమలు కానీ హామీలు ఇవ్వలేకపోవడం ప్రధాన కారణాలు అంటున్నారు. దీంతో పాటు ఏపీ ఓటర్లలో కులాల ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుందని, 20 శాతం ఓటర్లు ఉన్న కాపు సామాజిక వర్గాన్ని పక్కనపెట్టి రెడ్లు, కమ్మ సామాజిక వర్గాలకు కొమ్ము కాయడం కూడా పవన్ కళ్యాణ్ ఓటమికి కారణాలని మరికొందరు చెబుతున్నారు.

**2029 ఎన్నికల్లోనైనా పవన్ కళ్యాణ్ మైండ్ సెట్ మార్చుకోవాలని జన సైనికులు డిమాండ్:**

ఒకవైపు లోకేష్ ను రాబోయే కాలంలో సీఎం కుర్చీ లెక్కించడానికి ఆ పార్టీ వర్గాలు వ్యూహం రచించుకుంటుండగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రం తన ఇష్టానుసారంగా ప్రతిసారి వచ్చే 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వమే ఉండాలని, చంద్రబాబు సీఎంగా ఉండాలని చెప్పడం జనసేన నాయకులు కార్యకర్తలు, అదేవిధంగా కాపు సంఘాల నాయకులు నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంతసేపు పల్లకి మోస్తే పల్లకి ఎక్కి నాటికి ఎం దరం ఉంటామో ఎందరం పోతామో తెలియకుండా ఉందని, అలాగే వైసీపీ అన్నట్లు గా ప్యాకేజీ స్టార్ అని కూడా అపవాదు వినాల్సి వస్తోందని పలువురు కాపు,నాయకులు జనసేన నాయకులు బహిరంగంగానే అంటున్నారు.

**2029లో 70 టికెట్లు ఇస్తేనే కూటమిలో ఉండాలి:**

2029 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూటమి పార్టీ లోనే ఉండాలనుకుంటే 70 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే ఉండాలని లేదంటే బయటకు వచ్చేసి పటీవీకే విజయ్ మాదిరిగ ఒంటరిగానే బరిలోకి దిగాలని జనసేన నాయకులు, కార్యకర్తలు, కాపు సంఘాల నాయకులు కోరుతున్నారు. ఏది ఏమైనా తమిళనాడులో సినిమా ప్రభావం తో టీవీ కే పార్టీ అధినేత విజయ్ గెలుపుతో మళ్లీ ఏపీలో కూడా పవన్ కళ్యాణ్ ఒంటరి పోటీపై చర్చనీయాంసంగా మారడంవిశేషం. ఇంకా రాబోయే కాలంలో ఏం జరుగుతుందనేది వేచి చూడాల్సిందే మరి.

# సింగపూర్ మోడల్‌పై ఏపీ దృష్టి

- 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- జిల్లాల సమగ్ర పాలన, రియల్‌టైమ్ మానిటరింగ్, ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ల మొదటి రోజు సమావేశంలో సింగపూర్ పర్యటన వివరాల్ని వివరించిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

సింగపూర్ పర్యటన అనంతరం ఆంధ్రప్రదేశ్ లో పరిపాలనా సంస్కరణలకు వేగం పెంచేందుకు 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సింగపూర్ పర్యటనపై సమగ్ర నివేదికను ఆయన సమర్పించారు. సింగపూర్ పర్యటన ద్వారా విలువైన సమాచారాన్ని తెలుసుకోగలిగామని, దీన్ని ఏపీలో అమలు చేసే దిశగా ముఖ్యమంత్రికి తమ అనుభవాల్ని నివేదించామని మంత్రి తెలిపారు.

సింగపూర్ పర్యటన... పరిపాలన, డిజిటల్ గవర్నెన్స్, శాఖల మధ్య సమన్వయం, ప్రజా కేంద్రీకృత సేవలపై విలువైన అవగాహన కల్పించిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యుల మంత్రివర్గ ప్రతినిధి బృందం ఏడు రోజుల పాటు సింగపూర్‌లో విస్తృత స్థాయి అధ్యయనం నిర్వహించిందన్నారు.నిపుణుల నేతృత్వంలోని సమావేశాలు, మంత్రులతో చర్చలు, కేస్ స్టడీలు, సిమ్యులేషన్ వ్యాయామాలు, మౌలిక సదుపాయాల క్షేత్ర పర్యటనల ద్వారా పాలనా వ్యవస్థల అమలు తీరు ప్రత్యక్షంగా పరిశీలించినట్లు చెప్పారు.

"దార్శనికతకు క్రమశిక్షణతో కూడిన కాలపరిమితి అమలు జతకట్టినప్పుడే పాలన ఫలిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో నాయకత్వం, విజన్ ఉన్నాయి. ఇప్పుడు అమలు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది" అని మంత్రి స్పష్టం చేశారు.

**'హోల్ ఆఫ్ గవర్నమెంట్' మోడల్ అధ్యయనం**

సింగపూర్‌లో శాఖల మధ్య నిరంతర సమన్వయం, డేటా సమీకరణ, రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా ప్రజాసేవలు వేగంగా అందుతున్నాయని మంత్రి తెలిపారు. అక్కడి "హోల్–ఆఫ్–గవర్నమెంట్" విధానం ఆధారంగా రాష్ట్రంలో కూడా సమగ్ర జిల్లా పాలన వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ గృహ నిర్మాణ కాలనీల్లో ఆరోగ్య సేవలు, క్రీడా మైదానాలు, గ్రంథాలయాలు, ఆహార కేంద్రాలు, పౌర సేవలను ఏకీకృతం చేసిన కమ్యూనిటీ మౌలిక సదుపాయాల నమూనా ప్రతినిధి బృందాన్ని ఆకట్టుకుందని పేర్కొన్నారు.

**జురాంగ్ పోర్టు, ఆటోమేటెడ్ వ్యవస్థల పరిశీలన**

సింగపూర్‌లోని జురాంగ్ పారిశ్రామిక ప్రాంతం, ప్రపంచంలోనే అతిపెద్ద స్వయంచాలిత ఓడరేవులలో ఒకదాన్ని సందర్శించినట్లు మంత్రి తెలిపారు. అక్కడ కంటైనర్ రవాణా, లాజిస్టిక్స్ కార్యకలాపాలు స్వయంప్రతిపత్తి వ్యవస్థలు, కేంద్రీకృత కమాండ్ సెంటర్ల ద్వారా నిర్వహిస్తున్న తీరు అధ్యయనం చేసినట్లు చెప్పారు.

**వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణపై దృష్టి**

వాతావరణ మార్పులను తట్టుకునే పట్టణ ప్రణాళిక, నీటి నిర్వహణ, వరద నియంత్రణ, పచ్చదనం వంటి కార్యక్రమాలు సింగపూర్ ప్రత్యేకతగా నిలిచాయని మంత్రి పేర్కొన్నారు. మహమ్మారి వంటి విపత్తులు వచ్చినప్పుడు అనుసరించాల్సిన విధానాలు, అత్యవసర సన్నద్ధత, సాంకేతికత ఆధారిత పాలనపై అక్కడి అనుభవాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో స్వదేశీ వ్యాక్సిన్ అభివృద్ధి, భారీ టీకా కార్యక్రమాలు, ఇతర దేశాలకు వైద్య సహాయం అందించిన భారత అనుభవాన్ని కూడా ప్రతినిధి బృందం సింగపూర్ అధికారులతో పంచుకున్నట్లు చెప్పారు.

**90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రధానాంశాలు**

సమగ్ర జిల్లా పాలన, రియల్‌టైమ్ పర్యవేక్షణ వ్యవస్థలు, పౌర అభిప్రాయ సేకరణ యంత్రాంగాలు, ఏకీకృత ఫిర్యాదు పరిష్కార వేదికలు, శాఖల మధ్య సమన్వయం, డిజిటల్ ఆరోగ్య సేవలు, విపత్తు నిర్వహణ, సైబర్ నేరాల నియంత్రణ, సహజ వ్యవసాయ ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. సింగపూర్ పరిమాణం, జనాభా ఆంధ్రప్రదేశ్‌తో భిన్నమైనప్పటికీ, అక్కడి ఉత్తమ పాలనా విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అనుసరిస్తే రాష్ట్రంలో ప్రజాసేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు.

# మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ప్రోద్బలంతో భూకబ్జా యత్నంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- వైసీపీ నేత భూదౌర్జన్యం.. తప్పుడు పాస్ బుక్కులతో వారసత్వ భూమి ఆక్రమణ
- వైసీపీ సానుభూతిపరులకు కొమ్ముకాస్తున్న సర్వేయర్.. చర్యలు తీసుకోవాలని వినతి
- నకిలీ పత్రాలతో వైసీపీ నాయకుల బరితెగింపు.. న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు
- ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనూరాధ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

ప్రజాభూమి ప్రతినిధి–మంగళగిరి

కర్నూలుకు చెందిన టి. కుమారి నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. సర్వే నంబర్ 781/ఆ2, అయ్యప్ప స్వామి దేవాలయం వెనుక, కేసీ కెనాల్ గట్టు సమీపంలో సుమారు 22 మంది పేద కుటుంబాలము నివాస స్థలాలను కలిగి ఉన్నాము. తమ వద్ద సదరు స్థలాలకు సంబంధించిన అన్ని రకాల పట్టాలు, ఆధారాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వారు కూడా ఎటువంటి అభ్యంతరం లేదని ధృవీకరించారు. అక్కడ తన సొంత ఖర్చులతో కాళికామాత దేవాలయాన్ని నిర్మించి, పూజలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాను. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ప్రోద్బలంతో స్థానిక వైసీపీ నాయకులు, కొంతమంది రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ శక్తులు తమ స్థలాలపై కన్నేసి మమ్మల్ని ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో నిత్యం అర్ధరాత్రి వేళల్లో తప్పతాగి వచ్చి, అసభ్య పదజాలంతో తమను దూషిస్తున్నారు. తనను, తన భర్తను, కోడలిని మారణాయుధాలతో బెదిరించి, విచక్షణారహితంగా కొట్టి తీవ్రంగా గాయపరిచారు. తమ ప్రాణాలు తీస్తామని నిరంతరం హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే తాము కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇతర అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఇంతవరకు ఎటువంటి జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనూరాధ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం ఆలవాల గ్రామానికి చెందిన రమేష్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 54/1ఆ మరియు 54/1ఇ లో తమకు పూర్వీకుల నుండి వచ్చిన భూమి ఉంది. తమ భూమిలో సుమారు 4 ఎకరాలను వైసీపీ నాయకుడు గ్రంథం వెంకట రావు అక్రమంగా పురిమేట్ల బేబీ అనే ఆవిడ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. అంతేకాకుండా సదరు నాయకుడు తన పాస్ బుక్‌లో 5.15 ఎకరాల భూమిని అదనంగా ఎక్కించుకుని మొత్తం ఖాతా నంబరు 471 తో తప్పుడు రికార్డులు సృష్టించారు. తమ భూమిని ఆక్రమించడమే కాకుండా, తమపైనే కోర్టులో తప్పుడు కేసులు వేసి మమ్మల్ని మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ భూమి రిజిస్ట్రేషన్, రికార్డులను వివాదంలో పెట్టి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడు గ్రామానికి చెందిన పార్థసారథి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. మండల సర్వేయర్ బండ్లపల్లి జ్యోతి, రాజకీయ కారణాలతో ప్రతిపక్ష వైసీపీ పార్టీ సానుభూతిపరులకు కొమ్ముకాస్తున్నారు. సర్వే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, చీకటి పడిన తర్వాత కొలతలు వేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మాజీ వాలంటీర్లు, సర్వే ప్రక్రియను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. గుడివాడ ఆర్డీఓ గారు సదరు సర్వేయర్‌ను వివాదాస్పద స్థలానికి వెళ్లవద్దని ఆదేశించినప్పటికీ, ఆమె సర్వే రోజున అక్కడ ఉండి అధికారులను ప్రభావితం చేయడం గమనార్హం. సర్వే నిర్వహించడానికి వెళ్లిన గన్నవరం సర్వేయర్‌ను స్థానిక ఆక్రమణదారులు అడ్డుకోవడమే కాకుండా భూమిని కొలవనివ్వకుండా దౌర్జన్యానికి దిగుతున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన బీసపోగు రాంబాబు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..గత ప్రభుత్వ హయాంలో వైసీపీకి చెందిన సాధుపాటి నాగశ్రీను, నాగరాజు అనే వ్యక్తులు తమ పొలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించారు. వీరు తమపై తప్పుడు కేసులు, పిటిషన్లు వేసి వేధించారు. సదరు వ్యక్తులు ఒక నకిలీ డి.కె. పట్టా సృష్టించి, రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించారు. అప్పట్లో సర్వేయర్ చండీరాణి గారు, ఇతర రెవెన్యూ, పోలీస్ అధికారులు మమ్మల్ని బెదిరించి మానసిక క్షోభకు గురిచేశారు. అధికారుల వేధింపులు తట్టుకోలేక తమ నాన్నగారు తీవ్ర ఒత్తిడితో మరణించారు. గత ఏడాది జరిగిన రీ–సర్వేలో ఆ వ్యక్తులు చూపించిన డాక్యుమెంట్లన్నీ నకిలీవని తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు కూడా నిర్ధారించారు. తమ భూమికి సంబంధించి నిజం నిరూపించబడినప్పటికీ, ఇంతవరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాలేదు. పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారులు జాప్యం చేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

తూర్పుగోదావరి జిల్లా గోపాలాపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన గద్దె వెంకట



కృష్ణారావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. వెంకటాయపాలెం గ్రామంలో సర్వే నెం. 15/4 లో తనకు 3.63 ఎకరాల పూర్వార్జిత భూమి ఉంది. సుమారు 26 ఏళ్ల క్రితమే తన భార్యతో విడాకులు తీసుకుని, ఆమెకు మనోవర్తి ఇచ్చి విడిగా ఉంటున్నాను. ఈ క్రమంలో తన అనుమతి లేకుండా, ఎటువంటి చట్టబద్ధమైన పత్రాలు లేకుండా తన భార్య గద్దె విజయ, గద్దె గాయత్రి సుమన్ పేర్ల మీద రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా నమోదు చేయించుకున్నారు. గత ఏడాది కాలంగా గోపాలాపురం తహశీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతూ అనేక అర్జీలు ఇచ్చాను. కానీ రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

అనంతపురం జిల్లా శింగనమల మండలం చిన్నమట్లగొంది గ్రామానికి చెందిన రవీంద్ర గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సలకం చెరువు పొలం సర్వే నంబర్ 334లో తమకు 9.19 ఎకరాల భూమి ఉంది. ఇందులో 50 సెంట్ల భూమి ఆక్రమణకు గురైంది. దీనిపై రీ–సర్వే చేసి హద్దులు నిర్ణయించమని కోరగా శింగనమల మండల తహశీల్దార్, గ్రామ సర్వేయర్ కలిసి 'నకిలీ మ్యాపులు' సృష్టించి తమకు రావలసిన భూమి దక్కకుండా అక్రమ సర్వే చేశారు. న్యాయం చేయమని కోరినందుకు తహశీల్దార్ గారు తమను మానసికంగా వేధించడమే కాకుండా, పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన ముక్కంటి లక్షుమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 34 లో తనకు 0.95 సెంట్ల రిజిస్టర్ భూమి ఉంది. ప్రకాశం జిల్లా వేములపాడుకు చెందిన కర్నాటి బలరామిరెడ్డి అనే వ్యక్తి, తాను నిర్మించాలనుకుంటున్న దేవుని గర్భగుడికి లోన్ ఇప్పిస్తానని నమ్మించి, తన సంతకాలను అక్రమంగా వాడుకుని నకిలీ పత్రాలు సృష్టించాడు. తనకు తెలియకుండానే ఆ భూమిని వేరే వ్యక్తికి రూ. 24 లక్షలకు అడ్వాన్స్ కు అమ్ముకున్నాడు. ఈ విషయం అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు. తన ఇంటికి వెళ్లే దారిలో కంపలు, ఇటుకలు వేసి అడ్డుకుంటున్నాడు. అసభ్య పదజాలంతో తిడుతూ, తనపై దాడికి ప్రయత్నిస్తున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం రెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఎన్. నారాయణ రెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 1995వ సంవత్సరంలో సైనిక కోటా కింద భూమి కోసం దరఖాస్తు చేసుకున్నాను. అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ మన్మోహన్ సింగ్, ఐ.ఏ.ఎస్. గారు స్పందిస్తూ.. తాడిపత్రి మండలం, ఆలూరు గ్రామంలోని సర్వే నంబర్ 1261–జ1 లో 5.88 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ గత 30 ఏళ్లుగా ఆ భూమి తన పేరు మీద రిజిస్ట్రేషన్ కాలేదు. తాజా ఫిర్యాదు (నూ202601192759) పై తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయం స్పందిస్తూ.. సదరు సర్వే నంబర్‌లో ప్రస్తుతం ఖాళీ భూమి లేదని, కావున భూమి కేటాయించడం సాధ్యం కాదని సమాధానం ఇచ్చారు. కలెక్టర్ స్వయంగా భూమిని కేటాయించి ఉత్తర్వులు ఇచ్చినా, క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తనకు కేటాయించిన పాత భూమినైనా అప్పగించాలని, లేదా ప్రత్యామ్నాయంగా తాడిపత్రి సమీపంలో ఎక్కడైనా అంతే విస్తీర్ణంలో భూమిని కేటాయించి తనకు న్యాయం చేయాలని కోరాడు.పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కాకాని గ్రామానికి చెందిన గోనుగుంట్ల పూర్ణ చంద్రరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ ముత్తాత ఆరికట్ల అప్పయ్య గారు 1951లో (దస్తావేజు నం. 3507) తమ తండ్రిగారైన వెంకటేశ్వర్లు, బాబాయ్ పేరయ్య గారి పేరు మీద భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. అందులో సర్వే నం. 245/ఆ లో 0.76 సెంట్లు, 245/ఇ లో 1.16 సెంట్లు ఉన్నాయి. గతంలో తమ తండ్రిగారికి ఇచ్చిన పాస్ పుస్తకాలలో సర్వే నం. 245/దీ లో 0.38 సెంట్లు ఉన్నట్లు రికార్డు అయి ఉంది. తమకున్న వాటా ప్రకారం తన పాస్ పుస్తకంలో కూడా సర్వే నం. 245/1దీ లో 0.38 సెంట్లు నమోదై ఉంది. ప్రస్తుతం ఈ భూమికి సంబంధించి సరిహద్దులు స్పష్టంగా లేవు. తమ తమ్ముడికి రావాల్సిన భాగం కూడా విడదీయడం జరిగింది. కానీ క్షేత్రస్థాయిలో హద్దులు ఖచ్చితంగా తెలియకపోవడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది.